ఆదివారం
14-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 354
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

రష్యాలో మళ్లీ భారీ భూకంపం

మాస్కో: రష్యాలోని కామ్చాట్కా తీరంలో మరో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.4గా నమోదైంది. 39.5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు ఈవిషయాన్ని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ మాత్రం భూకంపం తీవ్రతను 7.1గా వెల్లడించింది. సునామీ ముప్పు లేదని పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం ప్రకటించింది. జపాన్‌కూ సునామీ హెచ్చరిక జారీ కాలేదు. కామ్చాట్కా తీరంలో ఇటీవల 8.8 తీవ్రతతో భూకంపం వచ్చినప్పుడు సునామీ హెచ్చరికలు జారీ అయిన విషయం విదితమే.

చుక్క నీరు వదులుకోం

- 904 టీఎంసీల వాటా సాధించే వరకు పట్టుబట్టాలి
- ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించండి
- ప్రాజెక్టుల వివరాలన్నీ అందించండి
- సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్ : కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులను, ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణాలో నికర జలాలు అయినా... మిగులు... వరద జలాలు అయినా సరే తెలంగాణాకు చెందాల్సిన నీటి వాటాలో ఒక్క చుక్క నీరు కూడా వదులుకునేది లేదని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ కె.వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ.ఎన్.సి అంజద్ హుస్సేన్, సీఎంవో సెక్రెటరీ మాణిక్ రాజ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించతలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని సీఎం అధికారులకు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంటన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్‌కు అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకుని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 299 టీఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఆంధ్ర ప్రదేశ్ ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు పది టీఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవటంతో పాటు పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ

- మిగతా 2 లో

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్: కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నీటివాటాలో చుక్క నీరు కూడా వదులుకునే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 విచారణలో తాను పాల్గొనబోతున్నట్లు వెల్లడించారు. కృష్ణా జలాలపై అనుసరించాల్సిన వ్యూహంపై శనివారం నీటిపారుదలశాఖ కేంద్ర కార్యాలయం జలసౌధలో న్యాయనిపుణులు, నీటిపారుదల

- మిగతా 2 లో

డ్రగ్స్ కలకలం

- పాఠశాలలోనే తయారీ కర్మాగారం
- రూ.కోటి విలువైన మత్తుమందు స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-హైదరాబాద్: మహానగరంలోని ఓ పాఠశాలలో డ్రగ్స్ తయారీ కలకలం రేపింది. ఒకవైపు పాఠశాల నడుపుతూనే మరో వైపు అదే పాఠశాలలోని రెండో అంతస్తులో మత్తు మందు తయారీ కర్మాగారం కొనసాగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... సికింద్రాబాద్ పాతబోయిన్‌పల్లిలోని మేధా ప్రైవేటు పాఠశాలలో అల్ప్రాజోలం తయారీ కేంద్రం బట్టబయలైంది. ఈగల్ బృందం పోలీసులు పాఠశాలపై దాడి చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పక్కా సమాచారంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి పాఠశాలపై దాడి చేశారు. రెండంతస్తుల భవనంలో పాఠశాల కొనసాగుతుండగా.. రెండో అంతస్తులో అక్రమ దందా కొనసాగుతోంది. ఒక వైపు ఉన్న రెండు గదుల్లో పాఠశాల నిర్వాహకుడు జయప్రకాష్‌గౌడ్ అల్ప్రాజోలం తయారీ యంత్రాలతో మొత్తం వ్యవహారం నడిపిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. రెండేళ్ల క్రితం నుంచి పాఠశాలను జయప్రకాష్ గౌడ్ నిర్వహిస్తున్నట్టు తేలింది. ఉదయం సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా పాఠశాల కొనసాగుతుండగా...పాఠశాల ఆవరణలోనే మరో రెండు గదుల్లో అల్ప్రాజోలం తయారీ నిర్వహిస్తున్నట్టు ఈగల్ బృందం దాడుల్లో బయటపడింది. ముడిసరుకు రసాయన దుకాణాల్లో కొనుగోలు చేసి తీసుకువచ్చి ఆరు నుంచి ఏడు సార్లు ప్రాసెస్ చేసి అల్ప్రాజోలంను తయారు చేస్తున్నట్టు గుర్తించారు. ప్రస్తుతం పాఠశాల పదో తరగతి వరకు సాగుతోంది. అయితే చుట్టు పక్కల నివసించే వారికి కూడా ఎటువంటి అనుమానం రాకుండా గుట్టు చప్పుడు కాకుండా దందా కొనసాగుతోంది. విషయం బయటపడడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పోలీసులు పాఠశాల నుంచి రూ.20 లక్షల నగదుతో పాటు రూ.కోటి విలువైన ఏడు కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితులు ఇంకా ఏమైనా మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారా అనే కోణంలో ఈగల్ బృందం ఆరా తీస్తోంది.

మావోయిస్టు సుజాతక్క లొంగుబాటు

విశాలాంధ్ర-హైదరాబాద్: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన ఎలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట శనివారం లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. ఆమె పశ్చిమబెంగాల్‌లో 2011లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య. ప్రస్తుతం చత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇంఛార్జిగా ఉన్నారు. 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్న ఆమెపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను తెలంగాణ

- మిగతా 2 లో



ఏపీలో రెండు ప్రదేశాలకు యునెస్కో గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని రెండు అద్భుతమైన ప్రదేశాలు... తిరుమల కొండలు, విశాఖపట్నం సమీపంలోని ఎర్రమట్టి దిబ్బలు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించాయి. 1500 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఎర్రమట్టి దిబ్బలు సహజ ఆక్సీకరణ కారణంగా ప్రత్యేకమైన ఎర్రటి రంగు కలిగి ఉంటాయి. ఈ రకమైన మట్టి దిబ్బలు ప్రపంచంలో మరో రెండుచోట్ల మాత్రమే

- మిగతా 2 లో

16 నుంచి కౌన్సెలింగ్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం సెప్టెంబరు 16 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ షెడ్యూలు విడుదల చేసింది. సెప్టెంబర్ 15న జనరల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టనున్నట్లు వెల్లడించింది. తాజా షెడ్యూల్ ప్రకారం మొదటి విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభం కానుంది. సెప్టెంబరు 30వ తేదీ నాటికి అన్ని దశల్లో కౌన్సెలింగ్ పూర్తి చేయనున్నట్లు యూనివర్సిటీ పేర్కొంది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సెప్టెంబర్ 17 నుంచి 19వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు

- మిగతా 2 లో

సీపీఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా వీరపాండియన్

చెన్నై: సీపీఐ తమిళనాడు రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎం.వీరపాండియన్ ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఉన్నారు. పార్టీ యువజన విభాగం అయిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)లో పని చేశారు. గత నెల సేలంలో జరిగిన మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక వాయిదాపడింది. అయితే శనివారం జరిగిన సీపీఐ రాష్ట్ర కమిటీ సమావేశం వీరపాండియన్‌ను ఎన్నుకుంది. ఆయన ఆర్.ముతరాసన్ స్థానంలో నియమితులయ్యారు. వీరపాండియన్ నాయకత్వం రాష్ట్రంలో పార్టీకి పునరుత్తేజం ఇవ్వగలదని, మరింత కచ్చితత్వం, నిబద్ధతతో ముందుకు వెళ్లగలదని అగ్ర నాయకులు ఆకాంక్షించారు.

నూతన కార్యదర్శిగా ఎన్నికైన వీరపాండియన్‌కు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు కొన్ని సలహాలు, సూచనలు చేశారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి ముతరాసన్ సేవలను కొనియాడారు. పార్టీ బలోపేతానికి ఆయన కట్టుబడ్డారని ప్రశంసించారు.

మార్చి 5న నేపాల్ ఎన్నికలు

తేదీ ఖరారు చేసిన నూతన ప్రధాని కార్కి

ఖాట్మండు: నేపాల్‌లో ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పాటైంది. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన మాజీ సీజేఐ సుశీలా కార్కి దేశంలో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. పార్లమెంటు రద్దునకు అధ్యక్షుడు పౌడెల్ అంగీకరించారు. ప్రతినిధుల సభను రద్దు చేసేందుకు నూతన మంత్రివర్గం సిఫార్సు చేసింది. తదుపరి ఎన్నికల నిర్వహణకు అధ్యక్షుడు అంగీకారం తెలిపారు. దీంతో సార్వత్రిక ఎన్నికలకు మార్చి 5వ తేదీని కొత్త ప్రధాని ఖారారు చేశారు. సుశీలా కార్కి శుక్రవారం రాత్రి నూతన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగంలోని 61(3), (4) కింద ఆమెను తాత్కాలిక ప్రధానిగా అధ్యక్షుడు నియమించారు. ఈనెల 8,9 తేదీల్లో జెన్ జీ ఆందోళనలు తీవ్రరూపం దాల్చిన క్రమంలో ఈ పరిణామం

- మిగతా 2 లో

కేంద్రం కుట్రలు తిప్పికొడదాం

- వికసిత్ భారత్, అమృత్ కాల్ ... అంబానీ, అదానీలకే చెల్లు
- ప్రభుత్వ బ్యాంకుల నిర్వీర్యానికి పాలకవర్గాలు పాచికలు
- ప్రైవేటీకరణ మోజులో కార్మికులకు దక్కని కనీస వేతనం: వెంకటాచలం

విశాలాంధ్ర-హైదరాబాద్ : వికసిత్ భారత్, అమృత్ కాల్ అంటూ సామాన్య ప్రజలను ఇంకా మోసం చేయలేరని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం అన్నారు. ఇవి కేవలం అదానీ, అంబానీలకే చెల్లుతుందని పేద ప్రజలకు కాదన్నారు. వ్యవసాయం, ఉత్పత్తిరంగాలు, చిన్నతరహా పారిశ్రామిక రంగం కుడా అతలాకుతలం అవుతుందని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ సామాన్య ప్రజలను మభ్య పెడుతుందని ఆయన విమర్శించారు. గొంతెత్తితే కార్మిక సంఘాలు ప్రభుత్వ రంగ సంస్థలలో లేకుండా చేసేందుకు కేంద్రం అనేక కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 37వ మహాసభ, సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ 13వ త్రైవార్షిక సభలు శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లోని ఎ.సుందర్ రావు ప్రాంగణంలో జరిగాయి. మహాసభలను వెంకటాచలం ప్రారంభించగా, ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ కె.ధారాసింగ్ నాయక్, ఏఐబీఓఏ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఖాన్, వరంగల్ రీజినల్ హెడ్ ఎ.వి. కృష్ణా మోహన్, విజయవాడ రీజియన్ హెడ్ పి.సతీశ్ బాబు హాజరయ్యారు. వెంకటాచలం మాట్లాడుతూ ప్రైవేటీకరణ మోజులో కార్మికవర్గానికి కనీస వేతనాలను ప్రభుత్వాలు నిరాకరిస్తుండడం గర్హనీయమన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల యూనియన్ ...యాజమాన్యాలకు మధ్య సంప్రదింపులు లేకుండా పోతున్నాయని, బ్యాంకింగ్ రంగంలో ఉన్న అన్ని

- మిగతా 2 లో

ప్రజల హృదయాల్లో సజీవం

సురవరం సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరరావు అన్నారు. 60ఏళ్ల ప్రజా జీవితంలో శ్రామిక, పీడితుల గొంతుకగా ఆయన ఉన్నారని, సురవరం మరణంతో ఉద్యమ గొంతుక మూగబోయిందన్నారు. నికార్సయిన కమ్యూనిస్టు అంటూ సురవారం సుధారరెడ్డిని కొనియాడారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లా కార్యదర్శి దండి సురేశ్ అధ్యక్షతన సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి రాజకీయ... ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అభ్యుదయ వాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూనంనేని మాట్లాడుతూ సురవరం జీవితమే కాదు ఆయన మరణం కూడా చారిత్రికమన్నారు. సామాజిక చైతన్యం కోసం పని చేసే వారు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంటారని అన్నారు. కమ్యూనిజానికి ప్రాంతీయత లేదని... సంఘటిత, అసంఘటిత రంగాల్లోనూ లక్షల మంది అభిమానులు ఉన్నారని చెప్పారు. అట్టడుగు వర్గాల్లో కమ్యూనిస్టులకు ఆదరణ తగ్గలేదన్నారు. అందరిని ఏకతాటిపైకి తెచ్చి కార్యోన్ముఖులను చేయడమే సురవరం సుధాకర రెడ్డికి నిజమైన నివాళి అని కూనంనేని అన్నారు. భవిష్యత్తులో బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణాల కోసం డిసెంబర్ 26న ఖమ్మంలో శత వసంత ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్షలాది మందితో నగరం ఎరుపెక్కనుందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ లాంటి మతశక్తులు తమ ఫాసిస్టు విధానాలతో ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. కమ్యూనిస్టు సిద్ధాంతం అజేయమైంది కాబట్టే కమ్యూనిస్టులను బీజేపీ శత్రువులుగా చూస్తుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ సురవరం ఎందరికో ఆదర్శమని, చారిత్రక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టాల వెనక కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదని ఆయనన్నారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్

- మిగతా 2 లో

అంపశయ్య నవీన్, రమాదేవికి 'పొన్నం సత్తయ్య' జీవన సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర - హైదరాబాద్: అంపశయ్య నవీన్, అంతడుపల రమాదేవికి పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం-2025 లభించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఏటా రచయితలు, కళాకారులకు పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలు అందజేస్తారు. ఈ ఏడాది సాహిత్యం విభాగంలో ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, కళారంగంలో అంతడుపల రమాదేవికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు... రవీంద్ర భారతిలో శనివారం అవార్డులు ప్రదానం చేశారు. ఎంపిక కమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం రవిచంద్ర సారథ్యంలోని జ్యూరీ కమిటీలో సీనియర్ పాత్రికేయులు, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మీ సభ్యులుగా ఉన్నారు. నవీన్ రచనలు... నిజాయతీ, సామాజిక చైతన్యం, వ్యక్తిగత మానసిక స్థితులకు ప్రతిబింబంగా నిలుస్తాయి. రమాదేవి ... తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాటలు, తెలంగాణ అస్తిత్వ గానాలతో తనదైన స్వరాలతో దశాబ్ద కాలం నుంచి ఎన్నో భక్తిగీతాలు, తెలంగాణ జానపద పాటలతో ఉత్తేజపరుస్తున్న కళాకారిణి. అవార్డు గ్రహీతలకు రూ.51 వేల నగదుతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందించారు. నవీన్, రమాదేవికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ తండ్రిని మించిన తనయుడని అన్నారు. ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, కార్పొరేషన్ చైర్మన్‌లు చల్లా నరసింహారెడ్డి, జేరిపాటి జైపాల్, ఇనగాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి పాల్గొన్నారు.

ఇదీ లోకం!

అంతవరకూ పితుక్కోండి..అప్పటికి వట్టిపోతే తిరిగి మాకిచ్చేయండి!

లాడెన్‌కు పాక్ ఆశ్రయమివ్వడం గుర్తులేదా

ఐరాస భద్రతా మండలిలో ఇజ్రాయిల్

న్యూయార్క్: కరడుగట్టిన ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌కు పాక్ ఆశ్రయం కల్పించిందని, ఆ దేశంలోనే అతను హతమయ్యాడని, ఇది పాకిస్థాన్ మరిచిపోయినట్లు ఉందని ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి వేదికగా ఇజ్రాయిల్ మండిపడింది. ద్వంద్వ ప్రమాణాలతో వాస్తవాలు కప్పిపుచ్చలేరంటూ దుయ్యబట్టింది. ఖతార్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులపై చర్చ సందర్భంగా తమ దేశం పేరు ప్రస్తావించడంపై పాకిస్థాన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రాంతీయ సుస్థిరతను దెబ్బతీసే దురాక్రమణగా ఇజ్రాయిల్ దాడులను ఆక్షేపించింది. ఇజ్రాయిల్ శాశ్వత ప్రతినిధి డానీ డానన్ తీవ్రంగా స్పందించారు. 'విదేశీ గడ్డపైనున్న ఉగ్రవాదిని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారని కాదు ఉగ్రవాదికి ఆశ్రయం ఎందుకిస్తున్నారన్నదే ముఖ్య ప్రశ్న. బిన్ లాడెన్ కోసం ఆపరేషన్ చేపట్టడం తప్పు కానప్పుడు హమాస్ విషయంలో మా చర్యలు ఎలా తప్పంటారు? 9/11 తర్వాత ఐరాస భద్రతా మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని, ఏ దేశం కూడా ఉగ్రవాదులకు ఆశ్రయం, నిధులు ఇవ్వకూడదని పేర్కొంది. కాదని ఆశ్రయం కల్పిస్తే, ఐరాస భద్రతా మండలి నియమావళిని ఉల్లంఘించినట్లే!' అని వెల్లడించారు. అమెరికాలో 2001, సెప్టెంబర్ 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రదాడి జరిగి 24 ఏళ్లు అయిన నేపథ్యంలో భద్రతా మండలి జరిపిన చర్చలో పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందన్న వాదన మరోసారి బలంగా వినిపించింది.

పాక్ ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రదాడి

భీకర పోరులో 12 మంది సైనికులు, 13 మంది తీవ్రవాదుల మృతి

పెషావర్: వాయువ్య పాకిస్థాన్‌లో తీవ్రవాదులు శనివారం ఆర్మీ కాన్వాయన్‌పై దాడి చేశారు. కాన్వయ్‌ను ముట్టడించి కాల్పులకు తెగబడ్డారు. 12 మంది సైనికులను చంపారు. అఫ్ఘాన్ సరిహద్దు సమీపంలో దక్షిణ విజ్రిస్థాన్‌లోని బదర్ ప్రాంతంలోగల పర్వత క్షేత్రంలో సైనికుల వాహనాలను తీవ్రవాదులు అడ్డుకోవడంతో భీకర పోరు సాగినట్లు అధికారులు తెలిపారు. ఎదురు కాల్పుల్లో 12 మంది సైనికులు అమరులు కాగా మరో నలుగురికి గాయాలైనట్లు చెప్పారు. 13 మంది మిలిటెంట్లను సైనికులు మట్టుబెట్టారన్నారు. ఈ దాడి చేసినది తామేనంటూ పాకిస్థాన్ తాలిబన్ బాధ్యత తీసుకున్నది. సైనికుల నుంచి ఆయుధాలు, డ్రోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ సైన్యం స్పందిస్తూ 'ఉగ్రవాద కార్యకలాపాలకు తమ భూభాగాన్ని వినియోగించడాన్ని అఫ్ఘాన్ ప్రభుత్వం నిరాకరిస్తుందని, తాజా ఘటనకు బాధ్యత తీసుకుంటుందని ఇస్లామాబాద్ భావిస్తోంది' అని వెల్లడించింది. కాగా, 2021లో అఫ్ఘానిస్థాన్ తాలిబన్ల అధీనంలోకి వెళ్లిన తర్వాత పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా పాకిస్థాన్ తాలిబన్ దాడులను పెంచినట్లు తెలుస్తోంది.

మావోయిస్టు సుజాతక్క లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

డీజీపీ జితేందర్ వెల్లడించారు. 'ఆమె స్వస్థలం గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జననాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు. 2001లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క బయటికి వచ్చారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తాం. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. మావోయిస్టులు చాలా మంది లొంగిపోతున్నారు' అని జితేందర్ తెలిపారు.

మైన్మార్ స్కూళ్లపై వైమానిక దాడి: 19 మంది పిల్లల మృతి

నే పీ డా: పశ్చిమ మైన్మార్, రఖీనే రాష్ట్రంలోగల రెండు స్కూళ్లపై వైమానిక దాడి జరిగింది. భవనాలు శిథిలమయ్యాయి. ఈ ఘటనలో 19 మంది పిల్లలు చనిపోయారు. మరో 22 మంది గాయపడ్డారు. ఈ మేరకు సాయుధ అరాకన్ ఆర్మీ (ఏఏ) శనివారం వెల్లడించింది. శుక్రవారం అర్ధరాత్రి దాడి జరిగిందని, మృతులంతా 15 నుంచి 21 ఏళ్ల మధ్య వయస్సుగల వారని పేర్కొంది. ఈ దాడి అధికార జుంటా పనిగా తెలిపింది. విద్యార్థులు నిద్రలో ఉన్నప్పుడు జుంటా యుద్ధ విమానం 500 పౌండ్ల బ్యాంబులతో దాడి చేసినట్లు మైన్మాన్ మీడియా పేర్కొంది. ఈ దాడిని యూనిసెఫ్ ఖండించింది. రఖీనే రాష్ట్రంలో పేట్రేగిన హింసకు ఈ దాడి అద్దంపట్టిందని, క్షీణించిన పరిస్థితులకు పిల్లలు, వారి తలిదండ్రులు మూల్యం చెల్లించుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేసింది.

మార్చి 5న నేపాల్ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. జెన్ జీ ఎంపిక చేసిన ప్రభుత్వాధినేతగా మాజీ సీజేఐకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఆమెపై ఉంది. దీంతో సార్వత్రిక ఎన్నికల కోసం మార్చి 5వ తేదీని ఖరారు చేస్తూ అధికారిక ప్రకటన వెలువడింది.

శాంతి కోసం సద్భావన్ ర్యాలీ

తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నేపాల్‌లో శనివారం శాంతి ప్రదర్శన జరిగింది. భైర్వావా పట్టణం నుంచి సనౌలీ సరిహద్దు వరకు నిర్వహించిన సద్భావన ర్యాలీలో వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఉద్యోగ్ వ్యాపార్ సంఘ్ మహాశాఖ లుంబినితో పాటు మరికొన్ని సంస్థల సంయుక్త అధ్వర్యంలో సౌభ్రాతృత్వాన్ని చాటే విధంగా శాంతికి పిలుపు ఇస్తూ ఈ ప్రదర్శన నిర్వహించారు.

కీలక పత్రాలు ధ్వంసం: నేపాల్ సుప్రీంకోర్టు

దేశ న్యాయ చరిత్ర సృష్టించడంలో కీలకమైన పత్రాలు జెన్ జీ ఆందోళనలు, హింసలో దాదాపుగా ధ్వంసమైనట్లు నేపాల్ సుప్రీంకోర్టు వెల్లడించింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ న్యాయ పథం వీడేది లేదని ప్రధాన న్యాయమూర్తి ప్రకాశ్మన్ సింగ్ రౌత్ తేల్చిచెప్పారు. హింసలో కోర్టు భవనాలు దెబ్బతిన్నాయన్నారు. రాళ్లు రువ్వడం, నిప్పు పెట్టడం, లూటీలు జరగడంపై ఆందోళన వ్యక్తంచేశారు. కోర్టు కార్యకలాపాలు త్వరలోనే పున:ప్రారంభమవుతాయన్నారు. ఐదు రోజుల తర్వాత నేపాల్‌లో శనివారం సామాన్య పరిస్థితులు నెలకొన్నాయి. దుకాణాలు, వ్యాపార సముదాయాలు తెరుచుకున్నాయి. జనం రోడ్లపైకి వచ్చారు. రాజధాని ఖాట్మండులో కర్ఫ్యూ ఎత్తివేసిన తర్వాత భద్రతా బలగాలు ఉపసంహరించాయి. అయితే హింస సమయంలో జైళ్ల నుంచి తప్పించుకొని భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన దాదాపు 75 మంది పట్టుబడ్డారు. అయితే భారత్-నేపాల్ సరిహద్దు వద్ద మాత్రం కర్ఫ్యూ కొనసాగింది. ఇదిలావుంటే, ఆందోళనల కారణంగా హోటల్ వాణిజ్యానికి 25 మిలియన్ల మేర నష్టం జరిగినట్లు అంచనా ఉంది.

16 నుంచి కౌన్సెలింగ్

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 20 నుంచి 24వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఇక రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా సెప్టెంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. సెప్టెంబర్ 29న రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అనంతరం మాప్ అప్ రౌండ్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ మేరక సెప్టెంబర్ నెలాఖరుకల్లా రాష్ట్ర కోటా కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని కాళోజీ వర్సిటీ తన ప్రకటనలో వెల్లడించింది.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

కింగ్‌పిన్లను అరెస్టు చేయండి

సరిహద్దు రాష్ట్రాల చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం: మంత్రి జూపల్లి

విశాలాంధ్ర – హైదరాబాద్ : గంజాయి, డ్రగ్స్, నాటుసారా, ఎన్‌డీపీఎల్ నేరాలపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు అధికారులను ఆదేశించారు. నాంపల్లిలో తెలంగాణ అబ్కారీ భవన్‌లో శనివారం అబ్కారీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్ అండ్ డీటీఎఫ్ , ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పనితీరుపై మంత్రి సమీక్షించారు. సరిహద్దు రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అసాంఘిక కార్యకలాపాలతో సంబంధం ఉన్న కింగ్ పిన్లను గుర్తించి వారిని పీడీ చట్టం కింద అరెస్టు చేయాలని ఆదేశించారు. యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్న గంజాయి, మాదకద్రవ్యాల వంటి మత్తు పదార్థాల విక్రయానికి అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సరిహద్దు రాష్ట్రాల చెక్ పోస్టుల్లో నిఘా మరింత పటిష్టం చేయాలని చెప్పారు. నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్, నాటుసారా తయారీ అమ్మకాలు, కల్తీ మద్యం తయారీతో పాటు ఎన్డీపీఎస్ యాక్టు కింద కేసులు నమోదు చేయడమే కాకుండా, ఎంతమంది నిందితులకు శిక్షలు పడుతున్నాయి అని ఆరా తీశారు. నిందితులకు శిక్షలు పడే వరకు విశ్రమించకూడదని సూచించారు. చర్లపల్లిలో డ్రగ్స్ తయారీ కేసులో పురోగతి, ఎక్సైజ్ శాఖ తనిఖీ, బయటపడ్డ అంశాలపై ఇచ్చిన నివేదిక గురించి మంత్రి ఆరా తీశారు. డ్రగ్స్ కేసులో మహారాష్ట్ర పోలీసులు పేర్కొన్నట్టుగా విలువ రూ. 12 వేల కోట్లుగా వార్తలు వచ్చాయని, దీనికి ఆధారాలు లేవని, విశ్వసనీయ సమాచారం ప్రకారం వాటి విలువ సుమారు రూ.11.95 కోట్లు మాత్రమేనని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల్లో విస్తృత సోదాలు నిర్వహించాలని సూచించారు. ఈత, తాటి కల్లు బాట్లింగ్ చేసి విక్రయించే యూనిట్ లను నెలకొల్పడం వల్ల గీత కార్మికులకు ఉపాధితో పాటు ఆదాయం పెరుగుతుందని, కల్తీ కల్లును కూడా నివారించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. దీనిపై నివేదిక సమర్పించాలని చెప్పారు. ఫంక్షన్ హాల్స్, రిసార్టు, ఫాంహౌస్ ల్లో జరిగే ప్రైవేట్ పార్టీల్లో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం వినియోగంపై అబ్కారీ శాఖ దృష్టి సారించాలని అన్నారు. నిబంధలను అతిక్రమించిన బార్ల లైసెన్స్ లను రద్దు చేయాలని అన్నారు. ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, కమిషనర్ సి.హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, అడిషనర్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, అన్ని జిల్లాల డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, డీటీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో సజీవం

(మొదటి పేజీ తరువాయి)

రాయల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రముఖ వైద్యులు రవీంద్రనాథ్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) -న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ తదితరులు ప్రసంగించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించారు. స్పర్శ అధ్యయన వేదిక బాధ్యుడు స్పర్శ భాస్కర్, సీసీపీ బాధ్యుడు రవిమారుత్, బీఏఎల్ నాయకుడు పోట్ల మాధవరావు, ప్రముఖ వైద్యుడు వై.ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, క్లెమెంట్, మహ్మద్ సలాం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు పోటు కళావతి, కాంగ్రెస్ నాయకుడు వద్దె నారాయణరావు పాల్గొన్నారు.

చుక్క నీరు వదులుకోం

(మొదటి పేజీ తరువాయి)

ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో జల విద్యుత్ ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్‌ను దిశానిర్దేశం చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.

పీపీపీపై దుష్ప్రచారం వద్దు

జగన్‌కు మంత్రి సత్యకుమార్ లేఖ

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం విషయంలో నాడు సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి వైఖరి కొనసాగితే, వాటిని పూర్తి చేసి, 150 చొప్పున ప్రవేశాలు కల్పించడానికి 23 ఏళ్లు పడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. పీపీపీ పద్ధతిలో కళాశాలల నిర్మాణంపై జగన్ అధ్వర్యంలో దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ఇదే అంశాలపై ఆయన శనివారం మాజీ ముఖ్యమంత్రికి ఆరు పేజీల లేఖ రాశారు. పీపీపీ విధానంపై రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం చేయడం జగన్ ద్వంద వైఖరికి అద్దంపడుతోందన్నారు. 2023లో సవరించిన నిబంధనల మేరకు 2024-25లో పాడేరు కళాశాలలో 150 సీట్లు ప్రతిపాదించగా, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా 50 సీట్లకు ఎన్ఎంసీ అనుమతించిందన్నారు. ఎన్ఎంసీ బృందం 2024 జూన్‌లో చేసిన తనిఖీలో రెండో దశలో నిర్మించాల్సిన ఐదు కాలేజీల్లో మౌలిక వసతుల లోపాలను వెల్లడించిందన్నారు. ఐదు కాలేజీలకు 700 ప్రవేశాలు కోల్పోడానికి మాజీ ముఖ్యమంత్రే బాధ్యుడన్నారు. పులివెందులతో పాటు పూర్తి చేయాల్సిన మార్కాపురం, మదనపల్లి, ఆదోని కాలేజీలపై జగన్ వివక్ష చూపారని విమర్శించారు. 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తి చేసేందుకు పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం అవలంభిస్తోందని, దీనిపై దుష్ప్రచారం తగదన్నారు. ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా... ప్రజలకు సంబంధించిన విషయాలపై బాధ్యతగా, విశ్వసనీయతతో కూడిన చర్చలకు తోడ్పడాలని తన లేఖలో జగన్‌కు మంత్రిసత్యకుమార్ సూచించారు.

రెండు ప్రదేశాలకు యునెస్కో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. తిరుమల కొండలు వాటి అరుదైన శిలా నిర్మాణం, శేషాచలం అడవులతో కలిసి ఉండటం, దట్టమైన అడవులు, జలపాతాలు, జీవవైవిధ్యం కారణంగా ప్రత్యేకమైనవి. ఈ రెండు ప్రదేశాలకు యునెస్కో గుర్తింపు రావడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచింది.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

రంగ నిపుణులతో సమీక్ష జరిగింది. మంత్రి మాట్లాడుతూ కృష్ణా జలాలపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ వెళతారని వెల్లడించారు. కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా సాధనకు బలమైన వాదనలు వినిపించేందుకు పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామన్నారు. వారిచ్చే నివేదికల ఆధారంగా న్యాయవాదులు నీటివాటాపై వాదనలు వినిపించనున్నారని మంత్రి పేర్కొన్నారు. కేడబ్ల్యూడీటీ ఎదుట సమైక్యాంధ్రలో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయంపై ప్రస్తావించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలువల సామర్థ్యాలు పెంచుకుంటూ గోదావరి, పట్టిసీమ, చింతలపూడి, పులిచింతల నీరు అక్రమంగా తరలించుకుపోతున్న అంశాలను ఇప్పటికే ట్రిబ్యునల్ ముందుంచామన్నారు. 1956 జలవివాద చట్టం, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిన విషయంపై వాదనలు వినిపించామన్నారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రాంతానికి 71 శాతం కేటాయింపులు ఉండాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇక్కడ నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం కేటాయింపులు ఉండాల్సిందేనన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టుగా నీటి కేటాయింపులు ఉండాలని, అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రిబ్యునల్‌కు సమర్పించామని ఆయన పునరుద్ఘాటించారు. తాజాగా అధికారులు అందిస్తున్న నివేదికల ప్రకారం జూన్, జులై మాసాలలో 80 టీఎంసీల నీటిని అందుబాటులో ఉంచేలా వాదనలు విపించడంతో పాటు ఆపరేషన్ ప్రొటోకాల్ నిబంధనలననుసరించి మిగిలిన నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణకు ఉండేలా ట్రిబ్యునల్ ముందు ఉంచుతామన్నారు. ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం లోని సెక్షన్ 4(1) ఏతో పాటు పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పదకొండో షెడ్యూల్ పదో పేరాగ్రాఫ్ వంటి న్యాయపరమైన అంశాలను కూడా వాదించబోతున్నట్లు మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ అక్రమంగా వినియోగిస్తున్న 291 టీఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందే నని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్, నదుల నిర్వహణ బోర్డుల ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణలో కడుతున్న ప్రాజెక్టులపై అడ్డుపడుతుండడంతో ఒకింత ఆలస్యం జరుగుతోందని, వీటిపై తెలంగాణకు ఉన్న హక్కులను ట్రిబ్యునల్ ఎదుట జరిగే వాదనలలో వినిపిస్తామన్నారు. బీఆర్ఎస్ పాలకుల వైఖరి వల్లే ఇప్పటి వరకు తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లనే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించుకో లేకపోయిందని మండిపడ్డారు. నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ అంజద్ హుస్సేన్, సుప్రీంకోర్టు న్యాయవాది సీఎస్ వైద్యనాథ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం

చైర్మన్‌ను కలిసిన భవన నిర్మాణ సంఘ నేతలు

విశాలాంధ్ర-విజయవాడ: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించి... సలహా మండలి ఏర్పాటు చేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావును శనివారం లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి సోనరాజు, విజయవాడ నగర అధ్యక్షుడు బేవర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామస్వామి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చల్లా వెంకటరమణ తదితరులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సత్యనారాయణ మాట్లాడుతూ క్లెయిమ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.

రెండు నెలలుగా పోస్ట్ కార్డు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని, ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయానికి మూడు వేల కార్డులు, ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి 2,500 పోస్ట్ కార్డులు చేరడం జరిగిందన్నారు. 46 వేల క్లెయిమ్‌ల కోసం రూ.110 కోట్లు విడుదల చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యాచరణకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర కమిటీతో చర్చించి పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

కేంద్రం కుట్రలు తిప్పికొడదాం

(మొదటి పేజీ తరువాయి)

యూనియన్లు సంయుక్తంగా ఎదుర్కోవాలన్నారు. నేడు బ్యాంకుల్లో రూ.250 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఉందని, ఇది ప్రభుత్వ బడ్జెట్ కంటే ఎక్కువ అని, ఈ ధనం అంతా సామాన్య ప్రజలదే తప్ప ప్రభుత్వానిది కాదని, ఈ డబ్బును కాపాడవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకులన్నీ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని, అయినప్పటికీ పాలకులు వాటినే ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి కృషి చేస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి పాలకవర్గాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందాం: కూనంనేని

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ సాధ్యమౌతుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. బ్యాంకుల ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వెంకటాచలం బ్యాంకింగ్ సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారని అభినందించారు. ప్రపంచం ఆర్థిక మాంద్యం ఎదుర్కొన్నప్పుడు ప్రభుత్వ బ్యాంకులు మాత్రమే దేశాన్ని కాపాడాయన్నారు. ఏఐబీఈఏ పోరాటం చేసి ప్రభుత్వ బ్యాంకులను నిలబెట్టకోగలిగిందన్నారు. పార్లమెంట్ సభ్యులైన గురుదాస్ దాస్ గుప్తా బ్యాంకింగ్ రంగంలో చోటుచేసుకున్న అనేక స్కామ్ లను వెలుగులోకి తీసుకొచ్చారని కూనంనేని తెలిపారు. ఏపీటీబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షంచుకోవాలని, పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఇందు కోసం ఉభయతెలుగు రాష్ట్రాల్లో సభ్యులు మరింత సంఘటితంగా పోరాడాలన్నారు. ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి పి.వి. కృష్ణా రావు, సీబీఐఈయూ తమిళనాడు ప్రధాన కార్యదర్శి డి.పి.గోపినాథ్, సీబీఓయూ తమిళనాడు ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ దేవయ్య, సీబీఐఈయూ కర్నాటక ప్రధాన కార్యదర్శి ఎల్. సతీశ్, సీబీఓయూ కర్నాటక ప్రధాన కార్యదర్శి ఆర్.టి.యాదవ్, సీబీఓయూ కేరళ ప్రధాన కార్యదర్శి అనిల్ ఉన్నతన్, వై. శ్రీనివాస్ రావు, పి.ఉదయ్ భాస్కర్, బిఎన్ నాయక్, ఆర్. ఫణికుమార్ పాల్గొన్నారు.

అక్టోబరు 2026 నాటికి బందరు పోర్టు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో -మచిలీపట్నం : బందరు పోర్టు నిర్మాణ పనులు అక్టోబరు 2026 నాటికి పూర్తి చేసి రవాణా కార్యక లాపాలు ప్రారంభించేలా కృషి చేయాలని రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. పోర్టు ప్రాంతాన్ని శనివారం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. పనుల పురోగతిని అధికారులనడిగి తెలుసుకున్నారు. ఏపీ మారిటైం బోర్డు సీఈఓ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పనులపై ఆయన సమీక్షించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ రూ.5,500 కోట్ల వ్యయంతో చేపట్టిన మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి అతి త్వరలో ప్రారంభించాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాలతో పాటు సమీపంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర అవసరాలు కూడా తీరతాయని చెప్పారు. మొత్తం 16 బెర్తులు ఏర్పాటు చేస్తున్నామని, మొదటి దశగా నాలుగు బెర్తులను అనుకున్న సమయానికి పూర్తి చేసి కార్యక లాపాలను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి 50 శాతం మేర పనులు పూర్తయినట్లు ఆయన వివరించారు. త్వరలో అమరావతి రింగ్‌రోడ్డు ఏర్పాటు కానున్న నేపథ్యంలో హైదరాబాద్ మార్గంతో పాటు పోర్టుకు సమీపంలోని జాతీయ రహదారులు, రైలు, రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తామని కృష్ణబాబు తెలిపారు.

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్...

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనులను కృష్ణ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశించిన రీతిలో పనులు ముందుకు సాగడం లేదని, పురోగతి మందగించిందని అన్నారు. పనులను వేగవంతం చేసి నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో పురోగతి కనిపించకపోతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరించారు. చేతన్, రాఘవరావు, వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మధుసూదన్ రావు, తులసీదాస్, సతీష్, విశ్వనాథం, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఈఈ లోకేష్, బందరు నార్త్ మండల తహసీల్దార్ నాగభూషణం పాల్గొన్నారు.

1న వాహనమిత్ర డబ్బుల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. స్త్రీశక్తి పథకం అమలుతో గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్న ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు వాహనమిత్ర పథకం కింద రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సొంతంగా వాహనం నడుపుతున్న డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ సహాయం వాహన బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మరమ్మతులు, ఇతర ఖర్చుల కోసం వినియోగించుకోవచ్చు. పథకం పొందడానికి అవసరమైన అర్హతలను ప్రభుత్వం ప్రకటించింది. డ్రైవర్ సొంతంగా వాహనం కలిగి ఉండాలి.

శరీరదానంపై 1500 మంది సీపీఎం నేతల సంతకం

చెన్నై: తమిళనాడులో 1,500 మందికి పైగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు మరణానంతరం తమ శరీరాలను వైద్య పరిశోధనల కోసం దానం చేయడానికి సమ్మతి పత్రంపై సంతకాలు చేశారు. మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు శరీర దానంపై దృష్టి సారిస్తోందని పొలిట్‌బ్యూరో సభ్యురాలు పి.వాసుకి అన్నారు. వైద్య విద్య, పరిశోధన కోసం ఏచూరి మృతదేహాన్ని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు అప్పగించారు. మరణంలోనూ వివక్షతతో కూడిన అంత్యక్రియల పద్ధతులను కుల వ్యవస్థ కలిగి ఉన్నదని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ పేర్కొన్నారు.

మండలాల్లో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జిల్లాలో పకడ్బందీగా యూరియా పంపిణీ మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ తెలిపారు. శనివారం డిఏఓ, డిసిఓ, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఏఓలతో యూరియా సరఫరా (పంపిణీ)పై సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయుటకు ఇప్పటికే వేసుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యోగి రైతు వేదికలు, ప్రాథమిక సహకార సొసైటీలు, తదితర కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో కచ్చితంగా ఉండాలని, రైతులకు వస్తున్న స్టాక్ వివరాలను తెలియపరచి వారిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికే (18) మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, సంఘాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందనీ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు నిత్యం కేంద్రాలను తనిఖీ చేస్తూ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, గణేష్, కృష్ణవేణి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అజ్మీరా శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, శ్రీనివాస్, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

విశాలాంధ్ర - కోదాడ : రాజీ మార్గమే రాజా మార్గమని, లోక్ అదాలత్ ల ద్వారా కేసులు రాజీ పడి ఇరుపక్షాలు తమ సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్అదాలత్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇరుపక్షాలు లోక్అదాలత్‌లో తమ కేసులు రాజీ పడడం ద్వారా సమన్యాయం జరుగుతుందని, కోర్టుల చుట్టూ తిరిగి తమ అమూల్యమైన సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని, క్షణికావేశంలో జరిగే తప్పులను సరిచేసుకోవడానికి రాజీ మార్గం మంచిదన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉమర్, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జాకీయా సుల్తానా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, లోక్ అదాలత్ సభ్యులు తమ్మినేని హనుమంతరావు, కోడూరు వెంకటేశ్వరరావు, టి.సీతారామరాజు, జె.శివ కృష్ణ, సీనియర్ న్యాయవాదులు ఎస్.రాధాకృష్ణమూర్తి, సిలివేరు వెంకటేశ్వర్లు, గట్ల నర్సింహారావు, ఈదుల కృష్ణయ్య, నవీన్ పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ అమలు అయ్యేట్లు చూడాలి

విశాలాంధ్ర బ్యూరో- పెద్దపల్లి : రాష్ట్రంలో దళితులకు 18 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలు అయ్యేటట్లు చూడాలని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను దళిత శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్నీ, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం నేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేస్తే దళితులకు న్యాయం జరుగుతుందని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అంబేద్కర్ అభయ హస్తం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందేలా చూడాలని విన్నవించారు. తెలంగాణలోని దళిత సమాజానికి ఇచ్చిన హామీలు రిజర్వేషన్ల పెంపు, అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు కావడంలేదని ఎమ్మెల్యేకు బొంకూరి సన్ని, కల్లెపల్లి రవి వివరించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుపోయి చేవెళ్ల డిక్లరేషన్ అమలు అయ్యేట్లు చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

రాజీ మార్గంతో ఇరువర్గాలకూ న్యాయం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : శనివారం జిల్లా కేంద్రంలోని పెంచనర్ల భవనంలో జరిగిన మూడవ జాతీయ లోక్ అదాలత్ సేవల, కమ్యూనిటీ మీడియేషన్ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయ మూర్తి, శ్యామ్ కోశి మాట్లాడుతూ కోర్టు కేసుల్లో రాజీ మార్గాల ద్వారా ఇరు వర్గాలకూ న్యాయం చేకూరుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంతో పాటు కక్షిదారులు ప్రశాంతంగా జీవించవచ్చని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి సుజన కళాసికం మాట్లాడుతూ, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు లోక్ అదాలత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ సేవలు కోర్టులపై భారాన్ని తగ్గించడమే కాకుండా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపుతున్నాయి. పలు కేసుల్లో బాధితులకు మంజూరైన నష్టపరిహార చెక్కులు, అటవీ జంతువుల దాడిలో నష్టపోయిన వారికి పరిహార చెక్కులు అందజేశారు. అనంతరం అతిథులను సన్మానించారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు పంచాక్షరి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, ఎస్పీ జానకి షర్మిల, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కోర్టు అధికారులు, న్యాయవాదులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: యూరియా తెలంగాణ రాష్టంకు అందించటంలో కేంద్రప్రభుత్వం విఫలం చెందిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడ రైతులు బారులు తీసారని కాంగ్రెస్ పార్టీ ఏటూరు నాగారం మండల కమిటి అధ్యక్షులు సిహెచ్.రఘు అన్నారు. శనివారం అయన ఒక పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీని రైతన్నలు నమ్మే పరిస్థితులు లేరని, ఖమ్మం జిల్లాలో రైతన్నలకు బేడీలు వేసిన చరిత్ర బి ఆర్ ఎస్ పార్టీదన్నారు. ఇప్పటి వరకు ములుగు నియోజకవర్గానికి 1200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మౌనమేలా అని పేర్కొన్నారు. ములుగుజిల్లాలో యూరియా కొరత లేకుండా మంత్రి సీతక్క చర్యలు తీసుకన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతూ, ఆందోళనలు చేస్తున్న ప్రస్తుత కష్ట కాలంలో రైతులకు భరోసా ఇస్తూ,బాధ్యత వహించవలసిన రాష్ట్రానికి చెందిన, కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తమకేం పట్టదన్నట్లుగా మౌనంగా ఉంటూ, నిమ్మకు నీరెత్తినట్లుగా నిర్లక్ష్యం వహించడం శోచనీయంశం అని అన్నారు. తెలంగాణకు యూరియా సరఫరా పై కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతోందని, తెలంగాణకు రావలసిన యూరియా వాటాను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని చిటమట రఘు డిమాండ్ చేశారు.

పోలీసు క్వార్టర్స్ ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర వ్యాప్తంగా 232 కోట్ల రూపాయలతో పోలీసు అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మాణం చేపట్టడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన ఏ ఆర్ డి ఎస్‌పి రెసిడెన్సి క్వార్టర్స్, సీఐ, ఎస్ఐ క్వార్టర్లను, శిశు విహార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శిథిలావస్థలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది క్వార్టర్స్‌ను తొలగించి వాటి స్థానంలో కొత్త క్వార్టర్లను నిర్మిస్తున్నామని, ఇందులో భాగంగానే అవసరమైన చోట 232 కోట్ల రూపాయలతో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ఇంకా ఎక్కడైనా ఇలాంటి స్థితిలో క్వార్టర్స్ ఉన్నట్లయితే గుర్తించి వాటిని స్థానంలో కొత్త వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి రమేష్ రెడ్డిని ఆదేశించారు. నల్గొండ జిల్లా డీఎస్పీ కార్యాలయం 50 సంవత్సరాల క్రితం నిర్మించినది అయినందున త్వరలోనే ఈ కార్యాలయాన్ని కూలగొట్టి దాని స్థానంలో కొత్తది మంజూరు చేయిస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి డిఎస్పి కార్యాలయంతో పాటు, ఏఆర్ కానిస్టేబుల్ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నందున వాటికి కూడా మంజూరు చేయించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది 24 గంటలు పనిచేస్తారని, అలాంటివారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.సమాజంలో మత్తుమందుల నిర్మూలనకు పోలీసులు కృషి చేస్తున్నారని, ప్రత్యేకించి నల్గొండ జిల్లాలో జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్లు మత్తు పదార్థాల నివారణకు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐజి ఇక్బాల్, ఎం ఎల్ సి నెల్లికంటి సత్యం, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ ఏ సి పి మౌనిక, ఇతర పోలీసు అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అటవీ భూముల కైంకర్యాన్ని అడ్డుకున్న అటవీశాఖ సిబ్బంది

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం జిల్లా, కొనిజర్ల సెక్షన్, తుమ్మలపల్లి సౌత్ బీట్‌లోని కంపార్ట్మెంట్ నం. 49లో ప్రభుత్వానికి చెందిన విలువైన అడవి భూములు కోట్ల రూపాయల విలువైన సహజ వనరులు ఆక్రమణకు గురవుతుండగా అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. కొందరు జెసిబి ద్వారా ఆ ప్రాంతంలో మట్టితో ఒకలతో సహా అటవీ సంపదను అక్రమంగా కాజేస్తున్న విషయం తెలుసుకొని అటు విశాఖ అధికారులు సిబ్బందితో వెళ్లి జెసిబి వాహనాన్ని అక్కడ నుండి తీసుకొచ్చి ఖమ్మం ఫారెస్ట్ ఆఫీసులో పెట్టారు. ఈ క్రమంలో ఆయా భూములు ఆక్రమించుకుంటున్న కొందరు అటవీ శాఖ సిబ్బందిపై తిరగబడే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ధైర్య సాహసాలు ప్రదర్శించి సిబ్బంది ఆ వాహనాన్ని తీసుకొచ్చారు. మార్గమధ్యలో ఎనిమిది మోటార్ సైకిల్‌పై కొంతమంది వెంటాడి వాహనాన్ని తీసుకురాకుండా అడ్డుకునే ప్రయత్నం చేయగా అటవీ శాఖ సిబ్బంది వారిని ఎదిరించి వాహనాన్ని తీసుకువచ్చారు. దీంతో అటవీ శాఖ సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రశంసిస్తున్నారు. ఈ భూములు మాత్రమే కాదు, వాటిలో ఉన్న జీవ వైవిధ్యం, వన్యప్రాణులు భవిష్యత్ తరాలకు అవసరమైన ప్రకృతి సంపద కూడా ఆక్రమణలకు గురవుతోంది. అడవుల రక్షణ కోసం డ్రోన్ ద్వారా సర్వేతో పాటుగా ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం ఇటీవల పెంచిందని ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి పేర్కొన్నారు.

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యాధికారులను హెచ్చరించారు. శనివారం కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా సందర్శించారు. హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్, మందుల నిల్వ గదిని పరిశీలించారు. రానున్న 48 గంటల్లో వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వీయ రక్షణ పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంజీర నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. 20 రోజులుగా వర్షాలు కురుస్తున్నందున కాజ్ వేలు, కల్వర్టులు, వరద ప్రవాహం ఉన్న వాటిని ప్రజలు దాటేయత్నం చేయొద్దన్నారు. సీజనల్ వ్యాధులు చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా సోకే అవకాశం ఉన్నందున ప్రజలందరూ వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల:ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా అందిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యావకాశాలను అర్హులైన విద్యార్థులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెంటర్ కోఆర్డినేటర్ బట్టు మధు పిలుపునిచ్చారు. ఏపీఎంలు, సమభావన సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరడానికి లేట్ ఫీజు లేకుండా చివరి అవకాశం ఈనెల 18 వరకు మాత్రమే ఉందని తెలిపారు. సెంటర్‌లో ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు జరగాలనే ఉద్దేశంతో గ్రామస్థాయిలోని సమభావన సంఘాల సభ్యులు, విద్యార్థులను ప్రోత్సహించి దరఖాస్తులు సమర్పించేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పెంచికల్ దిన్నె జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎన్. నరసింహారావు, సీసీఎం ఎల్లయ్య, వి. రాధిక, ఎం. సుగుణ, కే. నాన్సీ, ఎస్. మాధవి, ఎల్. రేణుక, నాగలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటం కమ్యూనిస్టులదే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: కమ్యూనిస్టుల నాయకత్వంలోనే నాటి వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందనేది చరిత్ర చెప్పే వాస్తవమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అరుణపతకాన్ని ఎగురవేసి, జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనపై, రజాకార్ల అకృత్యాలపై, దొరల దేశ్ముక్‌ల దౌర్జన్యాలపై కమ్యూనిస్టుల నాయకత్వంలో కొనసాగి, నాల్గు వేల మంది కార్యకర్తల భలిదానలతో, 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, వేలాది గ్రామాలను భూస్వాముల కబంధహస్తాల నుండి విముక్తం చేసి, నిజాంపాలన అంతానికి చరమ గీతం పాడి, భారత్‌లో విలీనం అయ్యే విధంగా పోరాడిన ఘన చరిత్ర కేవలం కమ్యూనిస్టులది మాత్రమేనని అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, పోరాట చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు కందుల యాకయ్య అరుణ పతకాన్ని ఎగుర వేయగా, మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, బోల్లు వెంకన్న, గజ్జి చంద్రయ్య,కన్నె వెంకన్న, నర్సింగం గురువయ్య, కలగూర నాగరాజు, బుడేగే పిచ్చయ్య, వెంకన్న, నల్లు మధుసూదన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సూర్యనారాయణ, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - తొర్రూరు : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని పిడిజిలు లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, లయన్ లక్ష్మీనరసింహారావులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శుక్రవారం రాత్రి స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో షీల్డ్, గిఫ్ట్, పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులు మన జీవితంలో వెలుగులు నింపే దీపస్తంభం లాంటి వారని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి గురువులకు ఉందన్నారు. జిఎంటి కోఆర్డినేటర్ తుమ్మాటి వెంకట్ రెడ్డి, ఎవల్యూషన్ చైర్మన్ రేగూరి వెంకన్న, జిఎల్టి కోఆర్డినేటర్ శారద, కూల్ గ్యాట్ డాక్టర్ పి.కిరణ్‌కుమార్, ఆర్‌సి దామెర సరేష్, జెర్సీ చిదిరాల నవీన్, రీజినల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, తమ్మి రమేష్, రమణారెడ్డి, పెరుమాండ్ల రమేష్, డాక్టర్ యాదగిరి రెడ్డి, తమ్మెర వీరభద్రరావు, మాదారపు వేణుగోపాల్, డాక్టర్ సునీల్, మచ్చ సురేష్, మచ్చ సోమయ్య, నగేష్, చక్రపాణి, సుధాకర్, వేముల రమేష్, కిన్నెర పాండు, మున్నూరు కోటయ్య, ఎడ్ల వెంకట్ రెడ్డి, గంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: ఒప్పుకున్న సమస్యలు పరిష్కరించనందువల్లనే ఇటీవల సింగరేణి యాజమాన్యంతో జరిగిన స్ట్రక్చర్ కమిటి సమావేశాన్ని బహిష్కరించామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఉపప్రధాన, ఏఐటీయూసి కార్యదర్శి మడ్డి ఎల్లయ్య అన్నారు. శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవనంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న సమస్యలపై ఇప్పటివరకు అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయలేదని, ఇలాగే చేస్తే గుర్తింపు సంఘంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సర్కారు సంఘం ఐఎన్టీయుసి సమస్యలు పరిష్కారం కాకుండా యాజమాన్యాన్ని, అధికారులను బెదిరిస్తూ అడ్డుకుంటూ ఏఐటీయుసిని బద్నాం చేస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా యాజమాన్యంపై ఐఎన్టీయుసి నాయకులు ఒత్తిడి చేయడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయన విమర్శించారు. బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు గుర్రం ప్రభుదాస్, దాసరి శ్రీనివాస్, అటికేటి రాజు, బొల్లి శ్రీనివాస్, దోరగండ్ల మల్లయ్య, ఏవిఎస్ ప్రకాశ్, నేరెళ్ళ సదయ్య, సమ్మి రెడ్డి, చెప్యాల మహేందర్‌రావు, ఎర్రగొల్ల చేరాలు, ఆర్ రాజేశ్వరరావు ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ రోడ్‌లో సైడ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు

విశాలాంధ్ర - కారేపల్లి : మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ (రామలింగా పురం)లో నూతనంగా సైడ్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు శనివారం కొలతలు వేసి ప్రతిపాదనలు రూపొందించారు. గత నెల 28వ తేదీన స్థానికుల అభ్యర్థనతో గ్రామంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్‌లు పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సైడ్ కాలువల నిర్మాణానికి అయ్యే వ్యయ ప్రతిపాదనలను సంబంధిత అధికారులతో రూపొందించి తనకు పంపించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాజీ వైరా ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణకు సూచించారు. దీంతో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రాజశేఖర్, వర్క్ ఇన్స్పెక్టర్ వినయ్‌లు కారేపల్లి క్రాస్ రోడ్‌ను సందర్శించి సైడ్ కాలువలకు కొలతలు వేశారు. సంబంధిత ప్రతిపాదనను ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, కాంట్రాక్టర్ బానోతు రాందాస్, గ్రామస్తులు సిద్దంశెట్టి నాగయ్య, షేక్ సైజన్, సురభి సాగర్, షేక్ పెద్ద పాష, కాన్చాని వెంకన్న, అనుముల నర్సయ్య, సైద్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - కొమరం భీం : ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరికిపండ్ల నరహరి ఐ.ఎ.ఎస్. నిర్మించిన ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఆలయ ఫౌండేషన్, కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే తపనతో ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, మానవ శరీరంలో అన్ని అవయవాలలో కంటే చూపు చాలా ముఖ్యమన్నారు. ఈ ప్రాంతంలో కంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ఆలయ ఫౌండేషన్ స్థాపకులకు ధన్యవాదాలు తెలిపారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలని, త్వరలో తిర్యాణి మండలంలో కంటి పరీక్ష వైద్య శిబిరం నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషమని తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు పరం చేస్తే ప్రతిఘటన తప్పదు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే ప్రతిఘటన ఉద్యమాలు తప్పవని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా హెచ్చరించారు. ఆ యూనియన్ జిల్లా 3వ మహాసభ శేషగిరిభవన్‌లో శనివారం జరిగింది. మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే లక్ష్యం నెరవేరదని నిరాకరిస్తూ సుప్రీం కోర్టు కొన్ని గైడెన్స్ విడుదల చేసిందని గుర్తు చేశారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా పాటించి, సెంట్రలైజ్డ్ కిచెన్ విధాన్ని విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. మధ్యాహ్న కార్మికులకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లు కావస్తున్నా ఆ హామీని అమలుచేయకుండా కార్మికులను మోసం చేస్తోందన్నారు. ఈ పథకం లక్ష్యం నెరవేరాలంటే స్లాబ్ రేటు రూ.25 లకు నిర్ణయించాలన్నారు. నిత్యావసరాలు, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ మాట్లాడుతూ వంట కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద భీమా, టర్మినల్ బెనిఫిట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, వేర్పుల మల్లికార్జున్, నిమ్మటూరి రామకృష్ణ, సత్తెనపల్లి విజయలక్ష్మి, దాసుల పుష్పవతి, ఎన్ ప్రభావతి, పైడిపల్లి లక్ష్మి, షహీన్, మంగ, నర్సమ్మ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం

విశాలాంధ్ర - చర్ల : తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల కోసం అశువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో నేడు ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 11 నుంచి 17 వరకు జరిగే వార్షికోస్తవాలలో అమరవీరులకు జోహార్లు తెలుపుతూ నివాళులు అర్పిస్తూ పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. నిజాం నిరంకుశ పాలనకు తొత్తులుగా ఉన్న పటేల్, పట్వారి రాష్ట్ర జమీందారులను తరిమికొట్టిన కమ్యూనిస్టు గెరిల్లాల పోరాటంలో 4 వేల యువ కిశోరల ప్రాణాల బలిదానం జరిగిందని, 10 లక్షల ఎకరాల భూమి పేద వర్గాలకు పంచి పెట్టడం జరిగిందన్నారు. నేటి యువతరం మన పూర్వీకుల త్యాగాల బాటలో నడిస్తే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అడ్డగర్ల తాతాజీ, నుప పోతయ్య, నూక తిరుపతిరావు, రామారావు, ముత్యాలరావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, రాజారావు, దేవయ్య. భీమయ్య, మంగమ్మ నరసమ్మ, అనసూర్య పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెనుబల్లి : సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పెనుబల్లి రైతువేదికలో పెనుబల్లి మండల పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. పెనుబల్లి మండల పరిధిలో లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ 98,55,00 లక్షల రూపాయలు, కళ్యాణ్ లక్ష్మి లబ్ధిదారులు 34,03,944 రూపాయలు విలువ గల చెక్కులను ఆమె శనివారం లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు పంపిణీ తదనంతరం ఇందిరమ్మ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు కార్యకర్తలకు వివరించారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు దీవించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎంఆర్ఓ,ఎంపీడీఓ, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలి

విశాలాంధ్ర - పినపాక : ఐలాపురం ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు సమయానికి భోజనం అందించడం లేదని, మెనూ ప్రకారం పెట్టడం లేదని సమాచారం అందడంతో హాస్టల్ వార్డెన్, హెచ్ఎం పై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. పినపాక నియోజక వర్గంలోనీ ప్రభుత్వ ఆశ్రమ, వసతి గృహాలలో వార్డెన్లు, హెచ్ఎంలు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం ఉదయం పినపాక మండలంలో పర్యటించిన ఆయన మధ్యాహ్నం ఐలాపురం గురుకుల బాలికల అశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే హాస్టల్‌కి చేరుకుని నేరుగా వంటశాలకు వెళ్లారు. అక్కడ వంట చేస్తున్న సిబ్బంది మధ్యాహ్నం 3 గంటలైన భోజనం తయారు చేయకపోవడంతో ఎమ్మెల్యే వారి పై మండిపడ్డారు. అనంతరం అక్కడికి చేరుకున్న పాఠశాల హెచ్ఎం, వార్డెన్ లను పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులు భోజనాల విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం హాస్టల్స్ లో చదివే విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచినప్పటికీ వాటిని ఎందుకు అమలు చేయడం లేదని అధికారులను ప్రశ్నించి ఆగ్రహం వ్యక్తం చేసారు. అనంతం విద్యార్థుల కోసం వండిన భోజనం తిని ఏమాత్రం నాణ్యత లేదని అసహనం వ్యక్తం చేశారు. ఐటిడిఏ పరిధిలోని హాస్టల్ పర్యవేక్షణ అధికారికి వెంటనే ఫోన్ చేసి మాట్లాడి ఇక్కడి హాస్టల్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉడుముల లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, కొర్సా ఆనంద్, బందారు సాంబశివరావు, తోలెం అర్జున్ తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లాలో సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీరామ్, వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ తదితరులు వనపర్తి ఆఫీసులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సాయుధ రహితంగా పోరాటం చరిత్రలో మహోజ్వల ఘట్టమన్నారు. భూమి కోసం భుక్తకోసంసం వెట్టి చాకిరి, నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. గ్రామాల్లో ప్రజలను పీడిస్తున్న నిజాం తాబేదారులైన దొరలను తరిమికొట్టి 3000 గ్రామాలను విముక్తం చేసి ఎర్రజెండాలు పాతారన్నారు. నాటి పోరాటానికి సిపిఐ అగ్ర నేతలు రావి నారాయణరెడ్డి, మగ్దుం మైనుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి తదితరులు నాటి పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులు మాత్రమే వారసులన్నారు. బిజెపి అబద్దాలను ప్రజల్లో తీసుకువెళ్లేందుకు, నాటి పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు వనపర్తి జిల్లాలో ఈనెల 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జరపాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సీఎస్ శెట్టి, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మణిపూర్ మొక్కు చెల్లించుకున్న మోదీ

మణిపూర్ భగ్గుమన్న 864 రోజుల తరవాత ఆ రాష్ట్రంలో పర్యటించడానికి ప్రధానమంత్రి మోదీకి శనివారం తీరిక చిక్కింది. 2023 మే మూడవ తేదీన మణిపూర్‌లో మెయితీలు, కుకీల మధ్య కలహాలు ప్రారంభమైనాయి. ఈ అల్లర్లలో 260 మందికి పైగా మరణించారు. దాదాపు 50,000 మంది తమ రాష్ట్రంలోనే నిరాశ్రయులై శరణార్థుల శిబిరాల్లో బతుకు వెళ్లదీస్తున్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒకసారి మణిపూర్ వెళ్లి వచ్చారు కానీ ఆయన ప్రజలతో మాట్లాడలేదు. కలహిస్తున్న మెయితీలు, కుకీలనూ పలకరించనే లేదు. అతిథి గృహంలో బస చేసి అధికారులతో సంభాషించి వచ్చేశారు. మోదీ ఆ పనీ చేయలేదు. కానీ ఈ మధ్య కాలంలో ఆయన డజన్ల కొద్దీ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. అనేక విదేశీ యాత్రలు చేశారు. మణిపూర్ మాత్రం వెళ్లలేదు. ప్రధాని మణిపూర్ వెళ్లనందుకు ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, బయట ఎన్ని విమర్శలు చేసినా అక్కడ గొడవలు మొదలైన 70 రోజుల తరవాత తప్ప మోదీ పెదవి విప్పలేదు. అదీ పార్లమెంటు మెట్ల దగ్గర విలేకరులతో పిచ్చాపాటీగా మాట్లాడుతూ మణిపూర్ ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ తరవాత కొన్ని నెలలకు మణిపూర్ ప్రస్తావన పార్లమెంటులో తీసుకొచ్చారు. అదీ ప్రతిపక్షాలు ప్రతి పాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భం గానే. అవిశ్వాస తీర్మానానికి మోదీ 2 గంటల 20 నిమిషాల సేపు సమాధానం ఇచ్చారు. అందులో మణిపూర్ కోసం కేటాయించింది పట్టుమని పది నిముషాలు కూడా లేదు. మోదీ కుకీలు ఎక్కువగా ఉండే చురచంద్ పూర్‌లో, మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మాత్రమే పర్యటించారు. ప్రధానమంత్రి మణిపూర్ పర్యటన ద్వారా ఆ రాష్ట్రంలో శాంతి, సామరస్యం నెలకొంటాయని అధికారులు అంటున్నారు. ఈ అవసరాన్ని రెండున్నరేళ్లుగా మోదీ ఎందుకు గుర్తించలేదో మాత్రం ఎవరూ సమాధానం చెప్పరు. మణిపూర్‌లో అల్లర్లు ప్రారంభమైన దగ్గర నుంచి మోదీ ఆ రాష్ట్రాన్ని మన దేశంలో భాగంగా గుర్తించిన దాఖలాలే లేవు. షరా మామూలుగా మోదీ వెళ్లిన రెండు ప్రాంతాలలోనూ అభివృద్ధి మంత్రం జపించారు. చురాచంద్రపూర్‌లో రూ. 7,300 కోట్లు ఖర్చయ్యే వివిధ అభివృద్ధి కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. అలాగే మెయితీలు అధిక సంఖ్యలో ఉన్న రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో రూ. 1,200 కోట్లు ఖర్చయ్యే వివిధ పథకాలను ప్రారంభించారు. నిర్వాసితులైన వారితో సంక్షిప్తంగా మాట్లాడారు. 2023 మే మూడున అల్లర్లు ప్రారంభం అయినప్పటి నుంచి కుకీలు అధిక సంఖ్యలో ఉన్న గిరిజన ప్రాంతాలకు, మెయితీలు ఎక్కువ సంఖ్యలో ఉండే మైదాన ప్రాంతాలకు మధ్య సంబంధమే లేకుండా పోయింది. ఈ రెండు ప్రాంతాలు శత్రు శిబిరాలుగా మారిపోయాయి. కుకీలు గిరిజన ప్రాంత వాసులైతే మెయితీలు మైదాన ప్రాంతాల్లో ఉంటారు. ఒక ప్రాంతంలోని వారిని మరో ప్రాంతంలోకి అడుగే పెట్టనివ్వలేదు. అల్లర్లు జరిగిన సమయంలో జరిగిన సంఘటనలు కేవలం మరణాలకు మాత్రమే పరిమితం కాలేదు. మహిళల మీద మూకుమ్మడి అత్యాచారాలు జరిగాయి. మహిళలను నగ్నంగా వీధుల్లో ఊరేగించారు. ఇవేవీ మోదీకి కనిపించినట్టు లేదు. అందుకే మణిపూర్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు అట్టహాసంగా మోదీ మణిపూర్ పర్యటన ఘనతను చాటే ప్రయత్నం జరుగుతోంది. కానీ మోదీ పర్యటన సందర్భంగా కూడా అనేక చోట్ల ఆయన పర్యటనకు వ్యతిరేకత వ్యక్తం అయింది. కొన్ని చోట్ల మోదీ పోస్టర్లను చించేశారు. అయితే ప్రధాని పర్యటనకోసం గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తారు. కాబట్టి శనివారం అవాంఛనీయమైన సంఘటలనేవి ఏమీ జరగలేదు.

మోదీ మణిపూర్ పర్యటనను గొప్పగా చిత్రీకరించడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునీత్ కుమార్ గోయల్ పడరాని పాట్లు పడవలసి వచ్చింది. "మణిపూర్ కేవలం సరిహద్దు రాష్ట్రం మాత్రమే కాదు. అది తూర్పు దేశాలతో భారత్ సంబంధాలకు కేంద్ర బిందువు. ఆగ్నేయాసియాకు ముఖ ద్వారం. మన దేశ వైవిధ్యానికి చిహ్నం. శాంతి అంటే హింసాత్మక సంఘటనలు జరగకపోవడమే కాదు" లాంటి మోదీ చెప్పే మాటలను ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శే చెప్పేశారు. అనువైన ప్రాతిపదిక ఏర్పాటు చేసిన తరవాతే మోదీ మణిపూర్‌లో కాలు పెట్టారు. అయినా కొన్ని అవాంతరాలు తప్పలేదు. సంయుక్త నాగా మండలి (యూఎన్‌సీ) కీలక రహదారుల్లో నిరవధిక "వాణిజ్య నిషేధం" విధించింది. ప్రధాని పర్యటన రోజున "సంపూర్ణ బంద్" పాటించాలని మెయితీ తిరుగుబాటుదార్లు పిలుపు ఇచ్చారు. మోదీ పర్యటనకు సానుకూల పరిస్థితులను కల్పించడం కోసం సెప్టెంబర్ నాలుగో తేదీన కుకీ–జో ఒప్పందం కుదిరింది. అంటే ఇంతకు ముందున్న ఒప్పందానికి మళ్లీ ప్రాణ ప్రతిష్ఠ చేశారు. బీజేపీకి మెయితీల మద్దతు ఉంది కానీ ఈ ఒప్పందంలో మెయితీలను భాగస్వాములను చేయకపోవడం ఆ వర్గంలో అసంతృప్తికి కారణం అయింది. ఈ ఒప్పందానికి కుకీలు తమకు అనుకూలమైన భాష్యాలు చెప్తున్నారు. కుకీలు అడుగుతున్నది తమ ప్రాంతానికి ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు చేయడం. అంటే వారు కోరుతున్నది కేంద్ర పాలిత ప్రాంత హోదా. ఎవరు కోర్కెలు ఎలా ఉన్నా ఒప్పందాన్ని పొడిగించడానికి అసలు కారణం మోదీ పర్యటనకు సానుకూల పరిస్థితి కల్పించడమే. అయితే మోదీ 2024 లో లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా దేశమంతటా కాలికి బలపం కట్టుకుని తిరిగారు కానీ మణిపూర్‌లో మాత్రం ప్రచారానికి వెళ్లలేదు. మణిపూర్‌లో రెండు లోక్‌సభ స్థానాలు ఉండడం మాత్రమే మోదీ ఆ రాష్ట్రానికి వెళ్లకపోవడానికి కారణంగా లేదు. ఆ సమయంలో మణిపూర్‌లో కాలు మోపే సాహసం చేయలేక పోయారు. మణిపూర్‌లో బీరేంద్రసింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసి అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలన్న ప్రతిపక్షాల కోరికనూ మోదీ వినిపించుకోలేదు. పార్లమెంటు ఆవరణలో విలేకరులతో పిచ్చాపాటీగా మణిపూర్ ప్రస్తావన తెచ్చినప్పటికీ చాలా అసందర్భంగా అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో మహిళల పరిస్థితిని ప్రస్తావించకుండా వదిలి పెట్టలేదు. 2024 లోక్‌సభ ఎన్నికల తరవాత జరిగిన పార్లమెంటు సమావేశాల్లో లోక్‌సభలో ప్రతిపక్షాలు మణిపూర్ అంశంపై పెద్ద పెట్టున నినాదాలు చేశాయి. అప్పుడుగానీ రాజ్యసభలో ఆ వ్యవహారాన్ని మోదీ ప్రస్తావించలేదు. మణిపూర్ పర్యటన సందర్భంగా మోదీ చెప్పిన మాటలు ఎక్కడైనా చెప్పి ఉండవచ్చు. ప్రారంభించిన అభివృద్ధి పథకాల గురించి ఎప్పుడైనా మాట్లాడి ఉండవచ్చు. మణిపూర్ పర్యటనలో మోదీ ఇచ్చిన ప్రత్యేకమైన హామీ ఏమీ లేదు. ఆయన పర్యటన మొక్కుబడిగానే సాగింది.

పాలనలో పారదర్శకత లోపిస్తే చుక్కలే

రావుశ్రీ

ఇటీవల కాలంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన పరిణామాలు యావత్ ప్రపంచాన్ని హడల్ ఎత్తించాయి. ఈ సంఘటనలతో దాదాపు అన్ని దేశాధినేతలు, పాలకులు, ప్రభుత్వాలు చాలా గుణపాఠాలు నేర్చుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాల్లో ప్రజలు చాలా ఓపిక, సహనం కలిగి ఉంటారు. ఓటు ద్వారా, సోషల్ మీడియా ద్వారా, పత్రికల ద్వారా, భావ ప్రకటన ద్వారా తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతూ ఉంటారు. ఇవేమీ పట్టించుకోకుండా, అధికారం మన చేతిలో ఉంది అని మూర్ఖంగా ముందుకు పోయే ప్రభుత్వాలకు ప్రజలు ముఖ్యంగా యువత ఏ రకంగా బుద్ధి చెబుతుందో గతంలో శ్రీలంకలో జరిగిన పరిణామాలు, తాజాగా నేపాల్‌లో జరిగిన పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. తస్మాత్ జాగ్రత్త పాలకులారా అని హెచ్చరికలు యువత ప్రత్యక్ష చర్యలు ద్వారా చేశారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా పాలకులు తమ పాలనా పద్ధతులను, విధానాలు మార్చుకోవాలి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో ప్రజలు, యువత ఇంత బాహాటంగా పాలక వర్గంపై హింసాత్మక ఘటనలతో రెచ్చిపోవడానికి ప్రధాన కారణాలు పాలకుల అవినీతి, బంధుప్రీతి అని గ్రహించాలి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి/ బంధుప్రీతికి పెద్ద పీట వేసి, ప్రజల అవసరాలు పక్కన పెట్టడంతో చివరికి విసుగు చెందిన ప్రజలు, యువత ప్రత్యక్ష చర్యలకు దిగి పాలకులను తరిమికొడుతున్నారు. నిజానికి రాజకీయాల్లో వచ్చిన ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత స్వార్థం వదులుకుని, ప్రజలకు సేవ చేయాలి. ప్రజా సమస్యలు పరిష్కరించాలి. ప్రజల అవసరతలు తీర్చాలి. వారి అభిప్రాయాలను గౌరవించి తదనుగుణంగా పాలన అందించాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. కానీ నేటి పాలకులు ఎన్నికయ్యే వరకూ ప్రజలే దేవుళ్లు అంటూ పొగిడి, ఓట్లు, సీట్లు దండుకుని తదుపరి ప్రజలకు దూరం జరగడంతో ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు. అవినీతి, బంధుప్రీతికి భారీ స్థాయిలో పాల్పడడం, అధికారం అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో నడవడంతో చివరికి దేశం విడిచి పారిపోయే పరిస్థితి, ప్రాణ సంకటంతో బతికే పరిస్థితి తెచ్చుకుంటున్నారు. ఇకనైనా పాలకుల స్వభావం మారాలి. ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించాలి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

ప్రపంచ సర్వే సంస్థలు వెలువరించిన నివేదికలు ప్రకారం ముఖ్యంగా అవినీతిలో శ్రీలంక 121 వ స్థానంలో, బంగ్లాదేశ్ 151 వ స్థానంలో, నేపాల్ 107 వ స్థానంలో, ఇక మన భారతదేశం 96 వ స్థానంలో ఉంది. అనగా ఈ దేశాల్లో అవినీతి బంధుప్రీతి ఎంతగా విస్తరించి ఉందో తేటతెల్లం అవుతుంది. మానవ సేవే - మాధవ సేవ అని, ప్రజాసేవే -పరమావధి అని నమ్మ పలుకుతూ, ప్రమాణం చేసే సమయంలో ఆయా దేశాల రాజ్యాంగ ప్రకారం, వారి ఇష్ట దైవాన్ని ప్రార్థిస్తూ, ప్రమాణం చేసిన పాలకులు నిజ జీవితంలో ముఖ్యంగా అధికారం చేపట్టిన తరువాత విచ్చలవిడిగా అవినీతి బంధుప్రీతితో వేల కోట్ల రూపాయలు ప్రజా ధనాన్ని లూటీ చేయడంతో, మోసపోయిన ప్రజలు పోరుబాట పడుతున్నారు. తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తున్నారు. మన దేశంలో కూడా ఇటీవల కాలంలో రాజకీయ అవినీతి, బంధుప్రీతి పెచ్చుమీరుతున్నది. ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని చూడటం జరుగుతోంది. ఇది ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోరాదు. ఎన్నికల్లో అడ్డమైన వాగ్దానాలు ఇచ్చి, గద్దె ఎక్కిన తరువాత గల్లాపెట్టెలో డబ్బులు లేవు అని మోసం చేయకూడదు. గత ప్రభుత్వాలు ఎంత మేరకు నిధులు నిల్వలు ఉంచారో తెలిసే కదా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ప్రజలకు, యువతకు అనేక వాగ్దానాలు చేసి, ఓట్లు సీట్లు దండుకుని, తీరా అధికారం చేపట్టిన తరువాత డబ్బులు లేవు అని వాగ్దానాలు నెరవేర్చక పోతే, ప్రజలు, యువత ఆగ్రహం చెందక ఏం చేస్తారు.

పాలకులు ముఖ్యంగా అవినీతి, బంధుప్రీతి వదులుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజా ధనాన్ని వేతనాలుగా తీసుకుంటూ, కనీసం శాసనసభ సమావేశాలకు, శాసనమండలి సమావేశాలకు, పార్లమెంటు సమావేశాలకు రాకపోవడం మంచిది కాదు. భవిష్యత్తులో జవాబు చెప్పవలసిన పరిస్థితి ఉంటుంది. అధికారం రాలేదు అని, గెలిచిన తరువాత సమావేశాలకు రాకుండా ఉంటే ఎలా? ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు, ప్రజల మనిషిగా ఉండాలి. సొంత వ్యాపారాలు పెంచుకోవడం, సొంత సంపద పెంచుకోవడం కోసం రాజకీయ అవతారాలు ఎత్తడం సరికాదు. ఏదో ఒక సమయంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని మన ఇరుగు పొరుగు దేశాల పరిస్థితులు బట్టి తెలుస్తోంది. దేశంలో నెలకొన్న అవినీతిపై ఉక్కు పాదం మోపాలి. నిరక్షరాస్యత అనారోగ్యం పేదరికంను పూర్తిగా నిర్మూలించాలి. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలను రాజ్యాంగ బద్ధంగా పనిచేసే విధంగా ప్రోత్సహించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, సంస్థలు అవినీతి బంధుప్రీతి రహితంగా విధులు నిర్వహించాలి. లేకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని గ్రహించాలి. ప్రజలందరికీ కనీసం కూడు, గూడు, గుడ్డ అందించే పని పాలకులు చేపట్టాలి. విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ, పారిశ్రామికరంగాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి. బడ్జెట్లో అధిక నిధులు సమకూర్చాలి. అధిక ధరలు, ప్రైవేటీకరణకు ముకుతాడు వేయాలి. సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలతో సుస్థిర అభివృద్ధి అసాధ్యం అనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి.

ఎన్నికల నిఘా నేత్రం - ఛోకర్

ఆర్వీ రామారావ్



కర్నాటకలోని మహదేవ్ పురా శాసనసభా నియోజకవర్గంలో లక్షకు పైగా ఓటర్లను జాబితాలో ఎలా దూర్చారో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోదాహరణంగా వివరించకముందు నుంచే జనం ఎన్నికల ప్రక్రియ గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. బీహార్‌లో ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కావడానికి, ఆ ప్రక్రియపై అనేక ప్రశ్నలు తలెత్తడానికి ముందే జనం ఎన్నికలలో జరిగే అక్రమాల గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. అలా ఆలోచించగలగడానికి కారకులు చాలా మందే ఉండొచ్చు. అయితే అందులో మొదట గుర్తుకు వచ్చేది మాత్రం జగదీప్ ఛోకర్. ఎన్నికల కమిషన్‌పై ఇప్పుడు అనేకమంది లేవనెత్తుతున్న ప్రశ్నల వెనక ఛోకర్ ప్రేరణ ఉంది. నిరంతర కృషీ ఉంది. ఎన్నికల కమిషన్ విధివిధానాల గురించి ఆయన జనాన్ని జాగృతుల్ని చేశారు. ఎన్నికల కమిషన్ బాధ్యాతాయుతంగా మెలగవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అభ్యర్థుల అర్హతలు–అనర్హతలు, వారి ఆస్తులు–అప్పులు, చదువు–సంధ్యలు, ఆదాయ వనరులు, నేర చరిత్రలు మొదలైనవాటి గురించి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రమాణ పత్రాలు (అఫిడవిట్లు) దాఖలు చేయడం ఎంత ముఖ్యమో నొక్కి చెప్పిన వారూ ఛోకరే. ఎనభై ఏళ్ల ఛోకర్ శుక్రవారం 80వ ఏట తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని లేడీ హార్డింగ్ వైద్య కళాశాలకు అందజేశారు. ఎన్నికల క్రమంపై, ఎన్నికల కమిషన్‌పై నిరంతరం నిఘా నేత్రంగా వ్యవహరించిన వ్యక్తి లేకుండా పోయారు.

ఎన్నికల ప్రక్రియ ఆనుపానులు జనానికి తెలిసేట్టు చేసిందీ ఆయనే. ఎన్నికల సంస్కరణల కోసం ఆయన నిరంతరం పాటుపడ్డారు. జనం ఈ అంశం గురించి ఆలోచించేట్టు చేశారు. టూకీగా చెప్పాలంటే ఒక రకంగా ఆయన ప్రజల తరఫు ప్రధాన ఎన్నికల అధికారి అనుకోవాలి. ఆయన చాలా కాలం నుంచి ఎన్నికల సంస్కరణల కోసం పరితపిస్తున్నారు. అందుకోసమే 1999లో ఏర్పడిన అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫారంస్ (ఏడీఆర్) వ్యవస్థాపనలో ఆయనది కీలక పాత్ర. మేజర్ జనరల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అనిల్‌వర్మ, బెంగళూరు ఐఐఎం ప్రొఫెసర్ త్రిలోచన్ శాస్త్రి - ఇలా మొత్తం 11 మంది ఏడీఆర్ ప్రారంభించారు. ఛోకర్ ఆ వ్యవస్థకు ఇరుసులా ఉండేవారు. ఏడీఆర్ లాంటివి ఏం చేయగలవు, కోర్టులో అర్జీలు దాఖలు చేసినంత మాత్రాన ఏమవుతుంది అని పెదవి విరిచిన వారు లేకపోలేదు. కానీ ఆ సంస్థ ఇప్పుడు ఎన్నికల వ్యవస్థపై పెద్ద నిఘా నేత్రం. ఛోకర్ అహమదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన చదివిన చదువుకు, చేసిన ఉద్యోగాలకు నడిపిన ఉద్యమాలకు, రాజకీయాలలో దాపరికంలేని తత్వంకోసం కృషి చేయడానికి పొంతనే లేదు. కానీ ఆయన మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా కాక ఎన్నికల సంస్కరణల కోసం పాటుబడ్డ వ్యక్తిగానే గుర్తుంటారు. ప్రభుత్వం ఒళ్లో కూర్చుని పనిచేసే మీడియా చానళ్లను, యూట్యూబ్ చానళ్లను వదిలేస్తే జనం భాష మాట్లాడే ప్రసార సాధనాలు చూసే అలవాటు ఉన్న వారికి ఆయన ముఖం వెంటనే గుర్తొస్తుంది.

ప్రసిద్ధ పత్రికా రచయిత్రి, పౌర సమాజంలో గుర్తింపు పొందిన వ్యక్తి గౌరీ లంకేశ్‌ను, గంగానది ప్రక్షాళన కోసం జీవితాంతం పాటుపడ్డ జీడీ అగర్వాల్‌ను తాను ఎన్నటికీ విస్మరించను అని ఛోకర్ చెప్పేవారు. అహమదాబాద్ ఐఐఎం నుంచి ఉద్యోగ విరమణ చేసిన తరవాత ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణకోసమే తన జీవితాన్ని అంకితం చేశారు. అందులో ప్రధానాంశం ఎన్నికల వ్యవస్థను సంస్కరించడమే. 21వ శతాబ్దంలో ప్రజాస్వామ్యం గొంతు నులిమే వారి సంఖ్య పెరిగిపోయింది. వారితో పోరాడడమే ఛోకర్ జీవిత లక్ష్యం అయిపోయింది. జగ్దీప్ ఛోకర్ తలకెత్తుకున్న పోరాటం వల్ల వ్యక్తిగతంగా ఆయనకు ఒరిగిందేమీ లేదు. ఈ దేశ ప్రజల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ఎన్నికల వ్యవస్థ పరిరక్షణ కోసమే ఆయన నిరంతరం పోరాడారు. భవిష్యత్తు మీద ఆయనకు ఎంతో ఆశాభావం ఉందనడానికి ఆయన కృషే నిదర్శనం. ఏడీఆర్ వెబ్‌సైట్‌లో మొదటి పేజీ తెరిచి చూస్తే "ప్రజలే ప్రభువులు" అన్న మాటలు కనిపిస్తాయి. ఈ లక్ష్య సాధన కోసమే ఛోకర్ కలలుగన్నారు. పోరాడారు. వేలాది మహజర్లు రాశారు. అనేక కోర్టుల మెట్లెక్కి దిగారు. కొందరు ఎన్నికల కమిషనర్లతో తగువు తెచ్చుకొన్నారు. మరికొందరు కమిషనర్లు ఆయనకు మంచి మిత్రులయ్యారు. మన రాజ్యాంగ నిర్మాతలు నికార్సైన స్వాతంత్ర్య పోరాట యోధులు అద్భుతమైన రాజ్యాంగాన్ని మనకు అందించారు. కానీ దాన్ని కాపాడడానికి ఛోకర్ లాంటి వారు లేకపోతే అది ఎప్పుడో గ్రంథాలయాల సొరుగుల్లో చెదపట్టి పోయేది.

ఏడీఆర్ కోర్టులో పిటిషన్ వేయక ముందు ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు కేవలం తమ పేరు, చిరునామా లాంటి మామూలు విషయాలనే తెలియజేసే వారు. ఏడీఆర్ పిటిషన్ తరవాత ఇప్పుడు ఎన్ని వివరాలు అఫిడవిట్‌లో పొందుపరచాల్సి వస్తుందో చూస్తే ఎన్నికల సంస్కరణ చిన్న చిన్న అడుగులతో ప్రజోద్యమంగా ఎలా మారిందో అర్థం అవుతుంది. ఈ అఫిడవిట్లను ప్రజలకు చేరవేసే బాధ్యత కూడా ఏడీఆర్ తీసుకుంది. ఎంత పని చేసినా తనకు పేరు ప్రఖ్యాతులు రావాలని ఛోకర్ ఏనాడూ ఆశించలేదు. బీహార్‌లో ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా ప్రస్తావన వచ్చినప్పుడు మొట్టమొదట సుప్రీంకోర్టుకు ఎక్కింది ఛోకర్ ప్రాతినిధ్యం వహించే ఏడీఆర్ మాత్రమే. ఏ రాజకీయ పార్టీ ఈ విషయంలో చొరవ చూపక ముందే ఛోకర్ సుప్రీంకోర్టు మెట్లెక్కారు. ప్రతి ఓటరు అధికారం కోసం సకల విధ పోరాటాలు చేసింది ఛోకర్, ఆయన లాంటి వారే. ఏడీఆర్ లేకపోతే మన మంత్రుల్లో 47 శాతం మంది నేరచరితులని తెలిసేదే కాదు. రాజకీయ పార్టీల విరాళాల లోతుపాతులు తరచి చూసిందీ ఛోకరే. వివిధ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం అత్యవసరమని ఆయన నినదించేవారు. ఛోకర్ లాంటి వారి పట్టుదలే లేకపోతే ఎన్నికల బాండ్లు రద్దయ్యేవే కాదేమో. బీహార్‌లో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలు బయట పెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించడం వెనకా ఛోకర్ లాంటి వారి ప్రయత్నం ఉంది.

ప్రతి ఆదివారం మిత్రులతో కలిసి ఉదయం ఫలహారం చేయడం ఛోకర్ నియమం. ఇలాంటి అలవాటు ఉన్నవారు ఎంతమంది? ఇవ్వాళ ఆయన ఇంట్లో ఉదయం డైనింగ్ టేబుల్ ఖాళీగా ఉంటుందేమో. ఆయన మృతి వల్ల ఏర్పడిన శూన్యం ఇదొక్కటే కాదు. అన్నీ ఏకరవు పెట్టడం సాధ్యమూ కాదు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లే ప్రధానం అని తెలియజెప్పిందీ ఆయనే.

భారీ సుంకాలు.. రైతుల కుదేలు

పతకమూరు దామోదర్ ప్రసాద్

భారత్ అభివృద్ధి చెందుతున్న దేశంగా పురోగమిస్తూ త్వరలోనే ప్రపంచ మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని పాలకులు చెపుతున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50 శాతం దిగుమతి సుంకాలు విధించడం వల్ల మన జీడీపీ 0.3 శాతం తగ్గనున్నట్లు, జీఎస్టీ సంస్కరణలు, మార్కెట్ల విస్తరణతో జరిగే నష్టాల భర్తీకి ప్రయత్నాలు చేస్తామంటున్నారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల వల్ల మన ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడి వేలాది మంది జీవనోపాధి కోల్పోతున్నారు. ఈ సుంకాలు అమెరికాపై కూడా ప్రభావం కలిగించగలవనే హెచ్చరికలతో తాజాగా భారత్ గొప్ప దేశమని, ప్రధాని మోదీ గొప్ప నాయకుడని ట్రంప్ మాటమార్చినా, అమెరికా సహజ మిత్ర దేశమని మోదీ స్పందించినా భారీ సుంకాలపై నిర్దిష్ట ప్రకటన ఏదీ రానందున భారత్ ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషించడం అనివార్యం.

ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు ఎక్కువ మిగులు ఉండటాన్ని సాకుగా చూపి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతించాలని ట్రంప్ పట్టుపడుతున్నారు. అయితే భారత్‌లో 86 శాతం మంది చిన్న, సన్నకారు రైతుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం చూపే వ్యవసాయోత్పత్తుల దిగుమతులకు అనుమతించేది లేదని భారత ప్రభుత్వం కరాఖండిగా చెబుతుండటం డాలర్ ప్రభువులకు ఆగ్రహం కలిగిస్తోంది. అమెరికాలో వేలాది ఎకరాల్లో భారీ యంత్రాలతో సేద్యం చేయడం, ప్రభుత్వం ఎక్కువ సబ్సిడీలు కూడా ఇస్తుండటం సాగు ఖర్చులు తగ్గి మిగులును భారత్ తదితర దేశాలకు ఎగుమతి చేయడానికి అమెరికా గట్టి ప్రయత్నాలే చేస్తోంది. 146 కోట్ల జనాభాతో అతి పెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌పై ఒత్తిడి తెచ్చి జన్యుపరంగా అభివృద్ధి చేసిన విత్తన రకాలను, వ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసి లాభాలు దండుకోవాలని అమెరికా తహతహలాడుతోంది. కోట్లాది మంది గ్రామీణ పేదలు, రైతుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం చూపే వ్యవసాయోత్పత్తుల దిగుమతులకు మన దేశం ఎంతమాత్రం అంగీకరించదు. అమెరికా తదితర అంతర్జాతీయ భాగస్వాములతో చర్చలు జరిపేటప్పుడు భారత ప్రజల ఆహార భద్రత, రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వాల విహిత కర్తవ్యం. గత ఆగస్టులో బ్రిటన్‌తో కుదుర్చుకున్న సుమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంలో కూడా మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు గల అవకాశాలను అందిపుచ్చుకుంది. పాడి ఉత్పత్తులు, వంటనూనెలు, ఆపిల్స్, ఓట్స్ ఎగుమతులకు అవకాశం లభించలేదు. జపాన్, యూఏఈ, ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణ కొరియా వంటి డజను దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నా వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై భారత్ దృఢ వైఖరిని అవలంబించింది. ఎలాంటి రాయితీలకు అనుమతించలేదు. మన వ్యవసాయరంగం నుంచి 1961 లో 47.6 శాతం జాతీయ ఆదాయం లభించగా ప్రస్తుతం సేద్యపురంగ వాటా జీడీపీ 15 శాతంగా ఉన్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్ 1991 నుంచి సరళీకృత ఆర్థిక విధానాలు అవలంబిస్తున్నప్పటి నుంచి వ్యవసాయరంగం జీడీపీ క్రమంగా తగ్గుతూ వస్తోంది. 1991 లో సేద్యం, అనుబంధ రంగాల నుంచి 29.5 శాతం జీడీపీ రాగా 2001 నాటికి అది 22.3 శాతానికి, 2011 లో14.4 శాతానికి తగ్గింది. గత 15 ఏళ్లుగా సేద్యపురంగ జీడీపీ 15 శాతంగా ఉంటున్నది. దేశ శ్రామికశక్తిలో 55 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తున్నది వ్యవసాయం, అనుబంధ రంగాలే కావడం గమనార్హం. దేశ శ్రామికులు, రైతులు అందునా పల్లె ప్రజల రోజువారీ జీవితాలతో విడదీయలేని బంధం గల సేద్యం, మత్స్య, పశుపోషణ రంగాలు సహజంగానే భారత రాజకీయాలపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. తొలి భారత ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ నుంచి ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ వరకు ఎవరు ప్రధాని అయినా, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ రంగాల ప్రాధాన్యతను, జీవనోపాధులను గమనంలోకి తీసుకునే విధాన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది.

ఇటీవల భారత అమెరికా వాణిజ్య చర్చల్లో కూడా ఈ అంశాలు ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తులు, విత్తనాల దిగుమతికి

అనుమతించాలని, సుంకాలను సరళీకరించాలని అమెరికా చేస్తున్న ఒత్తిడులకు భారత్ తలొగ్గలేదు. కోట్లాది మంది మన అన్నదాతలు, మత్స్య, పశుపోషకుల జీవితాలను పణంగాపెట్టే విషమ షరతులకు అంగీకరించే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రభృతులు స్పష్టం చేయడం సరైనదే.

భారత్ ఎగుమతులలో వ్యవసాయ ఉత్పత్తులకు కూడా గణనీయ స్థానం ఉంది. 2013 లో 314 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య ఎగుమతులు 2024 నాటికి 437.10 మిలియన్ల డాలర్లకు పెరిగాయి. ఈ దశాబ్ద కాలంలోనే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 22.7 బిలియన్‌ల నుంచి 48.15 బిలియన్ డాలర్లకు అంటే 112 శాతం పెరగడం విశేషం. ఈ ఏడాది మార్చి 31 వరకు వాణిజ్య ఎగుమతులు 437 బిలియన్ డాలర్లుగా పెద్దగా పెరుగుదల లేకపోయినా వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 51.9 బిలియన్ డాలర్లకు 6.4 శాతం పెరిగాయి. మన వాణిజ్య ఎగుమతులలో సేద్యపు రంగ ఉత్పత్తుల వాటా11శాతం. వ్యవసాయోత్పత్తులు ఎగుమతి చేస్తున్న పది ప్రఖ్యాత దేశాలలో భారత్ కూడా ముఖ్యమైనదే. 2021 లో భారత వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 2.4 శాతం కాగా దిగుమతులు 1.7 శాతంగా ఉన్నట్లు ప్రపంచ వాణిజ్య సంస్థ వెల్లడించింది. అమెరికా వంటి అగ్రరాజ్యాలు సుంకాలను ఆయుధాలుగా ప్రయోగించి దిగుమతులను నిరోధిస్తున్నందున ఎగుమతుల విస్తరణకు వివిధ దేశాలలో గల అవకాశాలను అన్వేషించి మన దేశం మార్కెట్‌లను విస్తరించుకోవడం అవసరం. అప్పుడే మన ఎగుమతుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందగలుగుతాం. దేశంలో ద్రవ్యోల్బణ రేటు మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను ప్రభావితం చేస్తోంది. దేశంలోని ధరవరలను బట్టే బియ్యం, గోధుమ, చక్కెర, ఉల్లిగడ్డల ఎగుమతులను అనుమ తిస్తున్నారు. 2023–24 లో వీటి ధరల పెరుగుదలను అడ్డుకోవడానికి ఎగుమతులను నిరోధించారు. అలాంటి సందర్భాలలో ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయలేక విశ్వసనీయత కోల్పోవాల్సి వస్తోంది. అందువల్ల నిలకడ అయిన ఎగుమతుల విధానం ఉంటే మేలని ఎగుమతిదారులు అంటున్నారు. ప్రపంచ విపణిలో ముడి చక్కెరకు మంచి గిరాకీ ఉంది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి భారత చక్కెర ఉత్పత్తి 350 లక్షల టన్నుల మేర ఉండగలదని, 285 టన్నులు దేశీయ వినియోగానికి పోగా 65 లక్షల టన్నులు ఎగుమతికి అందుబాటులో ఉంటుంది. సకాలంలో ఎగుమతులను అనుమతించక పోతే దేశంలో చక్కెర ధరలు తగ్గుతాయి. ఏ సమయంలో ఎంత ఎగుమతి చేయాలో నిర్ణయాన్ని తమకే ఇవ్వాలని చక్కెర పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. హఠాత్తుగా ఆంక్షలు ఎగుమతి సుంకాలు విధించడం వల్ల ధరలు తగ్గి అన్నదాతలు ఆదాయం కోల్పోయి దుస్థితికి గురవుతున్నారు. ఉల్లి ఎగుమతులపై రెండేళ్ల క్రితం నిషేధం విధించడం వల్ల ధరలు పడిపోయి మహారాష్ట్రలో రైతులు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. లోక్‌సభ ఎన్నిక్షలకు ముందు నిషేధాన్ని ఎత్తేసినా ప్రయోజనం లేకపోయింది. పంటను రైతులు కల్లాల్లోనే వదిలేసి సాగు ఖర్చు కూడా రాక అప్పుల పాలయ్యారు. నిలకడలేని ఎగుమతి దిగుమతి విధానం వల్ల రైతుల విశ్వాసాన్ని కోల్పోతున్నామని రైతు ఉత్పత్తిదార్ల సహకార సంఘాలు వాపోతున్నాయి. ట్రంప్ కక్ష కట్టినట్లుగా 50 శాతం దిగుమతి సుంకాలు విధించడం వల్ల భారత ఎగుమతిదార్లు తీవ్ర కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతులు వరి మాగాణాలను చేపలు, రొయ్యల చెరువులుగా మార్చి వాటి ఎగుమతులపై అధికంగా ఆధారపడుతున్నందున అమెరికా సుంకాల దెబ్బకు విలవిలలాడుతున్నారు. గత ఆగస్టు వరకు అమెరికాలో దిగుమతి సుంకాలు 10 శాతం మాత్రమే ఉండేవి. ఇప్పుడు కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు రొయ్యలు, చేపల రైతులను ఆదుకునేందుకు తక్షణ కార్యాచరణ చేపట్టాలి. రష్యా, యూరోపియన్ యూనియన్ దేశాలు, బ్రిటన్, నార్వే, దక్షిణ కొరియా, మధ్య ప్రాచ్య దేశాలకు రొయ్యలు, చేపలు, ఇతర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు గల అవకాశాలను అన్వేషించి కొత్త మార్కెట్లను అందుబాటులోకి తేవడానికి మోదీ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. భారత్–అమెరికా వార్షిక వాణిజ్యం 7 బిలియన్ డాలర్లు. అమెరికా నుంచి 1.5 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను మన దేశం దిగుమతి చేసుకొంటోంది. మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 5.5 బిలియన్ డాలర్లు. వాటిలో 46 శాతం సముద్ర ఉత్పత్తులు. ఆ తర్వాత బియ్యం, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలున్నాయి. భారత్ 2016–23 మధ్య పామాయిల్, పొద్దుతిరుగుడు, సోయాబీన్ నూనెలను దిగుమతి చేసుకున్నది. స్వావలంబన గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేక పోవడం విచారకరము. వచ్చే ఐదేళ్లలో 100 బిలియన్ డాలర్ల వ్యవ సాయోత్పత్తులను ఎగుమతి చేయాలన్నది భారత ప్రభుత్వ లక్ష్యం. స్వాతంత్ర్యం సాధించి 1947 శతాబ్ది పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలి అంటే దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తూనే, వివిధ దేశాలకు మన ఎగుమతులను విస్తరించాలి. వరి ఉత్పత్తిలో తెలంగాణా మేటిగా నిలిచింది. పండ్ల ఉత్పత్తిలో అనుకూలాలున్న రాయలసీమ అన్నదాతలను ప్రోత్సహిస్తే వారు ఇతోధికంగా పండ్లు ఎగుమతి చేసి ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలను ప్రోత్సహిస్తే అద్భుతాలను ఆవిష్కరించగలరు.

సీనియర్ జర్నలిస్టు, 9440990381

పాక్‌తో భారత్ మ్యాచ్ తప్పదు: అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ: ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా పాకిస్థాన్‌తో టీమ్‌ఇండియా క్రికెట్ మ్యాచ్‌కు భారత అభిమానుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పాక్ ఉగ్రవాదులు పహల్గాంపై దాడి అనంతరం పాకిస్థాన్‌తో ఏ విధమైన క్రికెట్ సంబంధాలూ కొనసాగించకూడదని అభిమానులు కోరుకున్నారు. అయితే టీమ్‌ఇండియా మాత్రం ఆసియా కప్ షెడ్యూలు ప్రకారం పాకిస్థాన్‌తో తలపడబోతోంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్లను బహిష్కరించలేమని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ వివరించారు. 'ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్వర్యంలో జరిగే మల్టీనేషనల్ టోర్నమెంట్లలో వారికి కేటాయించిన మ్యాచుల్లో కచ్చితంగా పాల్గొనాలి. ఒకవేళ ఆడకుంటే... ఆయా దేశాల జట్లను ఆ టోర్నమెంట్ నుంచి తొలగిస్తారు. ప్రత్యర్థి జట్టుకు పాయింట్లు జోడిస్తారు. అయితే టీమ్‌ఇండియా... ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక టోర్నమెంట్లు ఆడదు. భారత్‌పై పాక్ ఉగ్రవాద దాడులు ఆపేసే వరకు టీమ్‌ఇండియా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని మేం చాలాకాలం క్రితమే నిర్ణయం తీసుకున్నాం' అని అనురాగ్ ఠాకూర్ మీడియాతో అన్నారు.

సుశీలా కార్కికి మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: నేపాల్ తాత్కాలిక ప్రధాన మంత్రిగా జస్టిస్ సుశీలా కార్కి చేత శుక్రవారం ఆ దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ప్రమాణం చేయించారు. నేపాల్ పీఎం పదవిని చేపట్టిన తొలి మహిళగా సుశీల నిలిచారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు వెల్లు వెత్తుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ సుశీలకు శుభాకాంక్షలు తెలిపారు. నేపాల్ ప్రజల శాంతి, పురోగతికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

రాహుల్... యూపీ మంత్రి మాటల యుద్ధం

లక్నో: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, యూపీ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ మధ్య వాగ్వాదం జరిగింది. రాయ్‌బరేలీ నియోజకవర్గం అభివృద్ధిపై జరిగిన దిశా సమావేశంలో ఆ ఇద్దరి నేతల మధ్య మాటల యుద్ధం ఈ నెల 11వ తేదీన జరిగింది. నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చ జరుగుతున్న సయమంలో... ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఆ ఇద్దరూ గట్టిగా తమ వాదనలను వినిపించే ప్రయత్నం చేశారు. ఒకవేళ రాయ్‌బరేలీ నియోజకవర్గం ప్రజల తరపున రాహుల్ గాంధీ పోరాడితే అప్పుడు ఆయనకు మద్దతు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. కానీ దిశా మీటింగ్ వేదికగా పార్టీ రాజకీయాలు ప్రచారం చేసినా, ప్రభుత్వాన్ని విమర్శించినా ఊరుకునేది లేదన్నారు. దిశా మీటింగ్‌కు నియోజకవర్గ ఎంపీ చైర్ చేస్తారని, గ్రామీ అభివృద్ధి శాఖకు చెందిన 43 ప్రోగ్రామ్‌ల నిర్వహణ ఆ ఎంపీ బాధ్యతలోనే ఉంటుందని మంత్రి దినేశ్ అన్నారు. కానీ రాహుల్ గాంధీ అన్ని కార్యక్రమాలకు ఓనర్ తరహాలో ఫీలవుతున్నారని, దీన్ని సహించేది లేదని మంత్రి తెలిపారు. కలెక్టరేట్‌లోని బచత్ భవన్‌లో కేంద్ర పథకాలపై సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి అమేథీ ఎంపీ, దిశా చైర్‌పర్సన్ కిశోరీ లాల్ శర్మ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

డిజిటల్ అరెస్ట్‌తో రూ.3.72 కోట్లకు టోకరా



తిరువనంతపురం: కేరళలోని కొల్లాంలో ఓ వృద్ధుడి(97)ని సైబర్ నేరగాళ్లు మోసగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దక్షిణ కేరళ జిల్లాలోని ఓ వృద్ధుడికి జులై ఏడో తేదీన వాట్సప్‌లో వీడియో కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తనను తాను బీఎస్ఎన్ఎల్ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అక్రమ కార్యకలాపాలకు మొబైల్ నంబర్ వినియోగించినందుకు ముంబై సైబర్ పోలీసులు ఈ నంబర్‌ను ట్రాక్ చేస్తున్నారని తెలిపాడు. కొద్దిసేపటికి దుండగులు పోలీసు దుస్తుల్లో వాట్సాప్ వీడియో కాల్ చేసి తాము ముంబై సైబర్ పోలీసులమని పేర్కొంటూ నకిలీ అరెస్టు వారెంట్ జారీ చేశారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడినందుకు డిజిటల్ అరెస్టు చేశామని వృద్ధుడిని బెదిరించారు. వీడియో కాల్ ద్వారా వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించారు. బాధితుడు వారు చెప్పినట్లు చేయగా వాట్సాప్ కాల్‌ను కట్ చేయకుండా దర్యాప్తు అధికారి నిఘాలో ఉండాలనే షరతుతో వర్చువల్ కోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. ఎక్కడికీ వెళ్లొద్దని చెప్పి పరిశీలన కోసం ఖాతాల్లో ఉన్న డబ్బును వేర్వేరు ఖాతాల్లోకి బదిలీ చేయాలని సూచించారు. లేదంటే ఈ కేసులో శిక్ష పడుతుందని బెదిరించడంతో ఆందోళన చెందిన వృద్ధుడు... జులై 23 నుంచి ఆగస్టు 29 మధ్య వారు చెప్పినట్లుగా వివిధ ఖాతాలకు 17 లావాదేవీలలో రూ.3.72 కోట్లను బదిలీ చేశాడు. వారు ఎంతకీ డబ్బు తిరిగి పంపకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొల్లాం పోలీసులు తెలిపారు. డబ్బు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను గుర్తించామని, వాటిని బ్లాక్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సీఎంకు తప్పిన ప్రమాదం

భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఆయన ఎక్కబోయిన ఓ హాట్ ఎయిర్ బెలూన్ కు మంటలు అంటుకున్నాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సీఎం మోహన్ యాదవ్ శుక్రవారం గాంధీ సాగర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కేందుకు వెళ్లారు. ఏడు గంటల సమయంలో భద్రతా సిబ్బందితో కలిసి హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కారు. బలమైన గాలుల కారణంగా బెలూన్ ఎగరలేకపోయింది. ఇదిలా ఉండగా... సీఎం ఎక్కబోయిన బెలూన్ కింది భాగంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. భద్రతా సిబ్బంది అప్రమత్తమై వెంటనే మంటలను అదుపు చేశారు.

సొంతింటి కల కోసం 'నిధి'

కేంద్రానికి సుప్రీం సూచన

న్యూఢిల్లీ: పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలామంది సొంతింటి కల సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఒక కార్యాచరణను రూపొందించి... దానిని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది. రెరాను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఒక సంస్థను ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

బాధితులకు తీరని అన్యాయం

- ప్రజలను తీవ్రంగా అవమానించడమే
- మోదీ మణిపూర్ పర్యటనపై ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మణిపూర్ పర్యటనపై ప్రతిపక్షాలు పెదవి విరిచాయి. రెండేళ్ల తర్వాత మోదీ మొక్కుబడి పర్యటన జరిపారని, అల్లర్ల బాధితులకు ఆయన ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించాయి. మోదీ మణిపూర్ పర్యటనను 'పిట్ స్టాప్'గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. ఈ పర్యటన ప్రజలను 'మభ్య' పెట్టడమేనని, రాష్ట్ర ప్రజలకు 'తీవ్ర అవమానం' అని అన్నారు. మోదీ తనకు తానుగా గొప్ప స్వాగత వేడుకను నిర్వహించుకున్నారని ఖర్గే 'ఎక్స్' పోస్ట్‌లో విమర్శించారు. ఇది ఇప్పటికీ బాధపడుతున్న వారి గాయాలకు 'క్రూరమైన ముల్లు గుచ్చడం' అని పేర్కొన్నారు. 'మీ మాటల్లోనే... మీ రాజధర్మం ఎక్కడ?' అని మోదీ మణిపూర్ పర్యటన ప్రారంభానికి ముందు ఖర్గే సామాజిక మాధ్యమం వేదికగా ప్రశ్నించారు. 'నరేంద్ర మోదీ జీ, మణిపూర్‌లో మీ 3 గంటల పిట్ స్టాప్... కరుణ కాదు... ఇది ప్రహసనం, మభ్యపెట్టడం, గాయపడిన ప్రజలకు తీవ్ర అవమానం. ఈరోజు ఇంఫాల్, చురాచంద్‌పూర్‌లో మీరు నిర్వహిస్తున్న రోడ్‌షో, సహాయ శిబిరాల్లోని ప్రజల కేకలు వినకుండా పిరికితనంతో తప్పించుకోవడం తప్ప మరొకటి కాదు!' అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. '864 రోజుల హింస... 300 మంది ప్రాణాలు కోల్పోయారు. 67,000 మంది నిరాశ్రయులయ్యారు. 1,500 మందికి పైగా గాయపడ్డారు. అప్పటి నుంచి మీరు 46 విదేశీ పర్యటనలు చేశారు. కానీ మీ స్వంత పౌరులతో రెండు మాటలు సానుభూతి వ్యక్తం చేయడానికి ఒక్క సందర్శన కూడా చేయలేదు' అని ఖర్గే మండిపడ్డారు. 'మణిపూర్‌లో మీ చివరి పర్యటన? జనవరి 2022న ఎన్నికల కోసం! మీ 'డబుల్ ఇంజిన్' మణిపూర్ అమాయక జీవితాలను బుల్డోజర్ చేసింది. మీరు, హోం అమిత్ షాల తీవ్ర అసమర్థత, అన్ని వర్గాలను మోసం చేయడంలో భాగస్వాములు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా పరిశీలన నుంచి రక్షించబడ్డారు. హింస ఇప్పటికీ కొనసాగుతోంది' అని ఆయన అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత బీజేపీదేనని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మళ్లీ నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. 'జాతీయ భద్రత, సరిహద్దు గస్తీ బాధ్యత మీ ప్రభుత్వానిదే అని మర్చిపోకూడదు. ఈ నిశ్శబ్దంగా ఉండటం పశ్చాత్తాపం కాదు. ఇది అపరాధ భావన కూడా కాదు. మీరు మీ కోసం ఒక గొప్ప స్వాగత వేడుకను నిర్వహిస్తున్నారు. మీరు ప్రాథమిక రాజ్యాంగ బాధ్యతలను విస్మరించడం వల్ల ఇప్పటికీ బాధపడుతున్న వారి గాయాలకు ఇది క్రూరమైన ముల్లు గుచ్చడం!' అని తెలిపారు.

ప్రధానుల సంప్రదాయం ఇదేనా: ప్రియాంక

వయనాడ్: జాతుల ఘర్షణ జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ మణిపూర్‌లో పర్యటించడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వయనాడ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ మణిపూర్‌లో ఘర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని అక్కడ పర్యటనకు వెళ్లడం దురదృష్టకరమన్నారు. భారత్‌లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదని విమర్శించారు. ప్రమాదాలు, విషాదాలు జరిగినప్పుడు ప్రధానులు వెంటనే అక్కడికి వెళతారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అందరు ప్రధానులు ఇదే పాటించారని తెలిపారు. కానీ, మోదీ మాత్రం రెండేళ్ల తర్వాత దీన్ని పాటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

రెజ్యూమేలో లైంగిక వేధింపుల కేసు

వీసీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఓ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌పై లైంగిక వేధింపుల కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఆసక్తికర తీర్పు వెలువరించింది. సాంకేతిక కారణాలతో కేసు కొట్టివేసినప్పటికీ ఈ కేసును రెజ్యూమేలో రాసుకోవాలని వీసీని ఆదేశించింది. తప్పు చేసిన భావన జీవితాంతం గుర్తుండేలా ఇటువంటి చర్యలు దోహదం చేస్తాయని పేర్కొంది. పశ్చిమబెంగాల్‌లోని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న ఎన్‌కే చక్రవర్తి తనను లైంగికంగా వేధించాడంటూ అక్కడే పనిచేస్తున్న అధ్యాపకురాలు ఆరోపించారు. వీసీగా 2019లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తనను పలుమార్లు వేధించాడని పేర్కొన్నారు. చివరిగా ఏప్రిల్ 2023లో వేధించినట్లు చెబుతున్నప్పటికీ... డిసెంబర్ 2023లో ఫిర్యాదు చేశారు. నిర్దిత గడువుతోపాటు (మూడు నెలల) అదనపు (ఆరు నెలలు) వ్యవధి తర్వాత ఆ ఫిర్యాదు వచ్చిందన్న కారణంతో స్థానిక ఫిర్యాదు కమిటీ (ఎల్‌సీసీ) దాన్ని తిరస్కరించింది. అదే సమయంలో నిధుల దుర్వినియోగానికి సంబంధించి బాధితురాలిపై ఫిర్యాదులు రావడంతో... వాటిపై విచారణ జరిగింది. ఆ తర్వాత ఓ విభాగానికి డైరెక్టర్‌గా ఉన్న ఆమెను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఈ నేపథ్యంలోనే తనను లైంగిక వేధింపులకు పాల్పడడంతోపాటు ఇతర కేసుల్లో బాధితురాలిగా చేశారని ఆరోపిస్తూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌తోపాటు ఛాన్సలర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఈ వ్యవహారం సుప్రీంకు చేరింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ ప్రసన్నా బాలచంద్ర వర్లేతో కూడిన ధర్మాసనం వేధింపుల గురించి స్థానిక ఫిర్యాదు కమిటీకి ఆలస్యంగా ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేసింది. వేధింపులకు, బాధ్యతల నుంచి తప్పించేందుకు ఎటువంటి సంబంధం లేదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. తప్పు చేసిన వారిని క్షమించవచ్చేమో కానీ... తప్పును మరచిపోకూడదని అభిప్రాయపడింది. సాంకేతిక కారణాలతో బాధితురాలు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టలేకున్నా... అభియోగాలను మాత్రం మరచిపోవద్దని పేర్కొంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తప్పు చేసిన భావన ఎప్పటికీ గుర్తుండేలా ఈ తీర్పును తన రెజ్యూమేలో రాసుకోవాలని ఆదేశించింది.

బాలికపై హత్యాచారం... దోషికి మరణశిక్ష

బెంగళూరు: బాలికపై హత్యాచారం కేసులో కర్నాటకలోని మంగుళూరు కోర్టు 51 ఏళ్ల నిందితుడికి మరణశిక్ష విధించింది. బాలిక (13)ను అత్యాచారం, మర్డర్ చేసిన కేసులో ఈ విచారణ జరిగింది. అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కేఎస్ మన్నూ ఈ కేసులో ఆదేశాలు జారీ చేశారు. నిందితుడు ఫకీరప్ప హనుమప్ప మదరపై వివిధ కేసులు ఉన్నాయి. బెల్గావి జిల్లాలోని సావదత్తి తాలూకాలోని హంచినాల్ అతడి స్వస్థలం. 2024, ఆగస్టు ఆరో తేదీన బాలికపై అత్యాచారం జరిగింది. అనంతరం ఆమెను నిందితుడు హత్య చేశాడు. పన్నంబుర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై నిందితుడు అఘాయిత్యం చేశాడు. కిరాయి ఇంట్లో ఉంటున్న అతను... ఎవరూ లేని క్షణంలో ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారం, హత్యకు పాల్పడ్డాడు. భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 103(1) కింద నిందితుడికి మరణశిక్ష ఖరారు చేశారు. దీంతో పాటు జీవితకాల శిక్షను కూడా వేశారు. పోక్సో చట్టం కింద రూ.50వేల జరిమానా విధించారు. బీఎన్ఎస్‌లోని 332(ఏ) సెక్షన్ కింద జీవితకాల శిక్షను వేశారు.

అంబేద్కర్‌పై తప్పుడు ప్రకటనలు ఆపండి

మాయావతి

లక్నో: కొంతమంది రుషులు, సాధువులు వార్తల్లోకెక్కడానికి బీఆర్ అంబేద్కర్‌పై తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని, వారి 'కుల' మనస్తత్వాన్ని త్యజించాలని బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి శనివారం కోరారు. 'భారత రాజ్యాంగ నిర్మాణంలో అత్యంత గౌరవనీయుడైన బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ అందించిన సాటిలేని సహకారం గురించి సరైన సమాచారం పతాక శీర్షికల్లో నిలిచి ఉండటానికి వివాదాస్పద ప్రకటనలు చేసే కొంతమంది ఋషులు, సాధువులకు తెలియదని' అని ఆమె 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఈ విషయంలో వారు ఏదైనా తప్పుడు ప్రకటన చేయడానికి బదులుగా మౌనంగా ఉంటే మంచిది' అని మాజీ ముఖ్యమంత్రి తెలిపారు. మాయావతి తన పోస్ట్‌లో ఏ సాధువు పేరును పేర్కొనకపోయినా, మనుస్మృతిపై అంబేద్కర్ అభిప్రాయాలపై బుందేల్‌ఖండ్‌కు చెందిన ఒక సాధువు చేసిన వ్యాఖ్యలపై వివాదం నేపథ్యంలో ఆమె వ్యాఖ్యలు వచ్చాయి. అంబేద్కర్‌కు సంస్కృత పరిజ్ఞానం లేకపోవడం వల్లే మను స్మృతిపై ఆయన అభిప్రాయాలు రూపుదిద్దుకున్నాయని ఆ సాధువు ఒక ప్రముఖ వార్తా ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటువంటి వ్యాఖ్యలు చేసేవారు ముందుగా అంబేద్కర్ అనుచరులు మనుస్మృతిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని మాయావతి సూచించారు. 'బాబా సాహెబ్ అనుచరులు మనుస్మృతిని ఎందుకు వ్యతిరేకిస్తారు? వారు తమ కుల ద్వేషాన్ని విడిచిపెట్టిన తర్వాత దీనిని కచ్చితంగా అర్థం చేసుకోవాలి. బాబాసాహెబ్ గొప్ప పండితుడని కూడా వారు తెలుసుకోవాలి' అని ఆమె అన్నారు.

114 రఫేల్ యుద్ధ విమానాలకు ఐఏఎఫ్ ప్రతిపాదన

న్యూఢిల్లీ: భారతీయ వైమానిక దళం కొత్తగా 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం ప్రతిపాదన చేసింది. రక్షణశాఖకు ఆ ప్రతిపాదన పంపించింది. తమ దళాన్ని విస్తరించాలన్న ఉద్దేశంతో ఐఏఎఫ్ ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. మల్టీరోల్ ఆపరేషన్స్‌లో పాల్గొనే యుద్ధ విమానాలు అవసరమని ఐఏఎఫ్ పేర్కొంది. అయితే ఆ యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టాలని రక్షణశాఖను కోరింది. భారత్‌లో యుద్ధ విమానాలను మేకిన్ ఇండియా పథకం కింద నిర్మించనున్నారు. దీనికి డసాల్ట్ ఏవియేషన్ సంస్థ సహకరించనుంది.

యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియకు డిఫెన్స్ ప్రొక్యూర్మెంట్ బోర్డు, డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్, క్యాబినెట్ కమిటీ నుంచి క్లియరెన్స్ దక్కాల్సి ఉంటుంది. వైమానిక దళం వద్ద ప్రస్తుతం 36 రఫేల్స్ ఉన్నాయి. మరో 26 మెరైన్ వేరియంట్ల కోసం నేవీ ప్రతిపాదనలు చేసింది. తక్షణమే మరో రెండు స్క్వాడ్రన్ల విమానాలను దళంలోకి తీసుకునే సామర్థ్యం ఐఏఎఫ్‌కు ఉంది. అంటే సుమారు మరో 38 యుద్ధ విమానాలను దళంలోకి తీసుకునేందుకు ఐఏఎఫ్ సిద్ధంగా ఉంది.

తాజ్ హోటల్‌కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశంలో బాంబు బెదిరింపులు ప్రహసనంగా మారింది. ఈ-మెయిల్స్‌కు బెదిరింపు సందేశాలు పంపడంతో అధికారులకు సవాల్ విసిరినట్టు అవుతోంది. తాజాగా శనివారం ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ హోటల్‌కు కూడా బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని తనిఖీలు చేయగా ఎలాంటి బాంబు దొరకలేదు. దాంతో అది కూడా ఆకతాయి మెయిలేనని పోలీసులు నిర్ధారించారు. కాగా, శుక్రవారం ఢిల్లీ, బాంబే హైకోర్టులకు అదే తరహా మెయిల్స్ వచ్చాయి. అవి ఆకతాయిలు చేసిన బెదిరింపు మెయిల్ అని పోలీసుల విచారణలో తేలింది.

మేఘాలయ మాజీ సీఎం లపాంగ్ మృతి

గువహటి: 'మహే' అని ప్రేమగా పిలువబడే ప్రముఖ రాజకీయ నాయకుడు, నాలుగుసార్లు మేఘాలయ ముఖ్యమంత్రి దోన్వా డెత్వెల్సన్ లపాంగ్ ఇక్కడి ఆసుపత్రిలో మరణించారని ఆయన కుటుంబం తెలిపింది. లపాంగ్‌కు 93 ఏళ్లు, ఆయనకు భార్య అమెథిస్ట్ లిండా జోన్స్ బ్లా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేఘాలయ ప్రభుత్వం సోమవారం మాజీ ముఖ్యమంత్రికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనుందని అధికారులు తెలిపారు. లపాంగ్ చాలా కాలంగా వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, శుక్రవారం సాయంత్రం ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారని ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు. లపాంగ్ తుదిశ్వాస విడిచినప్పుడు మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు విన్సెంట్ హెచ్ పాలా ఆసుపత్రిలోనే ఉన్నారు. రాజకీయ నాయకులు, సామాన్యులతో సహా అన్ని వర్గాల ప్రజలు ఆసుపత్రిని, తరువాత ఆయన నాంగ్పో నివాసాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఏప్రిల్ 10, 1932న జన్మించిన లపాంగ్, 1972 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నాంగ్పో స్థానాన్ని గెలుచుకోవడం ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆయన 1992-2010 మధ్య నాలుగు సార్లు ఈశాన్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారు. జీవితకాల కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్న ఆయన తరువాత 2018లో నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) లో చేరి రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా పని చేశారు. 1992లో ఉనికిలోకి వచ్చిన రి-భోయ్ జిల్లాను ఏర్పాటు చేసిన వారిలో ఆయన ఒకరిగా గుర్తుండిపోతారు. సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన లపాంగ్ ఒకప్పుడు తన తల్లికి టీ స్టాల్ నడపడంలో సహాయం చేశారు. తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు కార్మికుడిగా, ఉపాధ్యాయుడిగా, ప్రభుత్వ ఉద్యోగిగా పని చేశారు.

జీఎస్టీ సవరణతో ప్రజలపై తగ్గిన భారం

మిజోరంలో రైల్వేలైన్ ప్రారంభించిన మోదీ

ఐజ్వాల్: ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా ఎగుమతుల్లో వృద్ధి సాధించగలిగామన్నారు. మిజోరం పర్యటనలో భాగంగా ఐజ్వాల్‌లో జరిగిన బహిరంగ సభలో మోదీ శనివారం మాట్లాడారు. పలు అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బైరాబి-సైరాంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని ఆరోపించారు. '2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5 శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ ఖరీదైనదిగా మారింది' అని అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని మోదీ పేర్కొన్నారు.

కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలు తగ్గించాయని, సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు.

రూ.9 కోట్లు ఇప్పించండి

ముంబై పేలుళ్ల కేసు నిర్దోషి

న్యూఢిల్లీ: తనను తొమ్మిదేళ్లు అన్యాయంగా జైల్లో పెట్టారు... రూ.తొమ్మిది కోట్లు ఇప్పించాలంటూ ముంబై పేలుళ్ల కేసు నిర్దోషి అబ్దుల్ వహీద్ షేక్ జాతీయ మానవ హక్కుల కమిషన్, మహారాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాడు. 2006 ముంబై పేలుళ్ల కేసులో అబ్దుల్ వహీద్ షేక్‌ను... 2015లో స్పెషల్ కోర్టు నిర్దోషిగా తేల్చి విడుదల చేసింది. అయితే, ఈ కేసులో తనను అన్యాయంగా అరెస్టు చేసి తొమ్మిదేళ్లు జైల్లో ఉంచి చిత్రహింసలు పెట్టారని , పేలుళ్ల కేసులో అరెస్టు చేయడంతో తన జీవితం నాశనమైందని, తనకు జరిగిన అన్యాయానికి రూ. తొమ్మిది కోట్లు పరిహారం ఇప్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్, మహారాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాడు. 2006 జులై 11న ముంబై పశ్చిమ రైల్వే లైన్‌లోని పలు సబర్బన్ రైళ్లలో వరుసగా బాంబు పేలుళ్లు జరిగాయి.189 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 800 మందికిపైగా గాయపడ్డారు. ఈ కేసులో అబ్దుల్ వహీద్ షేక్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్టు చేసింది. సుదీర్ఘంగా జరిగిన విచారణ తర్వాత 2015లో స్పెషల్ కోర్టు అబ్దుల్ వహీద్‌ను నిర్దోషిగా తేల్చి విడుదల చేసింది. మిగతా 12 మంది నిందితులను దోషులుగా తేల్చింది. వీరిలో ఐదుగురికి మరణశిక్ష విధించగా.. మరో ఏడుగురికి జీవతఖైదు విధిస్తూ అప్పట్లో తీర్పు వెలువరించింది. కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన బాంబే హైకోర్టు.. ఈ ఏడాది జులైలో మిగిలిన నిందితులను కూడా నిర్దోషులుగా ప్రకటించింది. దోషులకు వ్యతిరేకంగా సరైన సాక్ష్యాలు సమర్పించటంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని, దోషులకు బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇస్తున్నట్టు బెంచ్ పేర్కొన్నది. ఈ తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జులై 1, 2025 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నిక అధికారి ఆర్వి కర్ణన్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంకు సంబంధించి ప్రస్తుతం ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం 2025 కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. ఈ నెల 17 లోగా ఓటరు నమోదుకు అవకాశం ఉందన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు కావచ్చునని తెలిపారు. అలాగే ఫారం-7 ద్వారా ప్రస్తుత ఓటరు జాబితాలో పేరు చేర్చడం, తొలగించడంపై అభ్యంతరాలు తెలుపవచ్చునని తెలిపారు. ఫారం-8 ద్వారా ప్రస్తుత ఓటరు జాబితాలోనీ ఎంట్రీల సవరణలు, నివాసం మార్పు, దివ్యాంగులుగా ఎపిక్ రీప్లేస్మెంట్ చేసుకోవచ్చునని తెలిపారు. జూబ్లిహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పౌరులు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (విహెచ్ఏ) ద్వారా లేదా అధికారిక వెబ్సైట్లు ceotelangana.nic.in, ecinet.eci.gov.in, eci.gov.in నమోదు చేసుకోవచ్చునని సూచించారు. మరింత సమాచారం కోసం సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ), ఏఈఆర్ఓ, ఈఆర్ఓ, డిఈఓ ను సంప్రదించవచ్చునని తెలిపారు. 1950 టోల్-ఫ్రీ నంబర్‌కు కూడా కాల్ చేయవచ్చునని చెప్పారు. ఓటరుగా నమోదు కావడం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా జీహెచ్ఎంసీ కమిషనర్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ అన్నారు.

మల్కాజిగిరిలో హైదరాబాద్ హిసార్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దూర ప్రాంతాల నుండి వచ్చే రైళ్లను మల్కాజిగిరి స్టేషన్లలో నిమిషం పాటు నిలిపితే ప్రయాణికులు ఇక్కడ దిగి తమ గమ్య స్తానం చేరుకొంటారని జెడ్ఆర్.యుసిసి మెంబెర్ నూర్ ఇటీవల రైల్వే సమావేశంలో కోరారు. దీనిపై స్పందించి మల్కాజిగిరి స్టేషన్‌లో 8 ఎక్స్‌ప్రెస్‌లు నిలిపేలా చర్యలు చేపట్టారు. శనివారం హైదరాబాద్ - హిసార్ ఎక్స్‌ప్రెస్‌కు మల్కాజిగిరి హాల్ట్ ఇవ్వగా మల్కాజిగిరి వాసులు ఘన స్వాగతం పలికారు. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, పిసిఓయం కే.పద్మజ, హైదరాబాద్ డి.ఆర్.ఎం డాక్టర్ సంతోష్ కుమార్ వర్మ, సికింద్రాబాద్ డిఆర్ఎం ఆర్.గోపాలకృష్ణన్‌లకు ట్రావెల్లర్స్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, రైల్వే సిబ్బంది ప్రయాణికుల సంఘం ప్రతినిధులు, ఏవి స్వామి, పి భరద్వాజ్, హసీనా, వై.శంకర్‌రావు, వెంకటచారి, ఎన్.సత్యమూర్తి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

బల్హార్షా-సికింద్రాబాద్ సెక్షన్‌ను తనిఖీ చేసిన రైల్వే జీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం బల్హార్షా-సికింద్రాబాద్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ ప్రధాన కార్యాలయం, డివిజన్ నుండి ఇతర సీనియర్ అధికారులు తనిఖీలో పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బల్హార్షా-సికింద్రాబాద్ సెక్షన్ మధ్య రియర్ విండో తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో ఆయన ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను సమీక్షించారు. ఆ విభాగంలోని కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లను తనిఖీ చేశారు. జనరల్ మేనేజర్ సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంలో సిర్పూర్ కాగజ్‌నగర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు స్టేషన్‌లో జనరల్ మేనేజర్‌ను కలిసి ఈ ప్రాంతంలో రైలు అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. తదుపరి జనరల్ మేనేజర్ మంచిర్యాల్ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్ సైట్‌ను, శ్రీవాస్తవ పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. జనరల్ మేనేజర్ నిర్దిత గడువులోగా పనులు పూర్తి చేయడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

జూనియర్ కళాశాల లిఫ్ట్‌కు రూ.20 లక్షల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: పేద విద్యార్థులు అత్యాధునిక పద్ధతులతో చదువుకునేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణంలో భాగస్వాములు అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో జెపి దర్గాకు చెందిన ఎస్ కేపి రెడ్ మిక్స్ ప్లాంట్ అధినేత ఖాజాపాషా రూ.20 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అందజేశారు. దాతల సహకారంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిర్మాణ సారధ్యంలో చేపడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి 20 లక్షల విలువైన ఒక లిఫ్టు కోసం ఖాజపాష దాతగా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా పురస్కరించుకొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయనను అభినందిం చారు. పెద్ద ఎత్తున ఒక లిఫ్టు కోసం 20 లక్షల రూపాయల చెక్కును అందజేయ డం ఎంతో సంతోషంగా ఉందని నిరుపేద విద్యార్థి విద్యార్థులు అత్యాధునిక పద్ధతులతో చదువుకునేందుకు నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తుండడం శుభసూచకమని అన్నారు. చెంది తిరుపతిరెడ్డి, రవికుమార్, శ్రీనివాస్, యాదయ్య అశోక్, కబీర్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ జోనల్ కమిషనర్ రవికిరణ్ కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ నిధుల మంజూరుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మేకల రామ్ యాదవ్, విజయ్ తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజాభివృద్ధి

మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పురుషులతో పాటు, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఎల్బీసీ కాలనీ సమీపంలో ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి పెట్రోల్ పంపు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుకొస్తున్నారని, తాను 2004 సంవత్సరంలో శాసనసభ్యులుగా ఉన్న సమయంలో ఒక్కో గ్రామంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు 15 కోట్ల వరకు రుణాలు ఇప్పించడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అన్ని పథకాల లబ్ధిని మహిళలకి ఇస్తున్నదని, ముఖ్యంగా ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం వంటివి ఉదాహరణగా చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు కలిసికట్టుగా పని చేసుకోవాలని కోరారు. ఎస్ఎల్బీసీ వద్ద ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ భవిష్యత్తులో బాగా నడుస్తుందని, మెడికల్ కళాశాల పక్కనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల, ఇటు హైదరాబాద్ రహదారికి, నాగార్జునసాగర్ రహదారికి చేరువలో ఉండటం, పెట్రోల్ పంపుతో పాటు, ఏవి చార్జింగ్ మిషన్, కేఫ్ టేరియా, సూపర్ మార్కెట్ వంటివి ఇక్కడ బాగా నడుస్తాయని అన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేట్ ఆస్పత్రికి మంచి వైద్య సేవలు అందిస్తున్నదని, ఇటీవలే ఏ ఐ జి ఆసుపత్రి ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు, జిజిహెచ్‌ను దత్తత తీసుకున్నదని, కనగల్‌లో పిహెచ్‌డిలో గ్లాకోమా సెంటర్ ఏర్పాటు చేశామని, మహిళల ద్వారా కట్టంగూరు మండలం అయిటిపాములలో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మహిళలు బాగా పనిచేస్తే ఆర్థికంగా పురుషులతో పాటు, సమానంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయ సంఘాలకు 20వేల కోట్ల రూపాయల రుణాలు ఇస్తున్నామని, చిన్న సంఘాల ద్వారానే మహిళల్లో ధైర్యం వస్తుందని, ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే మహిళ ముందడుగు వేస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని స్వయం సహాయక మహిళా సంఘాలలోని సభ్యులకు ప్రతి ఇంటికి రుణం వెళ్లే విధంగా చూడాలని అన్నారు. పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలను మహిళలకు అప్పగించగా, రాష్ట్రవ్యాప్తంగా 30 కోట్ల ఆదాయం వస్తే నల్గొండ జిల్లాలో కోటీ 40 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలులో సైతం 80 కోట్ల రూపాయల ఆదాయాన్ని స్వయం సహాయక మహిళా సంఘాలు రాష్ట్రంలో ఆదాయం అర్జించారని, ప్రభుత్వము మహిళల కోసం ప్రవేశపెడుతున్న పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీంతో పాటు ఆరోగ్యం, పిల్లల చదువు, పౌష్టికాహారం అందించాలని, గ్రామాలలో గృహహింసకు వ్యతిరేకంగా మహిళలకు తోడుగా నిలవాలని, ఆరోగ్యం, సామాజిక భద్రత చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐఓసిఎల్ జనరల్ మేనేజర్ సుదీప్ రాయ్, డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపుకలెక్టర్. జె. శ్రీనివాస్, ఇన్చార్జి డిఆర్ఓ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

విశాలాంధ్ర - హైదరాబాద్ : చరిత్ర అనేది ఒక్కరు చేరిపితే చేరిగిపోయేది కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నర్సింహ అన్నారు. తెలంగాణ రైతాంగసాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులే అని ఆయన స్పష్టం చేశారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా తెలంగాణ రైతాంగసాయుధ పోరాట వారోత్సవాలు మహబూబ్నగర్ పట్టణంలోని సురవరం వెంకట్రాంరెడ్డి భవన్లో సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాలకిషన్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నరసింహ హాజరై మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15 నా వచ్చిన హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజం పరిపాలనలో ఉండేదని గుర్తు చేశారు. భారతదేశం మొత్తంలో అత్యంత పెద్దది నిజాం నవాబు పరిపాలిస్తున్న హైదరాబాద్ సంస్థానం తెలుగు జిల్లాలు 8 మహారాష్ట్ర జిల్లాలు 5 కర్ణాటక జిల్లాలు 3 దీని విస్తీర్ణం దాదాపు 90 వేల చదరపు కిలోమీటర్లు ఉండదన్నారు. ఇక్కడ 5 శాతం తెలుగు 25శాతం మరాఠీ 12శాతం కన్నడ ఇతర భాషలు మాట్లాడేవారు కానీ అధికారిక భాష ఉర్దూగానే ఉండేదని చెప్పారు. ఇక్కడి ప్రజలను దొరలు దేశముఖ్ లు జమీందారులు జాగిర్దారుల అనేక రకాల చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ సాయుధ పోరాటన్నికి రావి నారాయణరెడ్డి, మఖ్దూమ్ మోయునోదిన్, బద్దం ఎల్లారెడ్డి పిలుపు ఇచ్చారన్నారు. 1948 సెప్టెంబర్ 17న నిజంగా నవాబు తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసారని వివరించారు. నిజాం నవాబుకు రాజు ప్రముఖ హోదా ఇచ్చి (నేటి గవర్నర్ తో సమానం) సర్దార్ పటేల్ యు ఆయనను నియమించి వేల ఎకరాల భూమిని సంవత్సరానికి కోటి రూపాయల నజరానాకు రజాకారుల నాయకుడైన కాసిం రజ్వి పాకిస్తాన్ పోవడానికి ఎట్లా ఒప్పుకున్నారో ఈ బీజేపీ వాళ్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ వచ్చి నేటికీ 13 సంవత్సరాలు అవుతున్న సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా జరపడానికి గత ప్రభుత్వం బిఆర్ఎస్ కానీ, ప్రస్తుత ప్రభుత్వం కాంగ్రెస్ కానీ ఎందుకు ప్రకటించలేకపోతు న్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ మహబూబ్‌నగర్ మాజీ జిల్లా కార్యదర్శి పరమేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులు రాము, పద్మావతి, కృష్ణ, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మహేష్, చాంద్ బాషా, ఏఐటీయూసీ నాయకులు అంజనేయులు, సుందర్ రాజ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఇందిరమ్మ, మాధవి, అంజనమ్మ, మంజుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల ధర్నాకు ఎమ్మెల్సీ దాసోజు సంఘీభావం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అనేక మంది జీవనోపాధులైన కేబుల్ ఆపరేటర్లపై జరుగుతున్న అన్యాయంపై శనివారం ఇంద్రా పార్క్‌లో ఇటీవల కేబుల్ ఆపరేటర్ల ఆందోళన నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కేబుల్ ఆపరేటర్లను పని పశువుల్లా చూసి వారి జీవనోపాధిని ధ్వంసం చేస్తున్నారన్నారు. ఎలక్ట్రిక్ స్తంభాలపై కరెంట్ భద్రత, కనెక్షన్ సురక్షితంగా ఉందో లేదో తక్షణం సంబంధిత అధికారులు తనిఖీ చేయించి, ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగే పరిస్థితులను వెంటనే నివారించాలని సూచించారు. కేబుల్‌లు తీసివేయాలనుకుంటే పారదర్శకంగా, రాయితీగా ముందస్తు నోటీసులు ఇచ్చి, బాధితుల హక్కులను పరిరక్షించాలన్నారు. అకస్మాత్తుగా కేబుల్స్ రద్దు చేసే విధానాన్ని ఆయా గుర్తింపు తప్పుగా, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని మండిపడ్డారు. ఆపరేటర్ల జీవనాధారాన్ని క్షీణింపజేసే యత్నాలు ఆపాలని కోరారు. బీఆర్ఎస్ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా, ఆపరేటర్ల హక్కుల రక్షణ కోసం చివరి రోజు వరకు పోరాటం చేస్తుంది.

గ్రూప్-1 స్కాంపై విద్యార్థులపై పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేయాలి

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కాలరాసేలా, రాజ్యాంగబద్ధమైన బాధ్యత కలిగిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లోపభూయిష్టంగా గ్రూప్-1 పరీక్షను నిర్వహించి, తప్పులతడకగా ఫలితాలను ప్రకటించిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. ఈ తప్పిదాలను సరిదిద్దుకునే అవకాశాన్ని హైకోర్టు స్పష్టంగా ఇచ్చినా, ఆ తీర్పును గౌరవించడం పోయి, విద్యార్థులపై ప్రభుత్వం దుర్మార్గంగా, కేసులు పెట్టడం తీవ్రంగా ఖండనీయమని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో గెల్లు శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో కొంతమంది విద్యార్థులు శాంతియుతంగా చర్చలు జరిపి, హైకోర్టు తీర్పు అమలు చేయాలని ప్రభుత్వం వద్దకు వినతిపత్రం ఇవ్వాలనుకున్నారని వివరించారు. అయితే, వారికి మాట్లాడుకునే హక్కు లేదని పోలీసులు అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను, ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్‌ను ఖండిస్తూ వారిని అరెస్టు చేసి అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం పూర్తిగా అన్యాయమన్నారు.

ఇకపై సింగరేణి ఉపరితల గనుల్లో మహిళా ఆపరేటర్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగరేణి సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్‌గా లేదా బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి ఎంపిక కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. మైనింగ్ రంగంలో మహిళల సాధికారత, సమాన అవకాశాలు, మానవ వనరుల సమర్థ వినియోగంలో భాగంగా సీఎండీ ఎన్.బలరామ్ ఆలోచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శనివారం సింగరేణి యాజమాన్యం అన్ని గనులకు, డిపార్ట్మెంట్లకు సర్క్యులర్ విడుదల చేసింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం ఇవ్వడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి. ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్ లేదా బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న 35 సంవత్సరాల లోపు వయసు ఉండి కనీసం ఏడవ తరగతి పాసైన మహిళా అభ్యర్థులు ఈ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు అని యాజమాన్యం పేర్కొంది. దరఖాస్తు చేసుకునే మహిళలు శారీరక సామర్థ్యం కలిగి ఉండాలని కనీసం ద్విచక్ర లేదా నాలుగు చక్రాల వాహన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ఆగస్టు 2024 కన్నా ముందు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కూడా యాజమాన్యం పేర్కొంది. పై అర్హతలు గల మహిళా ఉద్యోగులు ఇవ్వబడిన నమూనాలో అప్లికేషన్లు పూర్తి చేసి సంబంధిత గని మేనేజర్ లేదా శాఖాధిపతికి లేదా జనరల్ మేనేజర్‌కు అందజేయా లని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత జనరల్ మేనేజర్ సిపిపి నేతృత్వంలోని ఒక కమిటీ దరఖాస్తులను పరిశీలించి కనీస అర్హతలు గల అభ్యర్థులను ఎంపిక చేస్తారు. కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థులు సిరిసిల్లలో గల తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థ హెవీ గూడ్స్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ విభాగంలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఖాళీల లభ్యతను బట్టి నిర్వహించే ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణులు అయిన వారిని ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి-5 డిసిగ్నేషన్‌తో సంబంధిత ఏరియాలకు పంపించడం జరుగుతుంది. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవలసిందిగా యాజమాన్యం కోరుతోంది.

వ్రాఘ్న బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ స్టార్ ఇబ్రహీం అలీ ఖాన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశ యువతను ఆకట్టుకునే అగ్రగామి ఫ్యాషన్ బ్రాండ్ వ్రాఘ్న బాలీవుడ్ నటుడు ఇబ్రహీం అలీఖాన్‌ను తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్గా నియమించినట్లు శనివారం ప్రకటించింది. ఆదిత్య బిర్లా గ్రూప్కు చెందిన టీఎం ఆర్ డబ్ల్యూ భాగస్వామ్యంతో నడుస్తున్న వ్రాఘ్న హైదరాబాద్ హిమాయత్నగర్‌లోని తమ కొత్త ఫ్లాగ్ షిప్ స్టోర్ను కూడా ఆవిష్కరించింది. 45,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 50కి పైగా ప్రత్యేక దుకాణాలు, 100కి పైగా నగరాలో 205కి పైగా పెద్ద ఫార్మాట్ రిటైల్ స్టోర్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్న డీ2సీ వ్యాపారంతో, వ్రాఘ్న భారతదేశంలోని అతి పెద్ద ఫ్యాషన్ బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది. ఇది 'మేక్ ఇన్ ఇండియా' విజయ గాథలకు ఒక గొప్ప ఉదాహరణ కూడా 2014లో స్థాపితమైనప్పటి నుంచి, వ్రాఘ్న భారత యువతలో ప్రత్యేకంగా, తమ ట్రెండ్లో ఉండే డిజైన్లు అసాధారణమైన నాణ్యతతో ప్రజాదరణ పొందింది. వ్రాఘ్న సహ వ్యవస్థాపకులు అంజనా, విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వ్రాఘ్న ఎప్పుడూ యువతతో మమేకమయ్యే గొంతులు వెతుకుతూ ముందుకు సాగింది. ఆ ప్రయత్నంలో ఇబ్రాహీం అలీ ఖాన్ మాతో చేరడం మాకు ఆనందం కలిగిస్తోందన్నారు. ఆయన స్టైల్, ఎనర్జీ, సహజమైన ఆకర్షణ మా బ్రాండ్ తత్వాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

జీవితంలో విజయం సాధనకు విద్యే కీలకాధారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎవరైనా తమ జీవితంలో విజయం సాధించడానికి విద్యనే కీలకమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ - తెలంగాణ రికగ్నిషన్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ట్రెస్మా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ నగరంలోని ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆచార్య దేవోభవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రైవేటు విద్యాసంస్థల ఉత్తమ కరస్పాండెంట్లకు, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి, ఘనంగా సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65శాతం విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, మీ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కారిస్తామని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తనకు ఉందన్నారు. అందుకే అన్నింట్లో వెనుకబడి లేబర్ జిల్లాగా, వలసల జిల్లాగా పేరుగాంచిన ఈ జిల్లాలో అనతికాలంలోనే పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్, లా కళాశాలను, ప్రతిష్టాత్మకమైన ఐఐఐటీ కళాశాలను, ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలను తీసుకుని వచ్చామని గుర్తు చేశారు. రానున్న పది సంవత్సరాల్లో సుమారు 10 వేల మంది విద్యార్థుల వరకు ఇంజనీరింగ్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభించాలంటే కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించే కంపెనీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య భీమా మీ అందరికీ ఎంతో అవసరం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలకు పరిష్కారించేందుకు ప్రైవేటు స్కూల్ వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రతి నెలా 250 రూపాయలను చెల్లించాలని, అంతే మొత్తంలో ఆయా పాఠశాల యాజమాన్యం కూడా చెల్లించాలని సూచించారు. టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ మధుసూదన్, గౌరవ అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణ్, పట్టణ అధ్యక్షులు జి.వంశీ మోహన్, కిరణ్మై, రిషి విద్యాసంస్థల డైరెక్టర్ చంద్రకళా వెంకటయ్య, లుంబిని లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

ఐక్యంగా సామాజికవర్గ అభ్యున్నతికి పాటు పడదాం



విశాలాంధ్ర, బషీర్ బాగ్ : వడ్డెర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించుకుంటూ అభ్యున్నతికి పాటుపడదామని అఖిల భారత వడ్డెర వడ్డే సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. వడ్డెర సంఘాన్ని బలోపేతం చేసేందుకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన ప్రకటించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా గుంజా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా అశోక్, జాతీయ సంయుక్త కార్యదర్శిగా మొక్కల శేఖర్, యువజన అధ్యక్షుడిగా వేముల లోకేష్, యువజన కార్యదర్శిగా వేముల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శిగా వేముల మధుసూదన్‌లను నియమించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న వడ్డెరలను ఐక్యం చేసి సామాజిక వర్గం సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటామన్నారు. పేదరికంలో మగ్గుతున్న వడ్డెరలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి చేసేందుకు కార్యవర్గం శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

బోధనా ఫీజులు, ఉపకార వేతనాల బకాయిలను విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 8000 కోట్ల ఇంటర్మీడియట్,డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ, బీఈడీ, ఫార్మా, పాలిటెక్నిక్ తదితర వృత్తి విద్యా కోర్సుల విద్యార్థుల బోధన ఉపకారవేతన ఫీజు బకాయిలను సత్వరమే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 15 నుండి తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ), ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్ (ఫతీ) వృత్తి విద్యా కళాశాలలు చేపట్టనున్న కళాశాలల బంద్ కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ప్రకటించారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి వై జంక్షన్ కూడలి వరకు చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ప్రారంభించి, అమలు చేసిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అదే ప్రభుత్వం ఈ పథకానికి తూట్లు పొడుస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా సంక్షేమ విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. బోధన రుసుములు, ఉపకార వేతనాల కోసం రాష్ట్రంలో ఏటా 12.50 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే కోర్సులు పూర్తి చేసిన, చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధన ఫీజులు కలిపి 2021-25 విద్యా సంవత్సరం నాటికే రూ.7000 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజుల విడుదల్లో ఆలస్యం, సంక్షేమ శాఖలు విడుదల చేసిన బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్లో ఉండడంతో విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం అప్పులు చేసి కళాశాలల్లో ఫీజులు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1400 ఇంటర్ కళాశాలల్లో 9లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, 944 డిగ్రీ కళాశాలల్లో 6లక్షల మంది విద్యార్థులు, 262 ఇంజనీరింగ్ కాలేజీల్లో ఒక లక్షా 20వేల మంది విద్యార్థులు, 200 పీజీ కళాశాలల్లో 20వేల మంది విద్యార్థులు ఉపకార వేతనాల మీదే ఆధారపడి ఉన్నత విద్య అభ్యసిస్తున్నారన్నారు. అధ్యాపకుల జీతభత్యాలు, కళాశాలల నిర్వహణ తదితర సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలో విద్యా రంగ బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. దసరా పండగ లోపే విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షుడు కె. కళ్యాణ్, రాజ్ కుమార్, మహేష్, విశాల్, నితిన్,కార్తీక్, భరద్వాజ్, రాణా, నదీమ్, కిషోర్,ప్రభాకర్, సుధీర్ పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనేందుకు బీమా రంగం, సంస్థలు సన్నద్ధం కావాలి

ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత ఆర్థికాభివృద్ధిలో బీమా రంగం ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, భవిష్యత్ ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భారత బీమా రంగం, సంస్థలు సన్నద్ధం కావాలని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్ బి ఐ) డిప్యూటీ గవర్నర్ ఎం.రాజేశ్వరరావు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశంలో వస్తున్న వాతావరణ, భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బీమా సంస్థలు విధానాలు, పద్దతులు, సేవలను రూపొందించుకోవాలని ఆయన సూచించారు. గచ్చిబౌలిలో శనివారం జరిగిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సురెన్స్, రిస్క్ మేనేజ్ (ఐఐఆర్‌ఎం) స్నాతకోత్సవానికి ఎం.రాజేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై స్నాతకోపన్యాసం చేశారు. ఐఐఆర్‌ఎంలో 2023-25 విద్యా సంవత్సరంలో పిజిడిఎం విద్యాభ్యాసం పూర్తిచేసిన విద్యార్థులకు రాజేశ్వరరావు పట్టాలను ప్రదానం చేశారు. సభకు అతిధులుగా భారత ఇన్సురెన్స్ రెగ్యులేటరీ, డెవలప్ అధారిటీ (ఐఆర్ డిఎఐ) సభ్యులు రజయ్ కుమార్ సిన్హా, పి.కె.అరోరా, సత్యజిత్ త్రిపాఠి, ఐఐటి సి ఈ ఓ వెంకట్ చెంగవల్లి, ఎస్ బిఐ లైఫ్ ఇన్సురెన్స్ చీఫ్ అభిషేక్ ముజుందార్ హాజరయ్యారు. సభలో రాజేశ్వర రావు ప్రసంగిస్తూ ఆర్థిక రంగాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి స్థిరమైన ఆర్థికం, ప్రభావవంతమైన రిస్క్ మేనేజ్ నాయకత్వం అవసరమన్నారు. ఐక్యరాజ్య సమితి 2020-23 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 1.1 డిగ్రీల సెల్సియస్ పెరిగిందని, ఈ వాతావరణ అసమానతలను నియంత్రించనట్లయితే ప్రపంచ వ్యాప్తంగా 4 శాతం జిడిపిని నష్టపోయే ప్రమాదం ఉందని, దీని ప్రభావం అన్ని రంగాలపై పడుతుందని, ముఖ్యంగా బీమా రంగంలోపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వాతావరణ, సామాజిక భౌగోళికమైన మార్పులు బీమా రంగంలో గణనీయమైన డిమాండ్ పెంచుతుందని, ఇందుకు అనుగుణంగా బీమా రంగం తన సేవలను రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం 2023-24 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం దేశంలో బీమా రంగం విస్తరణ తక్కువగా ఉందని ప్రపంచవ్యాప్తంగా బీమా ప్రీమియం సగటు 7 శాతం కాగా భారతదేశంలో అది 3 శాతంగా ఉందని తెలిపారు.

అయితే ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం భవిష్యత్తులో భారత దేశంలో ఆర్థిక రంగం కంటే ఎక్కువగా బీమా రంగం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. 2024- 28 మధ్యకాలంలో దేశంలో బీమా రంగం వృద్ధి 11 శాతం ఉంటుందని భారత బీమా రంగం అంచనా వేసిందని, అందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీమా ప్రీమియం రూ.11.2 లక్షల కోట్లతో ఏడు శాతానికి పెరిగిందని అంచనా వేసిందని ఆయన వెల్లడించారు. రానున్న కాలంలో భారతదేశ బీమా రంగం ప్రపంచంలోని ఆర్థికంగా అభివృద్ధి చెందిన అనేక దేశాల బీమా రంగాల కంటే గణనీయంగా వృద్ధి చెందుతుందన్నారు. ఈ వృద్ధి సాంకేతిక అంశాలు, వాతావరణ మార్పులు, సూక్ష్మ ఆర్థిక వ్యవహారాలు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఆర్థిక సంస్థలు ఈ మార్పులను సూక్ష్మంగా గమనిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఐ ఆర్ డి ఎ ఐ సభ్యులు రజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ బీమా, ఆర్థిక సేవల రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని, గ్రాడ్యుయేట్లు వారి వృత్తిపరమైన ప్రయాణాలలో ఆవిష్కరణ, అనుకూలతను ఎప్పటికప్పుడు స్వీకరించాలని సూచించారు. సమాజంలో, తాము ఎంచుకున్న రంగంలో వస్తున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేసిన వారే మనుగడ సాధిస్తారని, లేనట్లయితే వెనుక బడిపోతారని పేర్కొన్నారు. తొలుత ఐ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అరవింద్ కుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ బీమా, రిస్క్ మేనేజ్ అనుబంధ ఆర్థిక సేవలలో ఆవిష్కరణ, నైతిక నాయకత్వాన్ని నడిపించే నిపుణులను పెంపొందించడంలో సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. సభకు ఐ ఐ ఆర్ ఎం ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.కె.మోహన్ వందన సమర్పణ చేశారు.

అంగన్వాడీ భవనాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ చిన్నారులు చదువుకునే అంగన్వాడీ భవనాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో 6 మండలాలు రెండు మున్సిపాలిటీలో మొత్తం 28 నూతన అంగన్వాడి భవనాలను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించానని తెలిపారు. నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు లేక చిన్నారి విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యలు తన పర్యటన ద్వారా దృష్టికి రావడంతో స్వయంగా కృషిచేసి ప్రభుత్వంతో తీవ్రంగా ప్రయత్నం చేసి నియోజకవర్గ వ్యాప్తంగా 28 అంగన్వాడి కేంద్రాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. గతంలో అనేక అంగన్వాడీలను సందర్శించినప్పుడు అక్కడి పరిస్థితులు చూసి ఎంతో బాధ కలిగిందని అన్నారు.ప్రభుత్వం అంగన్వాడి భవనాల నుండి మొదలుకొని డిగ్రీ పీజీ స్థాయి విద్యాసంస్థలను కూడా అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికే మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. నియోజకవర్గంలో అంగన్వాడీ భవనాల మంజూరుకు తాను ప్రతిపాదనలు పంపగానే సంబంధిత పంచాయతీ శాఖ, సిఆర్డిఏ శాఖల వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జెడ్పిటిసిలు పి వెంకటరామ్ రెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, నాయకులు వీరేశం, సురేష్ రెడ్డి, గోపాల్, శ్రావణ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ సమస్యలపై మీడియా వర్క్‌షాప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా సెప్టెంబర్ 16న ఉదయం 10:00 గంటలకు "హ్యూమన్ ట్రాఫికింగ్ బాండెడ్ లేబర్" అంశాలపై ప్రత్యేక మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించేలా, ఈ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవడం, బాధితుల పట్ల ప్రదర్శించే వైఖరి లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో "హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్" బాధితుల పునరావాసం, న్యాయపరమైన, సమాజపరమైన మద్దతు అంశాలపై నిపుణులు ప్రసంగించనున్నారు. అలాగే, మీడియా పాత్ర, బాధితుల గౌరవాన్ని కాపాడుతూ సమగ్ర కథనాలను తయారు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. సివిల్ సొసైటీ ప్రతినిధులు, న్యాయ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఈ సమస్యపై జర్నలిజానికి అవసరమైన అవగాహనను పెంచే లక్ష్యంతో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వస్తోంది. ఐజేఎం సంస్థ ఈ రంగంలో దేశవ్యాప్తంగా చేసిన అవిశ్రాంత సేవను మనందరికీ పరిచయం చేస్తూ, న్యాయ వ్యవస్థతో కలిసి పని చేస్తోంది. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ పేరు, సంస్థ పేరు, హోదా మరియు పని చేస్తున్న ప్రదేశంతోపాటు తమ మొబైల్ నెంబర్ ను ఈ కార్యాలయ మేనేజర్ సెల్ నెంబర్ 7093600977 కు వాట్సాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు. ముందుగా నమోదు చేసుకున్న మొదటి 70 మంది జర్నలిస్టులకు మాత్రమే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనుటకు అనుమతించబడునని వివరించారు.

బీఎన్ఐ అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో ప్రారంభించిన మంత్రి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ప్రపంచంలో అతిపెద్ద వ్యాపార నెట్వర్కింగ్, వ్యాపార రిఫరల్ సంస్థ అయిన బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఆధ్వర్యంలో శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో 'బీఎన్ఐ వాంటేజ్ గోనాట్ 2025' పేరుతో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోను పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇది తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో, సెమినార్ అనవచ్చు. ఈ కార్యక్రమాన్ని బీఎన్ఐ హైదరాబాద్ నిర్వహిస్తోంది. రెండు రోజులు జరిగే ఈ ఈవెంట్ పారిశ్రామికవేత్తలు, పరిశ్రమ నాయకులు, వ్యాపార దృక్పథం కలిగిన వ్యక్తులను ఒకే వేదికపై చేర్చింది. ఇప్పుడు ఐదో ఎడిషన్‌లోకి ప్రవేశించింది. హైదరాబాద్‌లో బీఎన్ఐ 13 ఏళ్ల సేవా ప్రయాణాన్ని సూచిస్తోంది. ఈ గోనాట్ 2025కు భారత్, మధ్య ప్రాచ్య దేశాలు, పొరుగు దేశాల నుంచి ఇరవై వేలకు పైగా సందర్శకులు రానున్నారు. 200 పైగా ఎంఎస్ఎంఈలు తమ విభిన్న ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తూ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బీఎన్ఐ రీజియన్‌గా నిలిచిన బీఎన్ఐ హైదరాబాద్, 400 పైగా పరిశ్రమల్లో 4,000 పైగా వ్యాపార యజమానులను కలిగి ఉండడం ద్వారా తన విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది. మంత్రి శ్రీధర్ బాబు ఎంఎస్ఎంఈ భవిష్యత్తు, దేశ నిర్మాణంలో వాటి పాత్ర, ఈ రంగాన్ని బలపరచేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై డైనమిక్ ఫైర్‌సైడ్ చాట్ రీజియన్‌గా పాల్గొన్నారు. ప్రముఖులు లీడ్ ఆర్ బ్లీడ్ పుస్తక రచయిత, క్వాంటమ్ లీప్ లెర్నింగ్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ తల్రేజా, జూహెూ కార్పొరేషన్ ఇంజినీరింగ్, బిజినెస్ సొల్యూషన్స్ డైరెక్టర్, జూహెూ స్కూల్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు రాజేంద్రన్ దండపాని, జెట్ సెట్‌గో ఏవియేషన్ సహ వ్యవస్థాపకురాలు, సీఈఓ కనికా తెక్రివాల్ తమ అనుభవాలను పంచుకు న్నారు. బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ ఇది కేవలం ఒక ఎక్స్‌పో మాత్రమే కాదన్నారు. ఇది సహకారాలకు జన్మనిచ్చే, ఆలోచనలకు రెక్కలు విప్పే ఎకోసిస్టం అన్నారు. గోనాట్ 2025లో ఈ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనున్నామని చెప్పారు. సరైన అవకాశాలతో, పెద్ద కలలతో గ్లోబల్ స్టేజ్‌లో నిలబడే అవకాశాన్ని అందించడమ మా లక్ష్యమన్నారు. బేకింగ్, ఫొటోగ్రఫీ, ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ స్టైలింగ్, అడ్వర్టైజింగ్, ఫుడ్ ఇన్నోవేషన్ వంటి విభాగాల్లో చాప్టర్ కాంటెస్టులు, వ్యక్తిగత పోటీలు సృజనాత్మకతతో సందడిగా సాగాయి. 121 కాన్‌క్లేవ్ పారిశ్రామికవేత్తలకు తమ ఆలోచనలను పంచుకోవడానికి, అవకాశాలను అన్వేషించడానికి ఒక ప్రీమియం వేదికగా నిలిచింది. మొదటి రోజు అజీమ్ బనాత్వాలా స్టాండ్-అప్ కామెడీ ఆకట్టుకుంది. ఉత్తమ ప్రతిభావంతులకు అవార్డ్స్ అందించారు. రెండో రోజు డీజే పరోమా సంగీతంతో గ్రాండ్ ఫినాలే గాలా జరగనుంది. అనంతరం బీఎన్ఐ మూల సిద్ధాంతమైన 'గీవర్స్ గెయిన్' ప్రతిబింబించేలా అవార్డులు అందజేయనున్నారు.

ఉచిత మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన నెమలి అనిల్

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్‌కి, మహిళలకి ఉచిత మెడికల్ క్యాంపు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సోషల్ జస్టిస్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అండ్ డిసబిలిటీ ఆఫ్ పర్సన్స్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా వాళ్ళ సౌజన్యంతో డా.షిఫా, నర్స్ శాంతి నేతృత్వంలో కాలనీవాసులకు ఉచిత మెడికల్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్‌కుమార్ హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉచిత ఆరోగ్య పరీక్షలను ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ రోజులలో పని ఒత్తిడి వల్ల మనుషులు ఎప్పుడు ఏ రోగం వస్తుందో తెలియని పరిస్థితి ఉందని ఆరోగ్య పరీక్షల వల్ల రోగాలను ముందస్తుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈస్ట్ అన్నపూర్ణ కాలనీ అసోసియేషన్ వారు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం చాలా గొప్ప విషయమని చెప్పారు. మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, స్టేట్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పిఎస్ఎన్ చౌదరి, కాలనీ అధ్యక్షులు డా. కటర్ల శేఖర్ బాబు మాట్లాడుతూ దాదాపు వందమందికి పైగా పాల్గొని పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణతో తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: ఎస్సి వర్గీకరణ ద్వారా మాలలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య ఆరోపించారు. అభివృద్ధి చెందిన మాదిగలకు 9 శాతం రిజర్వేషన్లు ఇచ్చి, మాలలకు కేవలం 5 శాతమే ఇచ్చారన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా తీసుకొచ్చిన రోస్టర్ విధానం కారణంగా విద్య, ఉద్యోగాలలో మాలలు నష్టపోతున్నారన్నారు. ఎంపిరికల్ డేటాను పరిగణలోకి తీసుకోకుండా, జస్టిస్ షామీమ్ అక్తర్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా వర్గీకరణ చేశారని ఆరోపించారు. మాలలు, మాల ఉప కులాల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 2న మాలల రణభేరి పేరిట ఛలో హైదరాబాద్ కు చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ రణభేరి సభకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిధిగా పాల్గొననున్నట్లు చెన్నయ్య తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కమ్మతోటి పౌలు, ఏ కేశవులు, నాగమల్లేశ్వరి, సరళ, సుమలత, లక్ష్మమ్మ, లలిత, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయి తెలుసుకుని మాట్లాడాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తన స్థాయిని మించి మాట్లాడుతున్నాడని ముందు ఆయన తన స్థాయిని చూసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి నీకుందా కేటీఆర్ అంటూ ధ్వజమెత్తారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కేటీఆర్ రాహుల్ గాంధీ పై చేసిన వ్యాఖ్యలపై ఎదురుదాడి చేశారు. కాళేశ్వరం విచారణ నుంచి తప్పించుకునేందుకు మెప్పు కోసం బీజేపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. కేటీఆర్ వ్యాఖ్యల వెనక బీజేపీ నేతలు ఉన్నారని, రాహుల్ పై కేటీఆర్ విమర్శలు మోదీ మెప్పు కోసమే అంటే వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలపకపోవడంతో మీ వైఖరి బట్టబయలు అయ్యింది. మీరు పరోక్షంగా ఎన్డీయే మద్దతు తెలిపారని అభిప్రాయపడ్డారు. బీజేపీ బిఆర్ఎస్ వేరు కాదని, కవిత వ్యాఖ్యలతో బీజేపీలో బిఆర్ఎస్ మానసికంగా విలీనం అయ్యిందని స్పష్టమైందన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు గురించి రాహుల్ గాంధీ ఎందుకు స్పందిస్తారని ఆయన కేటీఆర్ ను నిలదీశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు స్పీకర్ పరిధిలోని అంశమని కానీ వోట్ చోరీ ప్రపంచవ్యాప్తంగా ఆరా తీస్తున్నారని, వోట్ చోరీ అంశాన్ని రాహుల్ గాంధీ బట్ట బయలు చేశారని తెలిపారు. కాళేశ్వరం సీబీఐ విచారణ తప్పించుకునేందుకు బిఆర్ఎస్ నేతల అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం కేసు విచారణ సిబిఐ కి ఇవ్వమని కోరిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని బీజేపీ కుటిల ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కోట నీలిమకు నోటీసులు రాజకీయ కక్ష్య సాధింపు చర్యలో భాగమే అని ఈ చర్యను ఖండిస్తున్నామని తెలిపారు. 2017లో కోట నీలిమ కుటుంబం చిరునామా మార్చాలని ఎన్నికల కమిషన్‌కు ఫామ్-6 ఇచ్చినా ఈసి చర్యలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఫామ్ - 6 ప్రకారం తమ విధులు సక్రమంగా నిర్వహించని ఈసీ ఇప్పుడు బీజేపీ ఒత్తిడితో కోట నీలిమకు నోటీసులిచ్చిందని పేర్కొన్నారు. కోట నీలిమకు నోటీసులపై న్యాయ పరంగా ముందుకు వెళతామని వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని, 48 గంటల్లో కాళేశ్వరం అవినీతిని తేలుస్తామని అన్న కిషన్ రెడ్డి ఎందుకు సైలెంట్ అయ్యారూ అంటూ ప్రశ్నించారు. బీజేపీలో బిఆర్ఎస్ విలీనంలో భాగంగానే కాళేశ్వరంపై విచారణ ఆగిందని భావిస్తున్నామన్నారు.

కేర్ అండ్ లవ్ అనాథాశ్రమానికి జింక నాగులు చేయూత

విశాలాంధ్ర - జవహర్ నగర్ : అనాథలకు అభాగ్యులకు సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి దాగుందని అసహాయులను చేరదీస్తే పుణ్యంతో పాటు ఆత్మసంతృప్తి లభిస్తుందని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ సామాజికవేత్త జింక నాగులు ముదిరాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేర్ అండ్ లవ్ అనాథ ఆశ్రమంలోని 60 మంది పిల్లలకు రెండు రోజుల భోజన సౌకర్యార్థం కొరకు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా జింక నాగులు మాట్లాడుతూ అనాథలను అభాగ్యులను ఆదుకుంటేనే మానవ జన్మకు సార్థకత అని మనిషి మానవత్వం ప్రేమ సౌభ్రాతృత్వం సోదరభావం ఎదుటి మనిషిని ఆదుకోవడంతోని మానవుల జీవితం సార్థకతమవుతుందని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని పేదల అభ్యున్నతి కొరకు నిత్యం పాటుపడతానని యువత సత్కార్యాలతో సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ పరిధిలో పేదలే ఎక్కువగా నివసిస్తున్నారని వారి అభ్యున్నతి కొరకు వీలైనంత వరకు సహాయం చేయాలన్నారు. కేర్ అండ్ లవ్ అనాథాశ్రమ ఇన్చార్జి స్వర్ణలత, జర్నలిస్టులు, ఆశ్రమ బాల బాలికలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, షఫీ నగర్‌లో రూ. 28 లక్షల వ్యయంతో స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ పనులకు మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం పరిశీలించారు. అదే విధంగా, మౌలాలి డివిజన్ పరిధిలోని షాదుల్లా నగర్‌లో రూ. 27 లక్షల వ్యయంతో నిర్మించబోయే సీసీ రోడ్ పనులకు మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నిత్యజీవితంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవిధంగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. అసిస్టెంట్ ఇంజ నీర్ మధురిమ, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు అమీనుద్దీన్, మేకల రాము యాదవ్, సత్యనారాయణ, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, ఆదినారాయణ, మారుతి ప్రసాద్, సంతోష్ గుప్త, హేమంత్ పటేల్, నవాబ్, దినేష్, మురళి నాయుడు, గణేష్, ఉషశ్రీ, గాయత్రీ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను చూస్తే జాలేస్తుంది

విశాలాంధ్ర - హైదరాబాద్ : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరు చూస్తుంటే జాలి వేస్తుందని, దోచుకున్న సొమ్ము పంపకాలలో తేడాలు రావడంతో కుటుంబ కలహాలు ఏర్పడి కేటీఆర్ మతి భ్రమించిదని దేవరకద్ర ఎమ్మెల్యే, మహబూబ్ నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. అసలు ఆయన పాలమూరుకు ఏం మొహం పెట్టుకుని వచ్చారని కేటీఆర్ ప్రశ్నించారు. శనివారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు జిల్లా కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి, రాజకీయ భవిష్యత్తు ఇస్తే, 10 ఏళ్ల మీ పాలనలో పాలమూర్‌కు అన్యాయం చేశారని విమర్శించారు. తేదీ 11-06-2015 నాడు మీ నాన్న పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి, 10 ఏళ్ల పాలనలో పాలమూర్‌ను పూర్తి చేయలేదని మండిపడ్డారు. సొంత పేపర్, సొంత చానల్ లో డబ్బా కొట్టుకోవడం తప్ప కేటీఆర్ అంత సీన్ లేదు - పాలమూరు జిల్లాలో కేటీఆర్‌ను ఎవరు పట్టించుకోరని పేర్కొన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడించిన కేటీఆర్‌కు బుద్ధి రాలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల, ఆలంపూర్ లలో స్థానిక నాయకుల బలంతోనే గెలిచారు తప్ప పాలమూరులో పూర్తిగా బీఆరెస్ తుడిచి పెట్టుకుపోయిందన్నారు. పాడే మీద ఉన్న బిఆర్ఎస్ పార్టీని దోచుకున్న సొమ్ముతో కేటీఆర్ సోషల్ మీడియాలో బాహుబలి రేంజ్ లో ప్రొజెక్షన్ ఇచ్చుకుంటున్నాడని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మీ నాన్న 600 కార్లతో హడావిడిగా వచ్చి, నార్లపూర్ వద్ద ఒక పంపు ఆన్ చేస్తే అర్ధ గంటకే ఆగిపోయిందన్నారు. కాలువలకు భూసేకరణ చేయకుండా ప్రాజెక్ట్ కట్టిన ఘనుడు కేసీఆర్ అని, ధరణి, కాళేశ్వరం, లిక్కర్, ఈ కారు స్కాంలో నిండా మునిగి, వాటికి సమాధానం చెప్పుకోలేక, స్కాంల నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికే కేటీఆర్ పాలమూరు పర్యటన చేశారని పేర్కొన్నారు. కేటీఆర్ ప్రవర్తన ను ప్రజలు అసహించుకుంటున్నారు, పాలమూరు ప్రజలు కేటీఆర్ ను పట్టించుకోరని పేర్కొన్నారు. పాలమూరు ముద్దుబిడ్డ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. గతంలో రైతు పండుగలో సీఎం. రేవంత్ రెడ్డి జిల్లాకు సంవత్సరానికి 20000 వేల కోట్లు వెచ్చించి అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి, హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. అందుకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రిని అడిగింది తడవుగా నియోజకవర్గ, పాలమూరు జిల్లా అభివృద్ధికి నిధులు ఇస్తున్నారని చెప్పారు. నువ్వు ఎన్ని కబుర్లు చెప్పినా మీ పదేళ్ల

విజయ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హుడా కాలనీ హెూప్ ఫౌండేషన్ కార్యాలయంలో చైర్మన్ విజయ్ కుమార్‌ని తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్య వేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం శాల్వాలతో బొకేలతో ఘనంగా సన్మానించడం జరిగింది. జన్మదిన సందర్భంను పురస్కరించుకొని బేరి రామచంద్ర యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖంగా కాలం గడుపుతూ శాంతియుతంగా ప్రజా సేవ చేసి మంచి పేరు సంపాదించాలని భగవంతుడు మిమ్మల్ని చల్లగా చూడాలని పేర్కొనడం జరిగింది. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ విజయ్ కుమార్‌ని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ముఖ్యంగా పేదలకు ప్రజలందరికీ సేవ చేసి మంచి పేరు సంపాదించాలని కోరారు. ఈ సమావేశంలో బేరి రామచంద్ర యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న, ఎన్ ఎన్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి అభిమానులు పాల్గొని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మట్టిమనుషులను పోరాట యోధులుగా మార్చింది ఎర్రజెండానే

విశాలాంధ్ర - కొత్తగూడెం : మట్టిమనుషులను పోరాట యోధులుగా మార్చింది ఎర్రజెండా అని దీని నీడలో కమ్యూనిస్టులు చేసిన వీరోచిత పోరాట ఫలితమే నేటి ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్రమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా అన్నారు. సెప్టెంబర్ 11నుండి 17వరకు సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం పాల్వంచ లోని స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ నుండి పట్టణంలో ప్రదర్శన నిర్వహించి అమర జీవులు వృషారావు, నాదెండ్ల రామకోటయ్య, ఉప్పుశెట్టి ఖాదర్ బాబు స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాత ఆర్డీవో కార్యాలయం రోడ్ లో ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు నల్లమల్ల గురుప్రసాద్ చిత్రపటానికి, సీపీఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధి వెంకటేశ్వర్లు విగ్రహానికి నివాళులు అర్పించి సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటం నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తోందన్నారు. దున్నేవాడికే భూమి నినాదం దేశవ్యాప్తం చేసిందన్నారు. మన అమరవీరుల త్యాగాల ఈ సాయుధ పోరాటాన్ని మతపోరాటంగా చిత్రీకరిస్తూ నేటి ఆర్ఎస్ఎస్ వారసులుగా ఉన్న బీజేపీ లబ్ధిపొందే కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రజాపోరాటాలు ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఉప్పుశెట్టి రాహుల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, విశ్వేశ్వరరావు, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, వరక అజిత్, చెన్నయ్య, కే. అప్పారావు, జె. మోహన్, రాకేష్, సుజన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్త మహబూబ్ పెట్ విలేజ్‌లోని పెద్ద కుడి చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులలో భాగంగా రూ.1 కోటి 93 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చెరువులో మురుగునీరు కలవకుండా చేపడుతున్న మురుగు నీటి మళ్లింపు కాలువ నిర్మాణం పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ మక్త మహబూబ్ పెట్ విలేజ్‌లోని పెద్దకుడి చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది అని, చెరువులో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు కాల్వ నిర్మాణం పనులను వేగం పెంచాలని, పనులు నాణ్యత ప్రమాణాలతో చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలియచేసారు. మురుగు నీటి మళ్లింపు కాల్వ ద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలంగా, చెరువు చుట్టూ పక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో సాంత్వన నేటితో చేకూరింది అని గాంధీ తెలియచేసారు. మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు,మహిళలు పాల్గొన్నారు.

అతిపెద్ద బ్రైడల్, హాఫ్‌శారీ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్



విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : హైదరాబాద్ వారసత్వంగా 1964లో స్థాపించబడిన ఆభరణాల వ్యాపార వేదిక. పిఎంజి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13 నుంచి 15 (2025) వరకు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో ప్రపంచంలోనే అతిపెద్ద బ్రైడల్, హాఫ్-సారీ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించింది. సమకాలీన వజ్రాలు, విభిన్న రంగుల రత్నాలు (జెమ్‌స్టోన్స్), సాంప్రదాయ పోల్కీలతో పాటు టెంపుల్ జ్యువెల్లరీ కళాఖండాలు, ఆకర్షణీయమైన జాదువా, కుందన్ సెట్‌లలో 20,000 కు పైగా సరికొత్త డిజైన్‌లను వధువుల కోసం, హాఫ్-సారీ వేడుకలు, ఫ్యామిలీ ఫంక్షన్లు, రోజువారీ దుస్తులు కోసం ప్రదర్శిస్తున్నారు. పి ఎం జి, జ్యువెల్స్ చైర్మన్ కుశాల్ కంకారియా, పి ఎం జి జ్యువెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కంకారియా ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఎంపిక చేసుకోవడానికి 20,000కు పైగా డిజైన్‌లు, ఇవన్నీ ఒకే వేదిక మీద బ్రైడల్, హాఫ్-సారీ ఆభరణాల అతిపెద్ద క్యూరేషన్. హెరిటేజ్ టెంపుల్ మోటిఫ్‌లు, పోల్కీ సెట్‌ల నుండి మొదలు ఆధునిక డైమండ్ సూట్‌లు, రత్నాల వరకు కలెక్షన్, వివాహాలు, నిశ్చితార్థాలు, హాఫ్-సారీ పండుగ దుస్తుల కోసం రూపొందించబడింది. కుటుంబాలు, ఎన్ ఆర్ ఐ క్లయింట్‌ల కోసం ఇంట్లో నుంచే ప్రయత్నించవచ్చు, వర్చువల్‌గా సంప్రదింపులు, పాత బంగారం మార్పిడి, పునఃరూపకల్పన (రీ-డిజైనింగ్), పాలిషింగ్, పునరుద్ధరణ, జీవితకాల కొనుగోలు లేదా మార్పిడి వంటి సేవలను పొందుకోవచ్చు. ఈ నేపథ్యంలో పి ఎం జి బ్రాండ్ అంబాసిడర్ సూపర్ స్టార్ మహేష్ బాబు తన అభిప్రాయాలను పంచుకుంటూ, ఆభరణాలు అంటే అందం గురించి మాత్రమే కాదు, వాటిపైన సడలని నమ్మకం కూడా ప్రధానం. పి ఎం జి 60 సంవత్సరాలకు పైగా హైదరాబాద్ కుటుంబాలలో తానూ ఒక భాగంగా ఉంది. నిజాయితీ, శ్రద్ధతో సాంప్రదాయ కళాఖండాలను రూపొందిస్తోంది. సంవత్సరాలుగా ఆ నమ్మకం హైదరాబాద్ నగరాన్ని దాటి విస్తరించింది.

మత రాజ్యమే బీజేపీ లక్ష్యం

- సంఘ్ పరివార్‌ను ఐక్యంగా ప్రతిఘటించాలి
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

అలప్పుజా: లౌకిక-ప్రజాస్వామ్య-గణంత్ర దేశమైన భారత్‌ను ఓ మత రాజ్యంగా మార్చాలని బీజేపీ యత్నిస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. సంఘ్ పరివార్‌పై ఐక్య ప్రతిఘటనకు పిలుపునిచ్చారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ మతం పేరిట ప్రజలను విభజిస్తున్నాయని, కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయని దుయ్యబట్టారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్‌కు పాత్ర లేదన్నారు. కమ్యూనిస్టుల దేశభక్తిని ఎవరు కూడా ప్రశ్నించకూడదని రాజా నొక్కిచెప్పారు. 'దేశం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నాల్గో ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ రూపాయి మారక విలువ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. నిరుద్యోగం తారస్థాయికి చేరింది. ప్రధాని మాత్రం నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు. తాజా పరిస్థితులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. భారతదేశాన్ని కాపాడుకోవాలంటే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ను గద్దెదించాలి. వామపక్షాన్ని, కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలపర్చుకోవాలి. లేని పక్షంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు' అని రాజా నొక్కి చెప్పారు. పార్టీ ఐక్యంగా ఉందని, భవిష్యత్‌లో మరింత బలాన్ని పుంజుకోగలదన్నారు. సీపీఐ కేరళ రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశంలో రాజా పాల్గొన్నారు. స్థానిక ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్డీఎఫ్‌ను గెలిపించాలని కేరళ ప్రజలను కోరారు. వామపక్ష సంఘటన ప్రజల ఆశాజ్యోతి అని వర్ణించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలతో రాష్ట్రంలో ఎల్డీఎఫ్ మూడోసారి అధికారంలోకి వస్తుందని దీమాగా చెప్పారు. సీపీఐలో వర్గపోరుకు ఆస్కారం లేదని రాజా తెలిపారు.

విజయ్ ప్రచారం ప్రారంభం

ఆడియో సమస్యలతో 20 నిమిషాల ప్రసంగం

పోటెత్తిన అభిమానం

తిరుచిరపల్లి: ప్రముఖ నటుడు, తిమిళగా వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్ తన ఎన్నికల ప్రచారాన్ని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆయన కోసం అభిమానం కట్టలు తెంచుకోగా, 20 నిమిషాల ప్రసంగం ఆడియో సమస్యల నడుమ సాగింది. విజయ్ కోసం తిరుచిరపల్లి జనసందోహంగా మారింది. వీధులన్నీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు కిక్కిరిసిపోయాయి. 'విజయ్... విజయ్' నినాదాలతో హోరెత్తాయి. విజయ్ ఉదయం 10.30 గంటలకు ర్యాలీని ప్రారంభించి, 11 గంటలకు ప్రసంగాన్ని ముగించాల్సి ఉంది కానీ మధ్యాహ్నం 3 గంటలప్పుడు విజయ్ ప్రసంగం ప్రారంభమైంది. విజయ్ మాట్లాడుతూ డీఎంకేకు ఓటేస్తారా? అని ప్రశ్నించారు. డీఎంకే హయాంలో అక్రమ కిడ్నీ రాకెట్ సాగుతోందని ఆరోపించారు. 2021 అసెంబ్లీ ఎన్నికలప్పటి హామీలను స్టాలిన్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. 1956లో ఎన్నికల బరిలో నిలిచేందుకు డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై తిరుచిరపల్లిని ఎంచుకున్నారని గుర్తుచేశారు. 1972లో పార్టీ పెట్టిన అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ 1974లో ఇక్కడే తొలి రాష్ట్ర మహాసభ నిర్వహించారని విజయ్ తెలిపారు. హేతువాది పెరియార్ ఈవీ రామస్వామి జీవితం ఇక్కడే సాగిందన్నారు. యుద్ధానికి వెళ్లే ముందు రాజులు తమ కుటుంబ దైవానికి మొక్కుకునేవారని, అదే రీతిలో తాను తిరుచునపల్లికి వచ్చానని విజయ్ అన్నారు. తిరుచిరపల్లి నుంచి మొదలయ్యే రాజకీయ కార్యక్రమం ఏదైనాగానీ టర్నింగ్ పాయింట్‌గా పరిణమిస్తుందన్నారు. తన రాజకీయ సంకల్పం విజయవంతం కాగలదని ఆకాంక్షించారు. విజయ్ చార్టర్డ్ విమానంలో చెన్నై నుంచి తిరుచిరపల్లికి ఉదయం 9.45 గంటలకు చేరుకున్నారు. ఆయనను చూసేందుకు పార్టీ జెండాలతో కార్యకర్తలు, అభిమానాలు పోటీపడ్డారు. విమానాశ్రయం వద్ద బారికేడ్లను తోసేశారు. మహిళలు సైతం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి బయటకు రావడం కోసం విజయ్‌కు గంట సమయం పట్టింది. అక్కడ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని మరాక్కడై ఎంజీఆర్ స్టాట్యూ పాయింట్‌కు వెళ్లేందుకు 4 గంటలు పట్టాయి. సమయం గడిచే కొద్దీ అభిమానుల సంఖ్య పెరుగుతూ ఆయన వాహనం ముందుకు కదలం చాలా కష్టంగా మారింది. విజయ్ ర్యాలీ కోసం పోలీసులు 20 షరతులు పెట్టారు. విజయ్ తొలి ప్రచారయాత్ర కావడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ జెండాలు, టోపీలు, విజయ్ ఫొటోలతో కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇదిలావుంటే, తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీకి 2026లో ఎన్నికలు జరగనున్నాయి.

తల్లిని చంపిన కొడుకు... జీవిత ఖైదు

లండన్: టీవీ రిమోట్ కోసం గొడవపడి తల్లిని హత్యచేసిన భారత సంతతి వ్యక్తికి యూకేలోని బర్మింగ్‌హామ్ కోర్టు యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. 15 ఏళ్ల శిక్షాకాలం పూర్తయ్యే వరకు అతడికి పెరోల్ కూడా ఇవ్వరాదని ఆదేశించింది. భారత్‌కు చెందిన సుర్జీత్ సింగ్ (39) తన తల్లి మొహిందర్ కౌర్ (76)తో కలిసి బర్మింగ్‌హామ్‌లో ఉండేవాడు. తల్లి బాగోగులు చూసుకుంటూ పనిపాట లేకుండా తిరిగేవాడు. నిత్యం మద్యం తాగేవాడు. ఈ క్రమంలో గత ఏడాది సెప్టెంబరులో టీవీ రిమోట్ విషయమై తల్లీకొడుకుల మధ్య గొడవ జరిగింది. రిమోట్ ఇవ్వడంలేదని మొహిందర్ కౌర్ తన కొడుకు సుర్జీత్‌ను దూషించింది. దాంతో ఆగ్రహానికి లోనైన సుర్జీత్ సింగ్ తల్లిపై దాడిచేసి చంపేశాడు. అనంతరం తన బంధువుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. బంధువు ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని చూస్తే మొహిందర్ కౌర్ రక్తపు మడుగులో పడి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు... మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. పారిపోయిన నిందితుడు పోలీసులు అక్కడ ఉండగానే తిరిగి రావడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పూర్తి కావడంతో బర్మింగ్‌హామ్ క్రౌన్ కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష వేసింది.

విద్య, వైద్యం

ప్రైవేటీకరణపై పోరు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని ఏసీ కళాశాల సమావేశ మందిరంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి సదస్సు శనివారం జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విద్యారంగాన్ని ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. పీపీపీ విధానంలో రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్న ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులకు పిలుపునిచ్చారు. మరో అతిథి, ఆంధ్ర ప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్... పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యను కాషాయీకరణ చేసే విధంగా అడుగులు వేస్తోందని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్లుగా బీజేపీకి చెందిన వారినే నియమిస్తున్నారని తెలిపారు. మరో అతిథి, ప్రముఖ వైద్యులు ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది విద్యార్థులు లక్షల రూపాయలు వెచ్చించి... కష్టపడి నీట్ కోచింగ్ తీసుకుంటున్నారని, అయితే ఎంబీబీఎస్ విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పడితే ప్రభుత్వాసుపత్రులు కూడా వస్తాయని, తద్వారా అనేక మంది పేద ప్రజలకు ఉచిత వైద్యం అందుతుందన్నారు. విద్యార్థులు పోరాటాలు నిర్వహించి ప్రభుత్వ వైద్య కళాశాలలను సాధించే విధంగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను మోసం చేస్తోందని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 77 రద్దు చేసి ప్రైవేట్, ఎయిడెడ్ పీజీ కళాశాలల్లో పీజీ సీట్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసి... విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం ఏఐఎస్ఎఫ్ పోరాట కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలరాజు, బందెల నాసర్ జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే విధంగా అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో అనేక మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా ఉన్న వారే ఈ రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలుగా ఉన్నారని, అలాంటప్పుడు ప్రభుత్వం విద్యారంగాన్ని ఏ విధంగా పరిరక్షిస్తుందని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునే విద్యార్థి సంఘాల నాయకులను పాఠశాలలు, కళాశాలల్లోకి రానివ్వకుండా జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకునేంతవరకు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 19న ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మా అధికార పరిధిని అతిక్రమించడమే

సుప్రీంకోర్టులో ఈసీ అఫిడవిట్

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టడంపై ఓవైపు విపక్షాలు...మరోవైపు న్యాయస్థానాలు పదేపదే తప్పుపడుతున్నప్పటికీ ఎన్నికల కమిషన్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్న వేళ సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌కు వ్యతిరేకంగా ఎన్నికల కమిషన్ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజ్యాంగానికి అనుగుణంగా ఎన్నికల జాబితా సవరణ, ఎన్నికల ప్రక్రియ చేపట్టే ప్రత్యేక అధికారం తమకు ఉందని ఈసీ పేర్కొంది. అలాంటప్పుడు దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు సమగ్ర సర్వే చేపట్టాలంటూ నిరంతరం ఆదేశాలు ఇవ్వడం... తమ అధికార పరిధిని అతిక్రమించడమే అవుతుందని ఈసీ వ్యాఖ్యానించింది. ప్రతి సాధారణ, శాసనసభ ఎన్నికలకు ముందు అక్కడ ఉన్న ఓటర్ల జాబితాలోని ఖాళీలను భర్తీ చేయాల్సిన బాధ్యత తమకు ఉంటుందని, అందువల్లే బీహార్ ఎన్నికలకు ముందు ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించామని సుప్రీంకు తెలిపింది. ఓటర్ల జాబితా స్వచ్ఛత, సమగ్రతను కాపాడుకోవడం తన చట్టబద్ధమైన బాధ్యత అని, ప్రస్తుతం తాము అదే నిర్వహిస్తున్నామని స్పష్టం చేసింది. బీహార్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణను సవాల్ చేస్తూ దాఖలైన 10కి పైగా పిటిషన్లను ఈనెల 10న సుప్రీంకోర్టు విచారించింది. ఈ ప్రక్రియను చేపట్టే రాజ్యాంగబద్ధమైన అధికారం ఈసీకి ఉందని స్పష్టంచేసింది. అయితే, ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో దీన్ని చేపట్టడం సమర్థనీయం కాదని అభిప్రాయపడింది. అదే సమయంలో దీనిపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఆ ప్రక్రియను కొనసాగించవచ్చని చెబుతూనే... ఓటర్ల గుర్తింపునకు పరిశీలించే పత్రాల జాబితాలో ఆధార్, రేషన్, ఓటరు ఐడీ కార్డునూ చేర్చాలని ఈసీకి సూచించింది. బీహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తామని ఈసీ ఇప్పటికే పేర్కొన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ ఏడాది చివరిలోనే ఈసీ ఈ ప్రక్రియ ప్రారంభించే సూచనలు కనిపిస్తున్నాయి. అక్రమ వలసదారులను తొలగించడంతో పాటు ఓటరు జాబితాల సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా ఈ చర్యలు ప్రారంభించినట్లు ఈసీ చెబుతోంది. తమపై దాఖలైన పిటిషన్‌లపై ఎన్నికల అధికారులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు.

ఉత్తరాంధ్రకు ఆయువుపట్టు 'భోగాపురం'

రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, జూన్ 2026 నాటికల్లా పూర్తిచేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. నిర్మాణ పనులను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ అధికారులు పనుల పురోగతిపై సమగ్ర వివరాలు అందజేశారు. రన్‌వే పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే నిర్మాణం 86 శాతం పూర్తయిందని కేంద్ర మంత్రి చెప్పారు. టెర్మినల్ భవనం 79 శాతం, యాక్సిస్ రోడ్లు 68 శాతం పనులు పూర్తి చేశామని జీఎంఆర్ సంస్థ వివరించిందని పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి ఎయిర్‌పోర్ట్ దూరం విషయంలో ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఏడు పాయింట్లలో ట్రాఫిక్ డైవర్షన్, రోడ్డు విస్తరణతో నగరానికి మరింత చేరువ చేస్తామని తెలిపారు. భీమిలి, తాళ్లవలస, పరదేశిపాలెం, ఆనందపురం, వేపగుంట వంటి ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. విశాఖపట్నం సిటీ నుంచి హైవేకు మెట్రో కారిడార్ నిర్మాణం, భువనేశ్వర్-విశాఖపట్నం ఆరు లైన్ల బీచ్ కారిడార్ ప్రాజెక్టులు పూర్తి అయితే ఉత్తరాంధ్ర రవాణా మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. "గత ఏడాది జూన్‌లో విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి నెలకు 2.30 లక్షల మంది ప్రయాణిస్తే, ప్రస్తుతం తన ప్రత్యేక చొరవతో 2.70 లక్షల మంది వెళ్తున్నారని వివరించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ మొదటి దశ పూర్తయితే ఏడాదికి 60 లక్షల కనెక్టివిటీ సాధ్యమవుతుంది" అని మంత్రి చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ మూడు జిల్లాలకు ప్రయోజనం చేకూర్చేలా, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయువుపట్టుగా నిలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు, ఆర్డీవో డి.కీర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, జీఎంఆర్ సీఈవో కన్వర్ బీర్ సింగ్ కలరా, సీడీఓ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ హెడ్ రామరాజు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై

వైసీపీ ఆందోళనలు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల పార్టీ అధ్యక్షులు, అసెంబ్లీ సమన్వయకర్తలు, ప్రధాన నాయకులతో కలిసి శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రైవేటీకరణకు గురవుతున్న వైద్య కళాశాలలు... పార్వతీపురం, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, మార్కాపురం, మదనపల్లె, పెనుకొండ, ఆదోని, పులివెందులలో ఉన్నాయని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ కాలంలో వైద్య కళాశాలల నిర్మాణానికి గొప్ప ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేస్తూ, ఇప్పుడు చంద్రబాబు నాయుడు పీపీపీ మోడల్ పేరుతో ప్రైవేటు వారికి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని సజ్జల ఆరోపించారు. ప్రజలకు నష్టం జరుగుతున్నప్పటికీ పైకి లాభం జరుగుతుందని చెప్పి మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు రౌండ్ టేబుల్ సమావేశాలు, వైద్య కళాశాలల వద్ద విస్తృత ప్రచారం, సోషల్ మీడియా సహా అన్ని వేదికల్లో ఉద్యమం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, సమాజంలోని అన్ని వర్గాలను ఈ చర్చలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు లేళ్ల అప్పిరెడ్డి, పూడి శ్రీహరి, విద్యార్థి, యువజన, వైద్యుల విభాగాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు కోన రఘుపతి, గుడివాడ అమర్‌నాథ్, పి.రవీంద్రనాథ్ రెడ్డి, సీదిరి అప్పలరాజు, నిసార్ అహ్మద్, ఎస్.వి. మోహన్ రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, అన్నా రాంబాబు, ఉషాశ్రీ చరణ్, పరీక్షిత్ రాజు, సాయిప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పొద్దుపై మణిపూర్ ఆశలు

- శాంతి, సౌభాగ్యానికి రాష్ట్రం చిహ్నం కావాలి
- శాంతి పథంలోనే భావితరాల ఉజ్వల భవిష్యత్
- చురాచంద్‌పూర్, ఇంఫాల్ సభలలో మోదీ
- రూ.7,300 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన
- హింస బాధితులకు పరామర్శ-నిర్వాసితులకు భరోసా

ఇంఫాల్/చురాచంద్‌పూర్: మణిపూర్‌లో కొత్త పొద్దు పొడవబోతోందని, శాంతి, సౌభాగ్యానికి చిహ్నంగా రాష్ట్రం నిలుస్తుందని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. భావితరాల ఉజ్వల భవిష్యత్‌కు శాంతి పథంలో బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కుకీ-మయితే గిరిజన తెగల మధ్య అల్లర్లతో 2023 మే నుంచి అట్టుడికిపోయిన మణిపూర్ రాష్ట్రాన్ని ప్రధాని మోదీ ఎట్లకేలకు సందర్శించారు.

అదే విధంగా మిజోరం, అసోం రాష్ట్రాల్లోనూ పర్యటించారు. మోదీ శనివారం చురాచంద్‌పూర్‌లో, ఇంఫాల్‌లోని కంగ్లా ఫోర్టు వద్ద నిర్వహించిన సభలలో మాట్లాడారు. మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య శాంతి నెలకొల్పేందుకు కేంద్రప్రభుత్వం నిరంతర కసరత్తు చేస్తున్నదని, హింస జరగడం దురదృష్టకరమని అన్నారు. 'ఈరోజు మీకో వాగ్దానం చేస్తున్నా. కేంద్రప్రభుత్వం మీ వెంటే ఉంటుంది. నేను మీకు తోడుగా నిలుస్తా. అన్ని సంఘాలు, వ్యవస్థలు శాంతి పథాన్ని ఎంచుకోవాలని, హింసను వీడాలని కోరుతున్నాను' అని మోదీ వక్కాణించారు. శాంతి నెలకొంటేనే అభివృద్ధి సాధ్యమని, అందుకోసం సర్కారు కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్రంలో రైల్వే-రోడ్డు అనుసంధానం ప్రాజెక్టుల బడ్జెట్ కేటాయింపులను కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. 2014 నుంచి మణిపూర్‌లో కనెక్టివిటీ మెరుగుదలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. భారత్ త్వర్లోనే మూడో ఆర్థిక శక్తిగా నిలవబోతోందని, అభివృద్ధి ఫలాలు దేశ నలుమూలలకు అందాలని కోరుకుంటున్నానని మోదీ తెలిపారు. వీరులగడ్డ మణిపూర్ అని శ్లాఘించారు. రాజధాని ఇంఫాల్ నుంచి రోడ్డు మార్గంలో చురచాంద్పూర్‌కు వచ్చే క్రమంలో తనకు లభించిన ప్రేమాభిమానాన్ని ఎప్పటికీ మరువబోనని మోదీ తెలిపారు. 'హింస బాధితులను పరామర్శించాను, నిరాశ్రయులతో మాట్లాడాను. మణిపూర్‌లో కొత్త పొద్దు పొడుస్తోందని కచ్చితంగా చెప్పగలను. ప్రజలు శాంతి పథాన్ని ఎంచుకున్నారు' అని ప్రధాని అన్నారు. 'మౌలికవసతులు, ఆరోగ్య సంరక్షణ కల్పనే ధ్యేయంగా రూ.7,300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశానన్నారు. ఈ ప్రాజెక్టులతో రాష్ట్ర ప్రజల జీవితాలు మెరుగవుతాయని, ముఖ్యంగా గిరుల్లోని తెగలకు ప్రయోజనం ఉంటుందని మోదీ తెలిపారు. హింసలో సర్వం కోల్పోయిన కుటుంబాల కోసం ఏడు వేల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తోందని, రూ.3వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి ఇప్పటికే మంజూరు కాగా... మరో రూ.500 కోట్లను నిర్వాసితుల కోసం ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడించింది. మణిపూర్ పేరులో 'మణి' ఉన్నదని, రాబోయే రోజుల్లో యావత్ ఈశాన్యంలోనే పేరుకు తగ్గట్లు ఈ రాష్ట్రం మెరుస్తుందన్నారు. ప్రజా విశ్వాసాన్ని పునరుద్ధరించడం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గిరులు, లోయ ప్రాంతాల ప్రజల మధ్య తెగిన నమ్మకమే వంతెనను బలంగా పున:నిర్మిద్దామన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంలో మణిపూర్ వీరపుత్రులు కీలక పాత్ర పోషించారని. రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో మణిపూర్ మహిళలు అగ్రభాగాన నిలుస్తున్నారని, 21వ శతాబ్దం ఈశాన్య భారతానిదే అని మోదీ అన్నారు. అంతకుముందు ఇంఫాల్‌లోని చారిత్రక కంగ్లా ఫోర్ట్ కంప్లెక్స్, చురాచంద్‌పూర్ శాంతి మైదానంలోని నిర్వాసిత కుటుంబాల (ఐడీపీలు)ను ప్రధాని కలిశారు. రాష్ట్రంలో శాంతి, సామన్య పరిస్థితులు నెలకొల్పుతామని భరోసానిచ్చారు. చురాచంద్‌పూర్ శిబిరానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. కొత్త పొద్దుపై మణిపూర్ ఆశలు చిగురిస్తాయని నమ్మకంగా చెప్పగలనని మోదీ అన్నారు. ఇదిలావుంటే, హింస కారణంగా 40వేల మంది కుకీ జోలు, 20వేల మంది మయితే వర్గీయులు కలిపి 60వేల మంది నిర్వాసితులయ్యారు. వీరిలో కొందరు రాష్ట్రాన్ని వీడగా, చాలా మంది శిబిరాల్లో ఉంటున్నారు. బాధితులకు మెరుగైన జీవితాన్ని అందించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హింసలో 260 మందికిపైగా చనిపోవడం తెలిసిందే.

సముద్ర అధ్యయనానికి

సరికొత్త సాంకేతికత

ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్

చెన్నై: సముద్ర గర్భంలోని రహస్యాలు తెలుసుకోవడానికి కొత్త పద్ధతులపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. తాజాగా చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) సముద్రం నుంచి డేటా సేకరించడానికి కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. 'బోట్-బేస్డ్ రియల్-టైమ్ టోవ్డ్ ప్రొఫైలింగ్ ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్' అనే కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసినట్లు ఎన్ఐఓటీ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ తెలిపారు. దీని ద్వారా ఫిషింగ్ బోటును ఉపయోగించి సముద్రగర్భంలోని సమాచారం సేకరించే అవకాశం ఉంటుందని చెప్పారు. సముద్రంలోని వాతావరణం, జీవరాశులు, ఖనిజాలు మొదలైన విషయాలకు సంబంధించిన సమాచారం సేకరించి... అధ్యయనం చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. హిందూ మహాసముద్రంలోని డేటాను కొలవడానికి గతంలో స్థిర లేదా లంగరు వేయబడిన పెద్ద పరిశోధనా నౌకలు అవసరమయ్యేవి. ప్రస్తుతం రూపొందించిన 'బోట్-బేస్డ్ రియల్-టైమ్ టోవ్డ్ ప్రొఫైలింగ్ ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్'తో తీర మైదాన ప్రాంతాలు, నదులు సముద్రంలో కలిసే నదీ ముఖద్వారం వద్ద కూడా తక్కువ నిర్వహణ ఖర్చులతో కచ్చితమైన సముద్ర డేటా సేకరించే అవకాశం ఉంటుందని ఎన్ఐఓటీ డైరెక్టర్ వెల్లడించారు. దీని కోసం రూపొందించిన 'బోట్ ఫేస్ట్ రియల్ టైమ్ డేవిట్ మెరైన్ మానిటరింగ్ పరికరాన్ని' ఒక పడవలో ఇన్‌స్టాల్ చేసి...సముద్రంలోకి వెళ్లాక యాక్టివేట్ చేయాలని తెలిపారు. వర్షపాతానికి సంబంధించిన వివరాలను కూడా దీని నుంచి తెలుసుకోవచ్చన్నారు. బంగాళాఖాతంలోని ఎన్నూర్ సముద్ర తీరంలో ఈ పరిశోధనను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పలస్తీనాకే భారత్ ఓటు

న్యూయార్క్: పలస్తీనా ఏర్పాటు కోసం ఐక్యరాజ్య సమితిలో పెట్టిన తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటేసింది. ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య శాంతియుత పరిష్కారం, 'రెండు దేశాల పరిష్కార మార్గం' అమలుపై న్యూయార్క్ డిక్లరేషన్‌ను ఆమోదించే తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఫ్రాన్స్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 142 దేశాలు మద్దతు తెలిపాయి. 10 దేశాలు వ్యతిరేకించాయి. 12 దేశాలు గైర్హాజరయ్యాయి. అన్ని గల్ఫ్ దేశాలు పలస్తీనాకు అనుకూలంగా ఓటు వేయగా... ఇజ్రాయిల్, అమెరికా, అర్జెంటీనా, హంగేరి, నార్వే, పపువా న్యూగినియా, టాంగా లాంటి దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడిని 193 సభ్యుల జనరల్ అసెంబ్లీ ఖండించింది. 'పలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం, రెండు-రాష్ట్రాల పరిష్కారం అమలుపై న్యూయార్క్ ప్రకటనకు ఆమోదం' అనే తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన 142 దేశాలలో భారతదేశం కూడా ఉంది' ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ జులైలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ఫ్రాన్స్, సౌదీ అరేబియా సంయుక్తంగా నిర్వహించిన ఉన్నతస్థాయి అంతర్జాతీయ సమావేశంలో ప్రకటన విడుదలైంది. 'గాజాలో యుద్ధాన్ని ముగించడానికి, రెండు-రాష్ట్రాల పరిష్కారాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ఆధారంగా ఇజ్రాయిల్-పలస్తీనా వివాదానికి న్యాయమైన, శాంతియుతమైన శాశ్వత పరిష్కారాన్ని సాధించడానికి, పలస్తీనియన్లు, ఇజ్రాయిల్‌లు ఆ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన భవిష్యత్తును నిర్మించడానికి సమష్టి చర్య తీసుకోవడానికి అంగీకరించాం' అని నాయకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రకటన పలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుకు మద్దతును పునరుద్ఘాటించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.